www.andhrajyothy.com
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
వెల (Price) : Rs. 8.00
సంపుటి (Volume) : 60
సంచిక (Issue) : 226
విజయవాడ సిటీ*
పేజీలు: 12 + 16 + 32 పేజీల
ఆదివారం అనుబంధం
ఆదివారం 1-12-2019
శ్రీవికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: పంచమి రా. 7.14 తదుపరి షష్ఠి; నక్షత్రం: ఉత్తరాషాఢ ఉ. 9.41 తదుపరి శ్రవణం; వర్జ్యం: మ. 2.01-3.45; దుర్ముహూర్తం: సా. 4.07-4.52; అమృతఘడియలు: రా. 12.26-2.10; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.33; సూర్యాస్తమయం: 5.36
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai

## జోరు వాన..

తిరుమలలో శనివారం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి ఓ మాదిరిగా ఉన్న వర్షం.. సాయంత్రం ఓ గంటపాటు ఏకధాటిగా కురిసింది. దీంతో శ్రీవారి దర్శనానికి వచ్చిన భక్తులు తడిసిముద్దయ్యారు. మాడవీధుల్లో సంచరిస్తున్న పలువురు భక్తులు జారిపడ్డారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవను వైభవోత్సవ మండపంలో నిర్వహించారు. ఉత్సవర్లను ఘటాటోపం కింద ఊరేగించారు. పొగమంచు అలుముకొని ఉండడంతో చలి తీవ్రత బాగా పెరిగింది.



తిరుమలలో శనివారం కుండపోత వర్షం




## నాకు గన్ లైసెన్స్ ఇవ్వండి

ఇంట్లోంచి బయటకు వెళ్లాలంటే భయమేస్తోంది

పొద్దున కాలేజీకి వెళితే వచ్చేసరికి రాత్రి అవుతోంది

100ఫోన్ చేసినా పోలీసులొస్తారనే నమ్మకం లేదు

లైసెన్స్ ఇవ్వకుంటే ఉద్యోగం వదిలేసి ఇంట్లోనే ఉంటా

వరంగల్ సీపీకి ప్రభుత్వ మహిళా లెక్చరర్ విజ్ఞప్తి

## నా దేశంలో నాకు భద్రత లేదే?

11

**పార్లమెంట్ వద్ద ఓ యువతి ఒంటరి పోరాటం**

**ఆమెను పోలీసులు వేధించారు: ఢిల్లీ మహిళాకమిషన్**

'నాకు గన్ లైసెన్స్ ఇవ్వండి' అని మహిళా లెక్చరర్ విన్నపం! 'ఈ దేశంలో నాకు భద్రత ఎక్కడ' అంటూ పార్లమెంటు వద్ద ఓ యువతి సూటి ప్రశ్న! ...అవును! ఆమె... భయపడుతోంది! బయట అడుగు పెడితే మళ్లీ క్షేమంగా ఇంటికి వస్తానో రానో అనే సందేహం వెంటాడుతోంది. ఎటు చూస్తే అటు అత్యాచారాలు, దాడుల నేపథ్యంలో భద్రత కోసం ఆమె గళమెత్తింది.

# వెంకన్న వెబ్‌సైట్‌లోకి.. యేసయ్య!

## టీటీడీ వెబ్‌సైట్‌లో అన్యమత ప్రచారం

- క్యాలెండర్ సెర్చ్‌లో పరమత నామం
- సోషల్ మీడియాలో హోరెత్తిన విమర్శలు
- గూగుల్‌దే తప్పు అనేలా అధికారుల వాదన
- కావాలనే చేశారన్నది నిపుణుల మాట
- తేలిగ్గా తీసుకున్న టీటీడీ అధికారులు
- సొంతంగా విజిలెన్స్ విచారణకు ఆదేశం




https://www.tirumala.org › T... PDF
vikari nama samvatrasa panchangam - 2019-20 - 20-2-2019 ... - Tirumala Tirupati Devasthanams
06-Apr-2019 · శ్రీయేసయ్య. శ్రీ వేంకటేశాయ నమః. శ్రీవికారినామసంవత్సర. సిద్ధాన్త పంచాబ్దము. 2019 - 2020 . . TIRUPATI. Fit.

టీటీడీ పంచాంగం సమాచారంలో యేసయ్య పేరు

తిరుమల తిరుపతి దేవస్థానం వారి 2020 క్యాలెండర్ విడుదలైంది!

టీటీడీ క్యాలెండర్ అంటే శ్రీవారి భక్తుల్లో ప్రత్యేక ఆసక్తి! ఇంటర్నెట్‌లో దాని పీడీఎఫ్ పెట్టారేమో, ఒక్కసారి చూద్దాం అని నెటిజనులు అనుకున్నారు. '2020 పీడీఎఫ్ తిరుమల' అని గూగుల్‌లో సెర్చ్ చేశారు. ఫలితాలు శరవేగంగా వచ్చాయి. కానీ వాటిని చూస్తూనే భక్తజనానికి పెద్ద షాక్!

(తిరుపతి - ఆంధ్రజ్యోతి)

టీటీడీ క్యాలెండర్ కోసం ఇంటర్నెట్‌లో సెర్చ్ చేస్తే వచ్చిన ఫలితాల్లో మొదటిది... 2019-20 వికారి నామ సంవత్సర టీటీడీ పంచాంగం! ఒక్కసారి ఆ వివరాలను తరచి చూడగా... 'శ్రీ యేసయ్య! శ్రీ వెంకటేశాయనమః శ్రీవికారి నామ సంవత్సర సిద్ధాన్త పంచాబ్దము' అని కనపడింది. టీటీడీ అధికారిక వెబ్‌సైట్ సమాచారంలో... 'శ్రీ యేసయ్య' అనే అక్షరాలు చూసి వెంకన్న భక్తులు విస్మయానికి గురయ్యారు. వేంకటేశ్వరస్వామి వెబ్‌సైట్‌లోనూ అన్యమత ప్రచారమేమిటని విస్తుపోయారు. పకడ్బందీగా నిర్వహించే టీటీడీ వెబ్‌సైట్‌లోకి

మిగతా 2వ పేజీలో...

### ఈ టీటీడీకి ఏమైంది?

**తరచూ అన్యమత వివాదాలు**

**మొన్నటికి మొన్న క్రైస్తవ కీర్తనలు**

**నేడు మళ్లీ వెబ్‌సైట్‌కు కన్నం**


ఆరు నెలల జగన్ పాలనపై 'మంచి సీఎం కాదు.. జనాన్ని ముంచే సీఎం' అంటూ ప్రచురించిన బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న టీడీపీ నేతలు

## మంచి సీఎం కాదు.. ముంచే సీఎం

- 6 నెలల పాలనంతా విధ్వంసమే
- ప్రజా వేదిక కూల్చివేతతో శ్రీకారం
- అమరావతి, పోలవరం నిలిపివేత
- వడ్డించిన విస్తరిని చేతికి అందిస్తే కొద్ది నెలలకే అంతా తలకిందులు
- పెట్టుబడులు రాకుండా భయస్థితి
- రుణాలను ఇస్తామన్న బ్యాంకులూ ఆ ప్రతిపాదనల నుంచి వెనుకంజ
- ఆదా కోసం రివర్స్ అని చెబుతూ వైసీపీ రంగులకే రూ.1300 కోట్లు
- 6 నెలల పాలనపై టీడీపీ చార్జిషీట్

8


కన్నీటి చుక్కలే.. నిప్పు కణికలై..

పిడికిళ్లు బిగిశాయి. నినాదాలు నింగినంటాయి! వారిది ఒకటే మాట! విచారణలో జాప్యం వద్దే వద్దు. మగ రూపంలోని మృగాలను మీరే చంపాలి. లేదా... మాకు అప్పగిస్తే మేం చూసుకుంటాం! ప్రియాంకపై అత్యాచారం చేసి చంపిన నిందితులపై పెల్లుబికిన ప్రజాగ్రహమిది!



## ప్రజాగ్రహం

**ప్రియాంక నిందితులను అప్పగించాలని ప్రజల డిమాండ్**

- రాణాలోకి చొచ్చుకెళ్లేందుకు యత్నం
- తీవ్ర ఉద్రిక్తత.. పలుమార్లు లాఠీచార్జి
- రణరంగంగా పోలీసు స్టేషన్ పరిసరాలు
- ఉదయం 8.30 నుంచి సాయంత్రం 4.30 వరకూ ఎనిమిది గంటలపాటు హైడ్రామా
- పోలీసులపై చెప్పులు, రాళ్ల విసిరివేత
- స్టేషన్లోనే నిందితులకు వైద్య పరీక్షలు
- తహసీల్దార్ రాణాకే వచ్చి రిమాండ్ విధింపు

షాద్‌నగర్/అర్బన్/రూరల్, నవంబరు 30: షాద్ నగర్ పోలీసు స్టేషన్! శనివారం ఉదయం 8.30 గంటలు! వైద్య పరీక్షలు నిర్వహించడానికి డాక్టర్ ప్రియాంక రెడ్డిని అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను శుక్రవారం రాత్రే అక్కడికి తీసుకొచ్చారు! కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ విషయం

మిగతా 11వ పేజీలో...


తండ్రి విగ్రహం వద్ద ఉద్ధవ్ ఠాక్రే

## 'సేన'కు సభ సై

- బలం చాటుకున్న ఉద్ధవ్ 10
- సర్కార్‌కు 169 మంది మద్దతు
- 105 మందితో బీజేపీ వాకౌట్
- తండ్రి పేరిట ఉద్ధవ్ ప్రమాణం
- ఫడణవీస్ మండిపాటు
- మళ్లీ అదే తప్పు చేస్తానన్న ఠాక్రే

## ఆర్టీసీలో వీఆర్ఎస్ అలజడి!

- తప్పుకొనే యోచనలో ఇద్దరు ఈడీలు, అధికారులు
- తగ్గనున్న జీతం, పింఛనూ ఉండదని తేలడం వల్లే 10

# రాజధాని ఇక్కడే!

### ఎక్కడికీ పోదు.. అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడతా

**అమరావతి రైతులకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హామీ**

తుళ్లూరు, తాడేపల్లి, హైదరాబాద్, నవంబరు 30: 'ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేసిన రాజధాని ఎక్కడికీ పోదు' అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి రాజధాని ప్రాంత రైతులకు హామీ ఇచ్చారు. సీఆర్‌డీఏ పరిధిలో రాజధానికి భూములు ఇచ్చిన వివిధ గ్రామాల రైతులు హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా దేశ పటంలో నవ్యాంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి గుర్తింపు ఇచ్చినందుకు

మిగతా 8వ పేజీలో...


కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న రాజధాని రైతులు

## ఉగాది తర్వాత పదవులు




నూతన సంవత్సరం ఆరంభం నుంచే రాజకీయ దూకుడుకు వైసీపీ సన్నద్ధం

'స్థానిక' పోరునూ దాటేయాలన్నదే వ్యూహం

పాలనకు అసంతృప్తి అడ్డు కారాదన్నదే అభిప్రాయం

**నామినేటెడ్ పంపకాలపై నిర్ణయం!**

అమరావతి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తొమ్మిదేళ్లపాటు పార్టీ కోసం అవిశ్రాంతంగా కృషి చేసిన వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకత్వం పదవుల పంపకాల ప్రక్రియ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తోంది. అయితే దీనిపై ఆ పార్టీ అధిష్ఠానం నిర్దిష్టమైన అభిప్రాయాలతోనూ, వ్యూహంతోనూ ఉన్నట్లు సమాచారం. 2019 సార్వత్రిక ఎన్నికల్లో భారీ విజయాన్ని చవిచూసిన వైసీపీ పాలనపైనే దృష్టి సారించింది. పార్టీ కార్యకలాపాలపై

మిగతా 8వ పేజీలో...

## పోస్ట్‌మెట్రిక్ విద్యార్థులకు 'దీవెన'

10

- ఈ ఏడాది నుంచే విద్యా పథకాలు
- రెండు విడతలుగా ఖాతాకు డబ్బు
- 'విద్యా' నిధి కాలేజీకి, 'వసతి' తల్లికి
- రెసిడెన్షియల్, హాస్టళ్లకు వర్తించదు
- ప్రభుత్వ మార్గదర్శకాలు విడుదల








పరంజ్యోతి



## భగవన్నామ మహిమ

*"సతతం కీర్తయన్తో మాం యతన్తశ్చ దృఢవ్రతాః నమస్యన్తశ్చ మాం భక్త్యా నిత్యయుక్తా ఉపాసతే" (భ.గీ. 9/14)*

'నా భక్తులు నన్ను ఎల్లప్పుడూ దృఢవ్రతులై ప్రయత్నిస్తూ, భక్తితో నమస్కరిస్తూ, నాయందు చిత్తాన్ని నిలిపి, నన్నే సేవిస్తారు' అంటాడు శ్రీకృష్ణుడు భగవద్గీతలో. కీర్తన వాఙ్మయ రూపం. వాక్కు మన దేహంలో అగ్నితత్వం. మనస్సు వాయు తత్వం. అగ్నిదేవుడికి వాయుసఖుడని పేరు. కాబట్టి ఎక్కడ అగ్ని ఉంటే వాయువు కూడా అతనికి తోడుగా ఉంటాడు. నామకీర్తనకు, మనస్సుకు అలాంటి దగ్గరి సంబంధం ఉంది. మనం ఏ మాట మాట్లాడుతున్నా అది వాయువు సహాయంగానే జరుగుతుంది. మన మనస్సు వాయుతత్వమే కాబట్టి మనం మాట్లాడేటపుడు మనస్సు కూడా వెంట నిలుస్తుంది. అలాగే ఇష్టమైనవి వింటున్నపుడు గానీ, చదువుతున్నపుడు గానీ అక్కడ మనస్సు కూడా నిలుస్తుంది. ప్రత్యేకించి సంగీతానికి ఆకర్షణ శక్తి స్వతసిద్ధంగానే ఉంది. కాబట్టి ఎంత కఠిన తపం చేసినా స్థిరంగా ఉండని మనస్సు సంగీతం దగ్గర నిలిచిపోతుంది. అందువల్ల భగవంతుని చేరేందుకు దారిదీపం వంటిది కీర్తన.

మనస్సు కోతి వంటిది. అది కల్లు తాగింది. దానికి తేలు కరిచింది. పైగా దయ్యం పట్టింది. ఆ తర్వాత నిప్పు తొక్కింది. అంతఃకరణంలోని మనస్సు ఇంత చంచలంగా మన శాస్త్రాలు వర్ణించాయి. అలాంటి మనస్సును అరికట్టి, ఆత్మగా మార్చి, భగవంతుని వైపు ఏకోన్ముఖంగా చేయడమే యోగం. యోగం అభ్యసిస్తే చిత్తవృత్తుల నిరోధం అవుతుందని పతంజలి చెప్పాడు. మన వాళ్లు ఇంకా అనేక ఉపాయాలు సూచించారు. దేవుడిని 'శబ్దబ్రహ్మ'గా చెప్పారు. అది ఆద్యంతాలు లేని సత్యరూపం. ఆ శబ్దం నామంగా మారితే అది స్తోత్రం, కీర్తన అవుతుంది. ఆ శబ్దాన్ని కన్నులు మూసుకొని ధ్వనించగానే రూపం, గుణం, లీల.. అన్నీ దర్శనమిస్తాయి. ఆ శబ్ద బ్రహ్మోపాసన వాదరూపంగా సంగీతజ్ఞులు ఉపాసిస్తే, వేదజ్ఞులు చర్మచక్షువులకతీతంగా దర్శించారు.

సంకీర్తనలు యోగానికి దారి చూపిస్తాయి. జీవుడు స్వయంగా నాదబ్రహ్మకు అభివ్యక్తి కాబట్టి ధ్వనితో కూడిన 'భగవన్నామాలు' సాధకులపై అప్పటికపుడు ప్రభావం చూపిస్తాయి. షట్చక్రాలు, కుండలి వంటి శక్తులను చైతన్యం చేస్తాయి. ఆ స్థితి ఆనంద బ్రహ్మమైనది. అది పొందిన తర్వాత కలిగే అనుభూతిని సమాధిగా యోగులు చెప్తారు. దానిని శాశ్వతంగా నిలబెడితే యోగం. సిద్ధత్వం కలిగినపుడు అంతటా, అందరిలోని ఆత్మభావనను నిరంతరం దర్శించాక ఇక సాధనలు ఉండవు. ఆ స్థితే సాధకులుగా మారిపోతుంది. చరాచర భూతాల్లోని తత్వానికి రామ, కృష్ణ, శివ... వంటి నామాలు తారకమంత్రాలు అవుతాయి. శ్రీరామ నామ సాధన చేత హనుమంతుడు వారధి దాటడం అంటే అదే స్థితి. మాలదాసరి బ్రహ్మ పిశాచానికి ముక్తి కల్పించడం ఈ నామశక్తి ధారపోయడం వల్ల అని ప్రబోధించే కథలు ఈ తత్వాన్ని మనకు అందించేందుకే. అందుకే 'భక్తులై స్వస్వరూపం వదిలిన వారు, దైవప్రకృతి గల వారు ఎల్లప్పుడూ కీర్తిస్తూ సేవిస్తారు' అంటూ శ్రీకృష్ణ పరమాత్మ ఉద్ధవుడికి భాగవతంలో ఈ భగవన్నామ మహిమను దృష్టిలో పెట్టుకొనే చెప్పారు.

- డా॥ పి. భాస్కరయోగి



## ఉల్లి 120 నాటౌట్..

### ఉత్పత్తి లేక గిరాకీ.. ధర పైపైకి..

### రైతుబజార్ల వద్ద జనం పడిగాపులు

అమరావతి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే సెంచరీ కొట్టేసిన ఉల్లి ధర.. రోజురోజుకీ పైకి ఎగబాకుతూనే ఉంది. కిలో ఉల్లిపాయలు రూ.110 పలుకుతున్నాయి. నాణ్యమైన పాయలైతే దుకాణాల్లో రూ.120 చొప్పున విక్రయిస్తున్నారు. కాస్త చిన్నపాయలైతే రూ.100 చెబుతున్నారు. ధరలు రోజురోజుకీ కొండెక్కుతుండడంతో చిన్న చిన్న దుకాణాల్లో ఉల్లిపాయలే అమ్మడం లేదు. ఇంతకుముందు బస్తాలు బస్తాలు తెప్పించి అమ్మిన వ్యాపారులు అర బస్తా తెప్పించడానికే జంకుతున్నారు. ఉల్లి గిరాకీ మరో నెల దాకా ఉంటుందని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. మహారాష్ట్రలో పంట దెబ్బతినడం, తెలుగు రాష్ట్రాల్లో పంట మార్కెట్‌లోకి రావడానికి నెల సమయం ఉండడంతో ఉల్లికి డిమాండ్ బాగా పెరిగింది. కేంద్ర ప్రభుత్వం ఈజిప్టు నుంచి ఉల్లి దిగుమతి చేసుకుంటున్నట్లు ప్రకటించినా.. ఆ సరుకు ఇంకా రాష్ట్రాలకు చేరలేదు. రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ స్థిరీకరణ నిధి నుంచి కిలో ఉల్లిని రూ.45 చొప్పున కొనుగోలు చేసి, రూ.25కే రైతుబజార్లలో సరఫరా చేస్తోంది. అయితే వాటిని నిర్ణీత సమయాల్లోనే ఇస్తుండడంతో రైతుబజార్ల వద్ద జనం క్యూలో పడిగాపులు కాస్తున్నారు. రైతుబజార్లు లేని పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు దుకాణాల్లో కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోనూ రాయితీ ఉల్లిని పంపిణీ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఈ టీటీడీకి ఏమైంది?

## తరచూ అన్యమత వివాదాలు | మొన్నటికి మొన్న కీర్తనలు

- నేడు మళ్లీ వెబ్‌సైట్‌కు కన్నం..
- సిబ్బందిలోనే పలువురి 'రహస్య' మతావలంబన
- కఠిన చర్యలకు భక్తుల డిమాండ్

(తిరుపతి - ఆంధ్రజ్యోతి)

కోట్లాది మంది హిందువులకు పరమ పవిత్రమైన పుణ్యక్షేత్రం తిరుమల. ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షమందికి ఉపాధి కల్పిస్తున్న ధార్మిక సంస్థ. ప్రపంచంలోనే అత్యంత సంపన్నమైన ఆధ్యాత్మిక సంస్థ! ఇటువంటి టీటీడీ తరచూ అన్యమత వివాదంలో చిక్కుకుంటోంది. రెండు నెలల కిందట టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌లోని సంకీర్తనల్లో అన్యమత దైవాన్ని స్తుతించే పాటలు వినిపించాయి. ఇప్పుడు... పంచాంగం లింక్‌లో 'శ్రీయేసయ్య' నామం కనిపించింది. ఏళ్ల తరబడి వరుస వివాదాలు వెలుగు చూస్తున్నా యంత్రాంగం తగిన విధంగా స్పందించడంలేదు. అప్పటికప్పుడు దిద్దుబాటు చర్యలు తీసుకోవడం, ఆ తర్వాత వదిలేయడం! ఇదో ప్రహసనంగా మారిపోయింది. టీటీడీలో మూడు దశాబ్దాల కిందటే అన్యమతస్తుల ప్రవేశం మొదలైంది. అప్పట్లో టీటీడీలో హిందూయేతరులను నియమించరాదన్న నిబంధన అమల్లో లేదు. దీంతో ఇతర మతస్తులు టీటీడీలో ఉద్యోగాలు పొందారు. 1988లో అన్యమతస్తులను ఉద్యోగాల్లో నియమించకూడదన్న నిబంధన విధించారు. ఇందులో టీటీడీ విద్యాశాఖను మాత్రం మినహాయించారు. 2007లో విద్యాశాఖలో కూడా హిందూయేతరులను నియమించరాదంటూ ప్రభుత్వం జీవో జారీ చేసింది.



### పదేపదే ప్రచారం...

2014 అక్టోబరు 29న తిరుమలలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్న సమయంలోనే ప్రకాశం జిల్లాకు చెందిన మొండితోక సుధీర్ అనే వ్యక్తి తన అనుచరులతో వాహనంలో అలిపిరి నుంచీ బయల్దేరి ఘాట్ రోడ్డు వెంబడి అన్యమత ప్రచారం సాగిస్తూ దాన్ని వీడియోలో చిత్రీకరించారు. అలాగే తిరుమల చేరుకుని ఏకంగా శ్రీవారి ఆలయం ముందే ప్రార్థనలు కూడా జరిపారు. దీనిపై దేశవ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు వ్యక్తం కావడంతో సుధీర్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. 2015 ఫిబ్రవరి 25న శ్రీవారి ఆలయం ఎదుట మహామణిమండపం వద్ద సిమెంట్ దిమ్మెలపై శిలువ చిహ్నాలు కనిపించాయి. తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో సైతం అన్యమత చిహ్నాలు వెలుగు చూశాయి. వివాదాస్పద సంఘటనలు జరిగినప్పుడు తూతూ మంత్రం చర్యలతో సరిపెట్టడం కాకుండా... కఠినంగా వ్యవహరిస్తేనే ఇలాంటివి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని భక్తులు పేర్కొంటున్నారు.

### అయినా... 'అన్య'దారి

నిబంధనలు, సర్టిఫికెట్‌లో అధికారిక మతం ఎలా ఉన్నప్పటికీ... టీటీడీలోని ఉద్యోగుల్లో పలువురు ఇతర మతాలను అనుసరిస్తున్నారన్నది నిజం. ఈ విషయం పలుమార్లు సాక్ష్యాధారాలతో సహా బయటపడింది. టీటీడీలో డిప్యూటీ ఈవోగా స్థాయిలో ఉన్న స్నేహలత 2017 డిసెంబరులో టీటీడీ వాహనంలో చర్చికి వెళ్లి ప్రార్థనలు చేసిన వీడియో వెలుగు చూసింది. ఆ ఉదంతం తర్వాత టీటీడీ ఈ అంశంపై సీరియస్‌గా దృష్టి సారించింది. నిబంధనలకు విరుద్ధంగా మొత్తం 44 మంది దేవస్థానాల్లో పనిచేస్తున్నారని గుర్తించి, వేరే శాఖలకు బదిలీ చేశారు. శ్రీవారి పట్ల భక్తి విశ్వాసాలు కలిగివున్నామంటూ బహిరంగ ప్రమాణాలు చేయడాన్ని విధుల్లో భాగం చేశారు. ఎన్ని చేసినప్పటికీ టీటీడీ సిబ్బందిలో కొందరు గుట్టుచప్పుడు కాకుండా అన్యమత ప్రచారాలు, ప్రార్థనలు సాగిస్తూనే ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి. విజిలెన్స్ సిబ్బంది తిరుమలలో అన్యమత సాహిత్యాన్ని స్వాధీనం చేసుకున్న ఉదంతాలు ఎన్నో!

దేశంలోని మూడు ప్రతిష్ఠాత్మకమైన క్లస్టర్ యూనివర్సిటీలలో కర్నూలులోని సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల ఒకటి. ఎందరో ఐఏఎస్, ఐపీఎస్‌లు చదివిన కళాశాల అది. అదే హుషారును అక్కడి విద్యార్థులు ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. తమ కళాశాలకు జాతీయస్థాయిలో విజయాలను అందిస్తున్నారు. అలాంటి సరస్వతీ నిలయం ఇప్పుడు అన్నపూర్ణ కటాక్షం కోసం ఎదురుచూస్తోంది. రేషన్ బియ్యం ఇచ్చినా చాలు, విద్యార్థుల కడుపు నింపుతానని సర్కారును అర్థిస్తోంది. ఈ కాలేజీ ప్రగతి పథగమనం మాత్రమే తెలిసిన వారు, అక్కడి పస్తుల కథలను విని విస్తుపోతున్నారు!




## మెరిట్ ఉంది..

### సిల్వర్ జూబ్లీ కాలేజీలో ఆకలి కేకలు
### ర్యాంకులు పండేచోట పస్తుల కథలు



# మెనూ లేదు

- ఒక్కొక్క విద్యార్థికి అరకొరగా రూ.35
- సరిగ్గా తింటే కూరకూ చాలని మెనూ
- రేషన్ బియ్యమైనా ఇవ్వాలని వినతి
- మెనూ రూ.45 చేయాలని సర్కారుకు లేఖ

కర్నూలు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి సీఎం పీవీ నరసింహారావు కర్నూలులో సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలకు పునాది రాయి వేశారు. 1972 నుంచి తరగతులు మొదలయ్యాయి. అప్పట్లో ఈ కాలేజీ హాస్టల్ మెనూ చార్జి కింద రోజుకు సుమారు రూ.3 చొప్పున ప్రభుత్వం ఇచ్చేది. ఇప్పుడు హాస్టల్లో 744 మంది విద్యార్థినీవిద్యార్థులు ఉండగా, ఒక్కొక్కరికి రూ.35 చొప్పున, నెలకు రూ.1,050 అందుతోంది. బియ్యం, ఉప్పు, పప్పు అంతా బహిరంగ మార్కెట్‌లో కొని విద్యార్థులకు వడ్డించాలి. దీంతో ప్రభుత్వం ఇచ్చే రూ. 35 మెనూ చార్జిలో ఒక విద్యార్థి ఒక రోజు బియ్యం ఖర్చుకే రూ. 20 పోతోంది. కూరలు,, పెరుగు, పాలు, మాంసం తదితర ఖర్చులను మిగతా రూ. 15లోనే సరిపెట్టుకోవాలి. దీంతో హాస్టల్ విద్యార్థులకు నిర్వాహకులు అరకొరగానే వడ్డించగలుగుతున్నారు. సంక్షేమ హాస్టళ్లలో రూ. 45 చొప్పున ఒకరోజుకు విద్యార్థికి కేటాయిస్తున్నారు. ఇంతే మెనూ తమ హాస్టల్‌కూ అందించాలని విద్యార్థులు కోరుతున్నారు. దీనిపై కళాశాల నిర్వాహకులు ప్రభుత్వానికి లేఖ కూడా రాశారు.

### ఎప్పటికి తేలేనో..

ఈ కళాశాల రెసిడెన్షియల్, సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోకి వస్తుందా లేక మరేదైనా విభాగం కిందకు వస్తుందా అనేది ప్రభుత్వ స్థాయిలో తేలకపోవడమే విద్యార్థుల కష్టాలకు కారణం. అది తేలేదాకా వార్షిక బడ్జెట్‌లో కాలేజీకి నిధులు కేటాయించే పరిస్థితి లేదు! విద్యార్థులు ఏటా చెల్లించే ఫీజులతోనే ఉద్యోగులకు నిర్వాహకులు జీతాలు చెల్లిస్తున్నారని సమాచారం. ఈ పరిస్థితుల్లో భోజనం చాలక చాలా మంది విద్యార్థులు కిడ్నీలో రాళ్లు, గ్యాస్ట్రిక్ సమస్యలతో బాధ పడుతున్నారు.

### కాలేజీ జూబ్లీ చరిత..

భారతావని 25వ స్వాతంత్ర్య వేడుకల ముంగిట నిలిచిన వేళ దేశమంతా సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు సాగాయి. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఈ సందర్భంగా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశమయ్యారు. 'మీ రాష్ట్రాలకు ప్రత్యేక సాయం అందిస్తాం. ఏం కావాలో కోరుకోండి' అని సీఎంలకు ఆమె ఆఫర్ ఇచ్చారు. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పీవీ నరసింహారావు తన రాష్ట్రానికి కేజీ టూ పీజీ వరకు ఒక ఇన్‌స్టిట్యూట్ కావాలని కోరారు. ఆయన వినతికి ఇందిరాగాంధీ సానుకూలంగా స్పందించి, అప్పటికప్పుడే ఆదేశాలు జారీచేశారు. అలా సిల్వర్ జూబ్లీ వేడుకల వేళ ఏర్పడటంతో అదే పేరు ఈ డిగ్రీ కాలేజీకి స్థిరపడింది. ప్రస్తుతం 744 మంది విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు. జమ్ముకశ్మీర్, ఒడిశా తర్వాత కర్నూలులో ఏర్పాటయిన క్లస్టర్ యూనివర్సిటీ ఇదే. దేశంలో మొదటి సారిగా యూనివర్సిటీలకు జాతీయ విద్యాప్రమాణాల ర్యాంకింగ్ పద్ధతిని 2018లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అందులో ఆ ఏడాది 35 స్థానం, 2019 విద్యాసంవత్సరానికి 65వ ర్యాంక్‌ను సిల్వర్ జూబ్లీ కళాశాల సాధించింది. ల్యాబ్ పరికరాలు ఉంటూ పరిశోధనలు జరుపుతున్న కళాశాలగా సైన్సు విభాగంలో మొదటిస్థానంలో నిలిచింది. 2006లో న్యాక్ గ్రేడ్-ఏ, 2014లో న్యాక్ గ్రేడ్-ప్లస్1గా గుర్తింపు సాధించింది. ఈక్రమంలో గ్రేడ్ స్థాయి పెరిగాక విద్యార్థుల సీట్ల సంఖ్యను 2006 నుంచి అంచెలంచెలుగా పెంచుతూ వచ్చారు. ఇలా 100 సీట్లతో ప్రారంభమైన ఈ కళాశాల ప్రస్తుతం 850 సీట్లకు చేరింది. అలాగే, తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు విద్యనందిస్తున్న ఏకైక యూనివర్సిటీ ఇదే. అలాంటి కాలేజీ కోసం తెలంగాణ నుంచి కూడా ఆర్థిక సాయమందితే కొంత ఊరట కలిగే అవకాశముంటుంది. ఐవైఆర్ కృష్ణారావు సీఎస్‌గా ఉన్న సమయంలో దీనిపై ప్రత్యేకంగా జీవో తెచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినా చివరిదాకా అది అమలుకాలేదు.

### పూర్వ విద్యార్థి పెద్దమనస్సు

ఇన్‌కంట్యాక్స్ ప్రిన్సిపల్ సెక్రటరీగా గత ప్రభుత్వంలో పనిచేసిన భూపాల్‌రెడ్డి 2017లో సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలకు ఒక ఏడాదికి సరిపడా రేషన్ బియ్యాన్ని మంజూరు చేశారు. భూపాల్‌రెడ్డి ఈ కాలేజీ పూర్వ విద్యార్థి. ఆయన పెద్ద మనసు ఆ ఏడాది విద్యార్థుల ఆకలి తీర్చింది. ఆ రేషన్ బియ్యాన్ని ఏడాది తర్వాత కూడా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని అప్పటి విద్యా కమిషనర్ సుజాతశర్మకు ఆ సమయంలో కర్నూలు జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎస్.సత్యనారాయణ విన్నవించారు. సత్యనారాయణ కూడా ఈ కాలేజీ పూర్వ విద్యార్థే. హాస్టల్ మెనూ చార్జీల పెంపు కోసం అప్పట్లో ఆయన తీవ్రంగా ప్రయత్నించారు. ఆ ప్రయత్నాలేవీ ఫలించకపోవడంతో, విద్యార్థులకు తిరిగి తిండి తప్పలు తప్పలేదు. ఈ కారణంగానే వారిలో చాలామంది కిడ్నీలో రాళ్లు, గ్యాస్ట్రిక్ సమస్యలతో అర్ధరాత్రులు ఆసుపత్రులకు పరుగెడుతున్నారు. ఇన్ని సమస్యల్లోనూ విద్యాభ్యాసం, క్రీడల్లో ఎక్కడా విద్యార్థులు వెనుకంజ వేయలేదు. జాతీయ స్థాయిలో తమ కళాశాలకు ఉన్న గుర్తింపును వారు నిలబెడుతూ వస్తున్నారు. ఏటా ఢిల్లీలో జరిగే ఆర్డీసీ (రిపబ్లిక్ డే క్యాంప్), టీఎస్సీకు(తల్ సైనిక్ క్యాంపు) ఈ ఏడాది 49 మంది ఎంపికయ్యారు.

## వెంకన్న వెబ్‌సైట్‌లోకి...

# యేసయ్య!

(మొదటి పేజీ తరువాయి)

ఎవరు, ఎలా చొరబడగలిగారని ఆశ్చర్యపోయారు. ఈ వ్యవహారం సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారమైంది. విషయం టీటీడీకి కూడా చేరింది. శ్రీవారి వెబ్‌సైట్ సమాచారంలో అన్యమత ప్రస్తావనపై టీటీడీ కాల్‌సెంటర్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వీహెచ్‌పీ, ఇతర హిందూ సంఘాల నేతలు ఈ విషయాన్ని ఈవో దృష్టికి తీసుకెళ్లారు. శనివారం మధ్యాహ్నం దాకా గూగుల్‌లో సెర్చ్ చేసినప్పుడు 'శ్రీయేసయ్య' అక్షరాలు కనిపిస్తూనే ఉన్నాయి. ఆ 'లింక్'ను క్లిక్ చేసినప్పుడు మాత్రం '404 ఎర్రర్' ప్రత్యక్షమైంది. అంటే... పేజీ తెరుచుకోకుండా బ్లాక్ చేసేసింది. శనివారం రాత్రికి లింక్‌ను పూర్తిగా తొలగించి గూగుల్ సెర్చ్‌లో కనపడకుండా చేశారు.

### అసలేం జరిగింది? ఎవరి పని?

వికారి నామ సంవత్సర పంచాంగాన్ని టీటీడీ ఏప్రిల్ 6న(ఉగాది) అప్‌లోడ్ చేసినట్లు తెలుస్తోంది. ఈ పంచాంగం చక్కగానే ఉంది. ఎక్కడా తేడా లేదు. 'శ్రీ ఐ నమః.... శ్రీ వేంకటేశాయ నమః' అని ఉండాల్సినచోట... 'శ్రీయేసయ్యః శ్రీవేంకటేశాయనమః' అని మారిపోయింది. ఒరిజినల్‌లో సంబంధిత పదం ఉంటేనే గూగుల్ సెర్చ్‌లో కనిపిస్తుందని, లేకుంటే ఎట్టిపరిస్థితుల్లో కనిపించదని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌లోకి ఎవరు, ఎలా చొరబడగలిగారన్నదే శ్రీవారి భక్తులను వేధిస్తున్న ప్రశ్న! ఎవరు పడితే వారు దూరి, తమకు ఇష్టమొచ్చిన సమాచారాన్ని జతచేసేంత బలహీనంగా టీటీడీ వెబ్‌సైట్ ఉందా అనేది వారి అనుమానం.

### నెరుమెదపని అధికారులు

అధికారిక వెబ్‌సైట్‌లో అన్యమత ప్రచారం జరిగినా టీటీడీ అధికారులు స్పందించలేదు. అసలేం జరిగిందనే వివరణ కూడా ఇవ్వలేదు. పైగా... ఇది 'ఇంటర్‌ప్రిటేషన్' వల్ల జరిగిన తప్పిదమంటూ నెపాన్ని గూగుల్‌పైకి నెట్టేశారు. నిజానికి... ఇది ఎవరో ఉద్దేశపూర్వకంగా చేసిన పని. వెబ్‌సైట్‌లో ఉన్నదే గూగుల్ చూపిస్తుంది తప్ప... సొంతంగా ఏమీ చూపదు. పైగా... ఇంటర్‌ప్రిటేషన్‌లో అక్షర దోషాలు దొర్లవచ్చు కానీ, 'శ్రీయేసయ్య' అంటూ కొత్తపదం ప్రత్యక్షం కాదు. ఇది ఉద్దేశపూర్వకంగా చేసిన మార్పు అని నిపుణులు స్పష్టంచేస్తున్నారు.

### తప్పు గూగుల్‌పైకి!

గూగుల్ ఇంటర్‌ప్రిటేషన్ వల్లే ఈ పొరపాటు జరిగిందన్న టీటీడీ వాదన హాస్యాస్పదమని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే... ఈ పంచాంగాన్ని 7నెలల కిందట అప్‌లోడ్ చేశారు. సాంకేతిక తప్పిదమై ఉంటే... విషయం ఎప్పుడో బయటపడేది. టీటీడీలో వెబ్‌సైట్ల నిర్వహణ చూసేందుకు ప్రత్యేకంగా ఐటీ విభాగం వుంది. టీసీఎస్ కంపెనీ సహకారంతో సంయుక్తంగా టీటీడీ వెబ్‌సైట్లను నిర్వహిస్తోంది. పంచాంగాన్ని అప్‌లోడ్ చేశాక గడిచిన ఏడు నెలల కాలంలో లక్షలాది మంది టీటీడీ పంచాంగాన్ని వెబ్‌సైట్‌లో చూశారు. శుక్రవారమే అన్యమత పదం కనిపించింది. అంటే... ఒకటి రెండు రోజుల కిందటే ఈ మార్పు జరిగి ఉండాలి. అయితే... టీటీడీ వెబ్‌సైట్లలోకి ఇతరులు చొరబడడం చాలా కష్టం. నిపుణులైన హ్యాకర్లకే ఇది సాధ్యం. అయితే... సంచలనాలు సృష్టించేందుకు హ్యాకర్లు వెబ్‌సైట్లలోకి ఒక్కసారిగా హల్‌చల్ చేస్తారు. ఇలా నిశ్శబ్దంగా ఒక్కపదం చేర్చి ఊరుకోరు. ఈ నేపథ్యంలో... టీటీడీ వెబ్‌సైట్ 'యాక్సెస్' ఉన్న వారి పాత్రను తోసిపుచ్చలేమని నిపుణులు అంటున్నారు.

### తేల్చాల్సింది ఎవరు?

టీటీడీ వెబ్‌సైట్ సమాచారంలో అన్యమత పదంపై ఉన్నతాధికారులు ఎప్పట్లాగానే 'రొటీన్'గా స్పందించారు. దీనిపై విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. నిజానికి... ఇది సైబర్ నేరం. సైబర్ పోలీసులు రంగంలోకి దిగి కూపీ లాగితే విషయం ఇట్టే తేలిపోతుంది. అసలు దోషులెవరో తెలుస్తుంది. కానీ, విజిలెన్స్ విచారణతో సరిపెట్టడమేమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రెండు నెలల కిందటే టీటీడీ వెబ్‌సైట్‌లో శ్రీవారి సంకీర్తనల్లో అన్యమత దైవాన్ని స్తుతించే కీర్తనలు కనిపించాయి. అప్పుడు టీటీడీ అధికారులు ఆ కీర్తనలు తొలగించి చేతులు దులుపుకొన్నారు. కనీస విచారణకు కూడా ఆదేశించలేదు. ఇప్పుడు కూడా పంచాంగం పేజీని తొలగించేసి, తూతూ మంత్రంగా విచారణకు ఆదేశించారు.

### కఠిన చర్యలు తీసుకుంటాం

టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు, వివాదం రేకెత్తించేందుకు ఎవరో ఇలాంటి చర్యలకు పాల్పడ్డారు. టీటీడీ వెబ్‌సైట్లకు గట్టి భద్రత ఉంటుంది. ఇతరులు చొరబడి మార్పు చేర్పులు చేయడమన్న ప్రసక్తే వుండదు. అయినా వెబ్‌సైట్‌లోని పంచాంగంలో కంటెంట్ మార్చడం ఆశ్చర్యం కలిగిస్తోంది. దీనిపై టీటీడీ ఐటీ బృందం దర్యాప్తు చేస్తోంది. విజిలెన్స్ విచారణకు ఆదేశించాం. ఈ తరహా తప్పిదాలు నమ్మవద్దని భక్తులను కోరుతున్నాం. వీటిని నమ్మడమంటే దీనికి పాల్పడినవారి ఉద్దేశాలను నెరవేర్చడమే. ఇలాంటివి పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటాం!

- బసంత్ కుమార్, టీటీడీ జేఈఓ

## లోకం తీరు




ఇక మీదట మనం ఈ బలపరీక్షలో నెగ్గాల్సి ఉంటుంది సార్!!

### చలికాలం

| కేంద్రం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| కడప | 20.0 | 32.0 |
| గుంటూరు | 20.3 | 31.5 |
| విశాఖపట్నం | 22.4 | 31.2 |
| విజయవాడ | 23.2 | 31.8 |
| చిత్తూరు | 23.9 | 27.0 |



### కోటిన్నర సభ్యత్వాలు లక్ష్యంగా పింఛను వారోత్సవాలు

వ్యాపారులు, స్వయం ఉపాధి పొందుతున్నవారిని ప్రధాన్‌మంత్రి శ్రమ్ యోగి మన్-ధన్ (పీఎం ఎస్‌వైఎం), నేషనల్ పెన్షన్ స్కీమ్ (ఎన్‌పీఎస్)లలో సభ్యులుగా చేర్పించే ఉద్దేశంతో పింఛను వారోత్సవాలను తలపెట్టాం. పీఎం ఎస్‌వైఎం కింద కోటి మందిని, ఎన్‌పీఎస్‌లో 50 లక్షల మందిని చేర్పించడం మా లక్ష్యం.

- కేంద్ర కార్మిక మంత్రి సంతోష్ గాంగ్వార్



### మత మార్పిడికి పాల్పడుతున్న మిషనరీలు

మదర్ థెరిసా నెలకొల్పిన మిషనరీ ఆఫ్ చారిటీ సహా పలు మైనారిటీ సంస్థలు జార్ఖండ్‌లో మత మార్పిడికి పాల్పడుతున్నాయి. దత్తత పేరుతో పిల్లలను విదేశాలకు తరలిస్తున్నాయి. వాటికి విదేశీ నిధులు కూడా వస్తున్నాయి. దీనిపై సీబీఐ దర్యాప్తు చేపట్టాలి.

- నిషికాంత్ దూబే, బీజేపీ ఎంపీ



### గుండెపోటు బాధితులకు మూలకణ చికిత్స

వాషింగ్టన్, నవంబరు 30 : మూల కణ(స్టెమ్ సెల్) చికిత్సతో గుండెపోటు బారిన పడిన వారికి ఉపశమనం కలుగుతుందని అమెరికాలోని హోవర్డ్ హ్యూగ్స్ మెడికల్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు అంటున్నారు. అధ్యయనంలో భాగంగా కొన్ని ఎలుకలకు గుండెపోటు వచ్చే పరిస్థితి కల్పించారు. అనంతరం వాటిలో కొన్నింటికి చనిపోయిన, మరికొన్నింటికి బతికి ఉన్న ఎలుకల గుండె మూలకణాలతో చికిత్స అందించారు. ఇంకా కొన్ని ఎలుకలకు జైమోసాన్ అనే పదార్థాన్ని ఔషధంగా అందించారు. వాటి ప్రభావంతో అన్ని ఎలుకల్లోనూ గుండెపోటుతో దెబ్బతిన్న కణజాలంపై ఏర్పడిన గాయం మానడాన్ని గుర్తించారు.



### టీటీడీ నిత్యాన్నదాన పథకానికి మాజీ సర్పంచ్ రూ.కోటి విరాళం

పటాన్‌చెరు, నవంబరు 30 : సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్, టీఆర్ఎస్ నాయకుడు ఎం.దేవేందర్‌రాజు తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) నిత్యాన్నదాన పథకానికి రూ.కోటి విరాళం అందజేశారు. శనివారం కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని టీటీడీ ఆలయ డిప్యూటీ ఈవో ధర్మారెడ్డికి కోటి రూపాయల డీడీని అందజేశారు. లక్షలాది మందికి నిత్యం అన్నప్రసాదం అందించే మహాయజ్ఞంలో భాగస్వాముడిగా మారినందుకు తమ జన్మ ధన్యమైందని దేవేందర్‌రాజు వ్యాఖ్యానించారు.



## 30 నెలల్లో వెలిగొండ పూర్తి: అనిల్

పెద్ద దోర్నాల, నవంబరు 30: వచ్చే జూన్ నెలాఖరుకు పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి విడత పనులు పూర్తి చేస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి అనిల్‌కుమార్ ప్రకటించారు. అలాగే 30 నెలల్లో ప్రాజెక్టు మొత్తం పూర్తిచేస్తామని చెప్పారు. ప్రకాశం జిల్లాతో పాటు నెల్లూరు, కడప జిల్లాలు ఈ ప్రాజెక్టుతోనే సస్యశ్యామలమవుతాయన్నారు. ప్రకాశం జిల్లా పెద్ద దోర్నాల మండలంలోని కొత్తూరు వద్ద నిర్మిస్తున్న వెలిగొండ ప్రాజెక్టులోని కీలక భాగాలైన సొరంగం పనులను మంత్రులు బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆదిమూలపు సురేశ్, ఇరిగేషన్ శాఖ సీఈ జలంధర్, ఎస్ఈ నగేశ్‌లతో కలిసి ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక ఇంజనీరింగ్ అధికారులు ప్రాజెక్టు నిర్మాణ పనుల పురోగతిని మంత్రులకు వివరించారు. ఇప్పటివరకూ మొదటి సొరంగం నిర్మాణం 16.9 కిలోమీటర్లు పూర్తయిందని, ఇంకా 1.3 కిలోమీటర్ల నిర్మాణం జరగాల్సి ఉందన్నారు. హెడ్ రెగ్యులేటర్ నిర్మాణ పనులు 600 మీటర్ల వరకూ జరిగాయని చెప్పారు. అనంతరం టన్నెల్ లోపలి భాగంలో జరిపే తవ్వకం పనులను లోకో ట్రైన్ ద్వారా కలెక్టర్, జేసీతో కలిసి వెళ్లి మంత్రులు పరిశీలించారు. తర్వాత వెలిగొండ ప్రాజెక్టు కార్యాలయంలో నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులతో మంత్రులు సమీక్షించారు.

## గ్యాట్-2020కు దరఖాస్తుల స్వీకారం

సాగర్‌నగర్ (విశాఖపట్నం), నవంబరు 30: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్, ఫార్మశీ, ఎం.ఆర్క్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే గీతం అడ్మిషన్ టెస్ట్ (గ్యాట్)-2020కు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు అడ్మిషన్ల డైరెక్టర్ నరేంద్ర తెలిపారు. డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.గీతం.ఇడియు ద్వారా దరఖాస్తులను 2020 మార్చి 30 వరకు స్వీకరిస్తామన్నారు. ఏప్రిల్ 5 నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. ఇంజనీరింగ్‌లో 21 బీటెక్, 13 ఎంటెక్, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, రెండేళ్ల ఎం.ఆర్క్ కోర్సులకు ప్రవేశ పరీక్షను దేశంలోని 50 పట్టణాలలో ఏప్రిల్ 11 నుంచి 21వరకు నిర్వహిస్తామని, ఏప్రిల్ 25న ఫలితాలను వెల్లడిస్తామని చెప్పారు.

# రాలిపోయిన విద్యా కుసుమాలు!




మంజునాథరెడ్డి, కార్తీక్ (ఫైల్)

## ఇడుపులపాయలో ట్రిపుల్ ఐటీ విద్యార్థి ఆత్మహత్య

- పరీక్షలకు అనుమతి ఇవ్వలేదని మనస్తాపం
- విశాఖ, కర్నూలు జిల్లాల్లో ఇద్దరు ఇంటర్ విద్యార్థులు
- యాజమాన్యాల తీరుపైనే తల్లిదండ్రుల అనుమానం!

వేంపల్లె, ఆనందపురం, ఎమ్మిగనూరు, నవంబరు 30: బిడ్డలు ప్రయోజకులవ్వాలని కన్నవారు కష్టపడి చదివిస్తుంటే.. వారి ఆశలను మధ్యలోనే చిదిమేస్తున్నారు కొందరు విద్యార్థులు. ఇంటికి దూరంగా.. విద్యాలయాల్లో ఉంచితే.. చదువుల ఒత్తిడి.. ఇతరత్రా కారణాలతో సతమతమై బలవన్మరణాలకు పాల్పడుతూ.. కడుపుకోత మిగులుస్తున్నారు. తాజాగా శనివారం ఒకే రోజు ముగ్గురు విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారు. వీరిలో ఒకరు ఇంజనీరింగ్ విద్యార్థి కాగా, ఇద్దరు ఇంటర్ విద్యార్థులు. వివరాలివీ.. మైదుకూరు గణపతినగర్‌కు చెందిన రైతు శివలింగారెడ్డి కుమారుడు ఎ.మంజునాథరెడ్డి (19) కడప జిల్లా ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో మెకానికల్ ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కొద్ది నెలలుగా తరగతులకు సక్రమంగా హాజరుకాలేదు. తల్లిదండ్రుల విజ్ఞప్తితో తిరిగి యాజమాన్యం కళాశాలలో కొనసాగించారు. ఈ నేపథ్యంలో పరీక్షలు ఈ నెల 25వ తేదీ ప్రారంభమయ్యాయి. హాజరుశాతం తక్కువ కావడంతో అధికారులు మంజునాథరెడ్డిని పరీక్షలకు అనుమతించక పోవడంతో మనస్తాపానికి గురై శనివారం హాస్టల్‌గదిలో ఫ్యానుకు బెడ్‌షీట్‌తో ఉరివేసుకున్నాడు. సెక్యూరిటీ సిబ్బంది వెంటనే క్యాంపస్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది. తండ్రి శివలింగారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మూర్తి తెలిపారు. కాగా, హాజరుశాతం తగ్గితే ప్రస్తుతం పరీక్షలకు అనుమతి ఇవ్వకపోయినా, 15 రోజుల్లో మళ్లీ పరీక్షలకు అనుమతి ఇస్తామని, కానీ ఇంతలోనే విద్యార్థి ఇంత తీవ్రమైన నిర్ణయం తీసుకోవడం బాధాకరమని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ సుదర్శన్‌రావు, ఏవో కృష్ణమోహన్ పేర్కొన్నారు. అందరితో కలివిడిగా ఉండే మంజునాథ్ సహచర స్నేహితులకు రెండు రోజుల క్రితం విందు ఇచ్చాడని తెలిసింది. ట్రిపుల్ ఐటీలో ఇక చదవలేనని, బయటకు వెళ్లి డిగ్రీలో చేరతానని, అందుకే పార్టీ ఇస్తున్నానని విద్యార్థులకు చెప్పినట్లు సమాచారం.

### ఒక్కగానొక్క కొడుకు..

విశాఖ జిల్లా ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ బోయపాలెంలోని శశి రెసిడెన్సియల్ ఇంటర్ కళాశాలలో వై.కార్తీక్ (16)అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నారు. కార్తీక్ ఒడిశాలోని పర్లాకిమిడికి చెందిన ఎర్రాదుల నరసింగరావు, గీతారాణి దంపతుల ఏకైక కుమారుడు. ప్రస్తుతం ఇక్కడ ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శనివారం తెల్లవారుజామున 5.30 గంటల ప్రాంతంలో కళాశాల భవనం ఐదవ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సిబ్బంది హుటాహుటిన ప్రైవేటు ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. ఏసీపీ రవిశంకరరెడ్డి, సీఐ వై.రవి, ఎస్ఐ గణేష్‌లు కళాశాలకు చేరుకుని తోటి విద్యార్థులను విచారించారు. 'రేపు ఉదయం మీ అందరికీ పెద్ద షాక్ ఇస్తాను చూడండి...' అని శుక్రవారం రాత్రి తమతో చెప్పాడని, కానీ ఇలా చేస్తాడని ఊహించలేదని సహచర విద్యార్థులు కొందరు కన్నీరుమున్నీరయ్యారు. కాగా, కళాశాలకు చేరుకున్న కార్తీక్ తండ్రి నరసింగరావు మాట్లాడుతూ కొడుకు ప్రయోజకుడవుతాడని ఆశపడి, ఎక్కడో పర్లాకిమిడి నుంచి తీసుకువచ్చి ఇక్కడ చేర్పించానన్నారు. యాజమాన్యం ఇంత దారుణంగా ఉంటుందని ఊహించలేదని, పిల్లలకు సరైన రక్షణ లేదని ఆరోపించారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రవి తెలిపారు.

### ఎమ్మిగనూరు బీసీ హాస్టల్‌లో..

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణంలో శనివారం ఇంటర్ సెకండియర్ విద్యార్థి మహేంద్ర(17) ఆత్మహత్య చేసుకున్నాడు. కోడుమూరు మండలం మెరుగుదొడ్డి గ్రామానికి చెందిన ఈరన్న, యశోదమ్మ కమారుడు మహేంద్ర స్థానిక రాఘవేంద్ర జూనియర్ కళాశాలలో చదువుతున్నాడు. శనివారం తెల్లవారుజామున తాను ఉంటున్న ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలోని వంటగదిలో ఉరివేసుకున్నాడు. ఆర్ఐవో సాలాబాయి వచ్చి తల్లిదండ్రులతో మాట్లాడారు. అనంతరం వసతిగృహంలోను, రాఘవేంద్రజూనియర్ కళాశాలలో విచారించారు. విద్యార్థులు ఆర్ఐవోను అడ్డుకున్నారు. గతంలో కూడా ఈ కళాశాలలో నలుగురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, విచారణ చేపట్టి కళాశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. తన కుమారుడు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని, శుక్రవారం రాత్రి తనకొడుకు హాస్టల్ వార్డెన్‌తో మాట్లాడాడని, అంతలోనే ఎలా చనిపోతాడని తండ్రి ఈరన్న అన్నారు. వార్డెన్‌తోపాటు, కాలేజీ యాజమాన్యంపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



కప్ప స్తంభం వద్ద జస్టిస్ జేకే మహేశ్వరి

## అప్పన్న సేవలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

సింహాచలం/సబ్బవరం, నవంబరు 30: సింహాచలంలోని వరాహ లక్ష్మీనృసింహ స్వామిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జితేంద్రకుమార్ మహేశ్వరి శనివారం దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి మారెళ్ల వెంకటేశ్వరరావు, అర్చకులు పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. ఆలయంలో విశిష్ట కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ప్రధాన న్యాయమూర్తి బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అనంతరం స్వామివారిని, అమ్మవారిని ఆయన దర్శించుకున్నారు. దర్శనానంతరం జస్టిస్ జేకే మహేశ్వరికి ఈఓ ప్రసాదం, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

### డీఎస్ఎన్ఎల్‌యూ సందర్శన

జస్టిస్ జితేంద్రకుమార్ మహేశ్వరి శనివారం విశాఖపట్నం జిల్లా సబ్బవరం మండల పరిధిలోని అసకపల్లిలో గల దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఆయనకు ఉప కులపతి ప్రొఫెసర్ సూర్యప్రకాశ్ సాదరంగా స్వాగతం పలికారు. ప్రధాన న్యాయమూర్తి వర్సిటీ అధికారులతో సమావేశమై పరిపాలన, అకడమిక్ అంశాలపై దాదాపు రెండు గంటల పాటు సమీక్ష నిర్వహించారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థులతో విడివిడిగా సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ సీఎం రావు, జిల్లా జడ్జి బీఎస్ భానుమతి, అనకాపల్లి 10వ అదనపు మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి జి.చక్రపాణి, సీబీఐ కోర్టు జడ్జి సత్యప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### గొట్టిపాటి క్వారీల్లో మళ్లీ తనిఖీలు

ఒంగోలు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా అద్దంకి టీడీపీ ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను విజిలెన్స్ అధికారులు వెంటాడుతున్నారు. జిల్లాలో 80కు పైగా గ్రానైట్ క్వారీలు ఉండగా కేవలం రవికుమార్‌కు సంబంధం ఉన్న క్వారీల్లోనే అధికారులు తనిఖీలపై తనిఖీలు చేస్తున్నారు. వారం వ్యవధిలోనే రెండోసారి ఆయన గ్రానైట్ క్వారీల్లో సోదాలు ప్రారంభించారు. వారంక్రితం వరుసగా నాలుగు రోజుల పాటు ఆయన క్వారీలన్నింటిపై విజిలెన్స్ అధికారులు మైనింగ్ అధికారులతో కలిసి విస్తృతంగా తనిఖీలు చేశారు. ఆ వెంటనే ఇతర క్వారీలపై మళ్లీ దాడులు జరగవచ్చని భావించారు. అయితే అనూహ్యంగా శనివారం బల్లికురవ సమీపంలో ఉన్న ఎమ్మెల్యే గొట్టిపాటికి చెందిన క్వారీల్లో మళ్లీ తనిఖీలు ప్రారంభించారు. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఆయా విభాగాలకు చెందిన సిబ్బంది క్వారీల్లో గ్రానైట్ నిక్షేపాలను వెలికితీసిన ప్రాంతాలను పరిశీలించారు. క్వారీల్లో తవ్వకాలు జరిగిన ప్రాంతాల రూపురేఖలను ఆర్టిస్టుల ద్వారా అక్కడే స్కెచ్‌లు గీయిస్తున్నారు.

### విశాఖ మెట్రోకు మళ్లీ టెండర్లు: బొత్స

విశాఖపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టుకు మళ్లీ టెండర్లు పిలవనున్నామని పురపాలన, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించారు. నగరంలో మొదటి దశలో మెట్రో రైలు ప్రాజెక్టు నిర్మించే స్థలాన్ని ఆయన శనివారం ఉదయం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. మెట్రో రైల్‌కు సంబంధించి 2015లోనే సమగ్ర ప్రాజెక్టు నివేదిక సమర్పించినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు వల్ల ముందుకు కదలలేదన్నారు. ప్రాజెక్టుకు నిధుల కొరత లేదని, పీపీపీ విధానంలో నిధులు సమకూరుస్తామని తెలిపారు. మొదట 46 కి.మీ. పొడవున మూడు మార్గాల్లో మెట్రో మార్గాన్ని ప్రతిపాదించామని, ఆ తరువాత దశల వారీగా అటు లంకెలపాలెం, అనకాపల్లి వరకు... ఇటు ఆనందపురం, భోగాపురం వరకు విస్తరిస్తామని పేర్కొన్నారు.



## వైభవంగా పద్మావతి రథోత్సవం

తిరుచానూరు, నవంబరు 30: తిరుచానూరు పద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజు శనివారం ఉదయం రథోత్సవం అంగరంగవైభవంగా జరిగింది. ముత్యపుకవచపు అలంకారంలో అమ్మవారు వీరలక్ష్మిగా కొలువుదీరి తిరుమాడ వీధుల్లో విహరించారు. భక్తుల కోలాటాలు, భజన బృందాలు, ప్రదర్శనలు, గోవిందనామస్మరణల నడుమ చిరుజల్లుల మధ్య రథోత్సవం జరిగింది. రథంపై మిరియాలు, ఉప్పు చల్లి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి అశ్వవాహనంపై కల్కి రూపంలో అమ్మవారు భక్తులను కటాక్షించారు. వాహనసేవలు ముగియడంతో బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన పంచమీతీర్థం (చక్రస్నానం) ఆదివారం మధ్యాహ్నం 12.15 గంటలకు జరగనుంది.



## రామజోగయ్య శాస్త్రికి గురజాడ పురస్కారం

విజయనగరం రూరల్, నవంబరు 30: సినీ గేయ రచయిత రామజోగయ్యశాస్త్రికి గురజాడ సాహితీ పురస్కారం దక్కింది. ఏటా నవంబరు 30న గురజాడ అప్పారావు వర్ధంతిని పురస్కరించుకుని సంగీత, సాహిత్య ప్రముఖులకు విజయనగరంలోని గురజాడ సాహితీ సాంస్కృతిక సంస్థ ఈ పురస్కారాన్ని అందిస్తుంది. 2019కి గాను రామజోగయ్యశాస్త్రిని ఎంపిక చేసిన సంస్థ శనివారం ఆయనకు పురస్కారాన్ని అందజేసింది. రామజోగయ్యశాస్త్రి మాట్లాడుతూ.. గురజాడ పురస్కారం అందుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని అన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన తనికెళ్ల భరణి మాట్లాడుతూ.. సామాజిక రుగ్మతలను ఇతివృత్తంగా తీసుకుని గురజాడ రచించిన కన్యాశుల్కం నాటకం ఎంతో గొప్పదన్నారు.

## బ్రాహ్మణ కార్పొరేషన్ నిర్వీర్యానికి కుట్ర

- బీజేపీ ధార్మిక సెల్ అధ్యక్షుడు కృష్ణచైతన్య శర్మ

విజయవాడ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అగ్రవర్ణాల్లో నిరుపేదలుగా ఉన్న బ్రాహ్మణులకు చేదోడువాదోడుగా ఉన్న బ్రాహ్మణ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేయడానికి వైసీపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని బీజేపీ ధార్మిక సెల్ రాష్ట్ర అధ్యక్షుడు తూములూరి శ్రీకృష్ణచైతన్యశర్మ ఆరోపించారు. కార్పొరేషన్‌లో పనిచేస్తున్న పదిమంది ఉద్యోగులను ఈ కారణంగానే తొలగించారని విమర్శించారు. విజయవాడలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ఈ కార్పొరేషన్‌ను పట్టించుకోకపోవడంతో 15వేల మందికి పింఛన్లు అందడం లేదని, వేలాది మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయకపోవడంతో వారి చదువులు ప్రశ్నార్థకంగా మారాయన్నారు.

## కౌలుదారులకు 'రైతు భరోసా' ఎండమావే!

- కౌలురైతుల సంఘం రాష్ట్ర నేతలు

అమరావతి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): 'ఆరు నెలల్లో కౌలు సాగుదారులకు గుర్తింపు కార్డులు ఇవ్వడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. కౌలు రైతులందరికీ పంట రుణాలు అందలేదు. కౌలుదారులకు 'రైతుభరోసా' ఎండమావిగానే మిగిలిపోయింది' అని రాష్ట్ర కౌలురైతుల సంఘం అధ్యక్షుడు నాగబోయిన రంగారావు, కార్యదర్శి పి.జమలయ్య విమర్శించారు. శనివారం విజయవాడలో కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 32లక్షల మంది కౌలురైతులుంటే, 15లక్షలకు పైగా భూమి లేని కౌలుదారులన్నారని, వీరందరికీ గుర్తింపు కార్డులిచ్చి రైతుభరోసా అందిస్తామని వైసీపీ ప్రభుత్వం ప్రకటించిందని చెప్పారు. కానీ ఇప్పటి వరకు 2లక్షల మందికి మాత్రమే పంట సాగుదారుల హక్కు కార్డులు ఇచ్చారని వివరించారు.

## 'డీజీపీ, పోలీసులపై వ్యాఖ్యలు సరికాదు'

విజయవాడ సిటీ, నవంబరు 30: "పోలీస్ శాఖలో అత్యున్నత పదవిలో ఉన్న డీజీపీపై టీడీపీ నేతలు ఆరోపణలు చేయడం పోలీస్ వ్యవస్థను కించపరచడమే. పోలీసుల ఆత్మస్థైర్యం దెబ్బతీసే వ్యాఖ్యలు డీడీపీ నాయకులు మానుకోవాలి. పునరావృతమైతే న్యాయపరమైన పోరాటానికి వెనకాడబోము" అని ఏపీ పోలీస్ అధికారుల సంఘం నేతలు టీడీపీని హెచ్చరించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం మీడియాతో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె శ్రీనివాసరావు, ఎం.డీ.మస్తాన్‌ఖాన్ మాట్లాడారు.

## శిశువు ఒడిచేరె.. తల్లికి ప్రాణంలేచొచ్చె!

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 30: తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా ఆస్పత్రిలో అపహరణకు గురైన శిశువు కథ సుఖాంతమైంది. కృష్ణాజిల్లా మైలవరం మండలం పుల్లూరుకు చెందిన కల్యాణి అనే వివాహితకు పిల్లలు లేకపోవడంతో శిశువును అపహరించిందని పోలీసులు గుర్తించారు. ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆయాగా పనిచేస్తున్న షామియాజ్ ఆమెకు సహకరించింది. ఇందుకు ఇద్దరి మధ్య రూ.50 వేలకు ఒప్పందం కుదిరింది. 26వ తేదీ రమాదేవి అనే బాలింత నుంచి ఆడశిశువును కల్యాణి అపహరించింది. శనివారం రమాదేవికి ఆమె బిడ్డను పోలీస్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ అప్పగించారు.



శిశువును తల్లికి అప్పగిస్తున్న కమిషనర్

# స్వైపింగ్ మాయ!

## నెల్లూరు టెరిటోరియల్‌లో 100కోట్ల కుంభకోణం?

- బీపీసీఎల్ పెట్రోల్ బంకుల్లో గోల్‌మాల్
- నాయుడుపేట ఫిల్లింగ్ స్టేషన్‌పై విచారణ
- వాటాల పంపకంలో తేడాతో వెలుగులోకి..
- అధికారుల సహకారంతోనే అక్రమాలు

నెల్లూరు, నవంబరు 30: భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) ఆయిల్ ఫిల్లింగ్ స్టేషన్లలో స్వైపింగ్ యంత్రాల ద్వారా కోట్ల రూపాయల కుంభకోణం జరిగినట్లు సమాచారం. ఓ బంకులో వాటాల పంపకంలో ఏర్పడిన తగాదా వల్ల ఈ బాగోతం వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో బీపీసీఎల్ అధికారుల సహకారం ఉన్నట్టు.. దీన్ని ఓ బ్యాంకు బయటపెట్టినట్టు సమాచారం. ఈ కుంభకోణం బయటపడటంతో జిల్లాలోని బీపీసీఎల్ అధికారులు స్వైపింగ్ వ్యవహారంలో సంబంధం ఉన్న కొంతమంది డీలర్లకు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారని తెలిసింది. నెల్లూరు టెరిటోరియల్ పరిధిలో 250 బీపీసీఎల్ ఫిల్లింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఈ టెరిటోరియల్ పరిధిలో నెల్లూరు, చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు జిల్లాలున్నాయి. ఈ జిల్లాలో సుమారు రూ.100 కోట్ల కుంభకోణం జరిగినట్లు తెలిసింది.

### డిజిటల్ స్వైపింగ్ అంటే..

నోట్ల రద్దు తర్వాత నగదు రహిత లావాదేవీలను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం పెట్రోలు బంకుల్లో స్వైపింగ్ యంత్రాలను ప్రోత్సహించింది. ఖాతాదారులు పెట్రోలు, డీజిల్ పోయించుకుని డిబెట్ కార్డు స్వైప్ చేయడం వలన వారికి 0.75 శాతం క్యాష్‌బ్యాక్ ప్రోత్సాహకం అందుతుంది. ఇది నేరుగా ఆ వ్యక్తి బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. దీన్ని కొందరు డీలర్లు క్యాష్ చేసుకున్నారు. బ్యాంకుల్లోని వ్యక్తులతో పరిచయం పెంచుకుని స్వైపింగ్ మిషన్ల ద్వారా వచ్చే కమిషన్‌ను నొక్కేస్తున్నారు. అవసరానికో, నల్లధనాన్ని మార్చుకోవడానికో వచ్చిన వ్యక్తులతో కార్డు స్వైప్ చేయిస్తూ అతనికి వచ్చే 0.75 శాతం కమీషన్‌ను తీసుకోవటమే కాక, అక్రమంగా మరికొంత మొత్తాన్ని డీలర్లు వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు రూ.2 కోట్ల టర్నోవర్ ఉండే ఫిల్లింగ్ స్టేషన్లు ఇలా పలురకాలుగా కార్డులు స్వైప్ చేయించి రూ.8 నుంచి 9 కోట్ల టర్నోవర్ చూపిస్తూ ఈ కుంభకోణానికి తెరలేపినట్టు సమాచారం.ఈ తంతు రెండేళ్ల నుంచి సాగుతున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో బీపీసీఎల్ డీలర్లు కొందరు.. అధికారులకు ఆశ చూపి ఈ కుంభకోణానికి పాల్పడుతున్నారు. టర్నోవరుకు మించి అక్రమ వ్యాపారం చేస్తూ.. కమీషన్లు నొక్కేస్తున్నారు. ఒక డీలరు ఫిల్లింగ్ స్టేషన్ వాస్తవ టర్నోవర్ రూ.2 కోట్లు అయినపుడు.. అదనపు స్వైపింగ్ ద్వారా రూ.7 కోట్ల టర్నోవర్‌ను పూర్తి చేయడం వలన ఖాతాదారులకు చేరాల్సిన 0.75 శాతం కమిషన్ ప్రభుత్వం నుంచి తరలిపోతోంది. ఈ విధంగా బీపీసీఎల్ డీలర్లు కొందరు రూ.100 కోట్లకు పైగానే కాజేసినట్టు సమాచారం. వాస్తవానికి పెట్రోలు బంకులు స్వైపింగ్ చేసినపుడు వచ్చే కమీషన్‌ను ఇలా అడ్డగోలుగా వ్యాపారం చేసుకోడానికి అన్వయించకూడదు. ఈ విధానంలో రెండేళ్లకుపైగా కుంభకోణం జరుగుతున్నా, టర్నోవర్‌కు మించి కొందరు డీలర్లు వ్యాపారం చేస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

### విచారణ చేస్తున్నాం

నాయుడుపేట ఫిల్లింగ్ స్టేషన్‌లో స్వైపింగ్‌కు సంబంధించి ఫిర్యాదు అందింది. దీనిపై విచారణ పూర్తయిన తరువాత వివరాలు తెలియచేస్తాం. ఎవరైనా అక్రమ స్వైపింగ్‌కు పాల్పడినా, టర్నోవర్‌కు మించి వ్యాపారం చేస్తున్నట్టు చూపెట్టినా తగిన చర్యలు తీసుకుంటాం.

**- ఎం. మహేష్, బీపీసీఎల్ నెల్లూరు టెరిటోరియల్ మేనేజర్**

## టార్గెట్.. కలెక్టర్!

- ప్రజా ప్రతినిధుల ఫిర్యాదులతోనే అనంత కలెక్టర్ ఔట్
- 22-ఏ వివాదంలో కొందరికి లబ్ధి చేకూర్చేలా నిర్ణయాలు...
- ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే
- పక్కాగా నిర్ధారించుకున్నాకే నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం

అమరావతి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా కలెక్టర్ సత్యనారాయణపై బదిలీ వేటు పడటం వెనుక కొందరు ఎమ్మెల్యేల ఫిర్యాదులే కారణమని తెలిసింది. కొద్దిరోజులుగా ఆయనపై ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్తున్నాయి. ఆకస్మికంగా ఆఫీసులను తనిఖీ చేసి సంబంధిత అధికారులను సస్పెండ్ చేస్తానని బెదిరించడం, ఆ తర్వాత అవేవీ కార్యరూపం దాల్చకపోవడం వెనుక ఏదో జరుగుతోందని ఆరోపణలొచ్చాయి. ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ జిల్లాలో నిర్వహించిన సమీక్షలోనూ కలెక్టర్ పనితీరుపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. కలెక్టర్‌కు పాలనపై పట్టుపోతోందని, ప్రైవేటు వ్యక్తుల ప్రమేయం పెరుగుతోందంటూ ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. సత్యనారాయణ గతంలో కర్నూలు కలెక్టర్‌గా చేశారు. అప్పటికే విశాఖ సిట్ కేసులో ఆయనపై అభియోగాలు వచ్చాయి. జగన్ సర్కారు వచ్చాక, ఆయన్ను కర్నూలు నుంచి అనంతపురానికి బదిలీ చేశారు. ఆయనకు గతంలో అనంతపురం జేసీగా పనిచేసిన అనుభవం ఉంది. రాజకీయంగా ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం ఉన్న ఈ జిల్లాలో ఆయన ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదని స్థానిక ఎమ్మెల్యేలు సర్కారు దృష్టికి తీసుకెళ్తున్నారు. ఇటీవల 22-ఏ భూ వివాదాల పరిష్కారంలో ఆయన తీసుకున్న నిర్ణయాల వల్ల కొందరికి ఆయాచిత లబ్ధి జరిగిందని ఓ ఎమ్మెల్యే లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ఒక ఎంపీ, నలుగురు ఎమ్మెల్యేలతో పాటు కొందరు నాయకులు చెప్పిన పనులు కూడా ఆయన చేయలేదని ఫిర్యాదులు వచ్చాయి. ఓ ప్రజాప్రతినిధికి సంబంధించిన పనిలో ఓ ఆర్ఐ తలదూర్చారన్న విమర్శలున్నాయి. దీంతో ఆయన కలెక్టరేట్ కేంద్రంగా తీసుకున్న పలు నిర్ణయాలు, జారీచేసిన ఆదేశాలపై పక్కా ఆధారాలు సేకరించి సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల జరిగిన కేబినెట్ భేటీ అనంతరం నలుగురు ఎమ్మెల్యేలు సీఎంను కలిసి కలెక్టర్‌పై ఫిర్యాదు చేసి, ఓ ఫైలును కూడా ఇచ్చినట్లు తెలిసింది. దీనిపై సీఎంఓ పలు మార్గాల నుంచి సమాచారం తెప్పించుకుంది. తమకొచ్చిన ఫిర్యాదులు, అందిన సమాచారాన్ని పరిశీలించి శుక్రవారం రాత్రి సత్యనారాయణపై బదిలీ వేటు వేసింది. ఆయన స్థానంలో గంధం చంద్రుడిని నియమించాలని సీఎం నిర్ణయించారు. బదిలీ ప్రతిపాదన రాకముందు, ఎస్సీ కార్పొరేషన్ ఎండీగా ఉన్న చంద్రుడికి నిడ్‌క్యాప్ వీసీ, ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ అంతకుముందే ఉత్తర్వులు వచ్చాయి. అయితే, అనూహ్యంగా అనంతపురం కలెక్టర్ వ్యవహారం చర్చకు రావడంతో గంధం చంద్రుడిని కలెక్టర్‌గా పంపించాలని అప్పటికప్పుడు నిర్ణయం తీసుకున్నారు. సత్యనారాయణను ఎస్సీ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. సోమవారం ఉదయం చంద్రుడు బాధ్యతలు స్వీకరించనున్నారు.

# క్షణాల్లో పెళ్లి ధ్రువీకరణ పత్రాలు

- డ్రైవింగ్.. డిగ్రీ.. ఏ పత్రాలైనా సిద్ధం
- కువైత్‌లో ప్రవాసాంధ్రుల మోసాలు
- పోలీసుల దాడిలో దొరికిపోయిన ముఠా

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

కువైత్‌లోని ఇద్దరు సీఐడీ పోలీసులు భారతీయ ఎంబసీ వద్దకు వెళ్లారు. ఆ ఇద్దరూ తెలుగులో బాగా మాట్లాడతారు. ఎంబసీ వద్ద ఓ తెలుగు వ్యక్తిని కలిసి... తమకు పెళ్లి చేసుకున్నట్టుగా ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు కావాలని అడిగారు. వారు అడిగిన పత్రాలన్నీ ఆ వ్యక్తి క్షణాల్లో సిద్ధం చేసి ఇచ్చాడు. అంతే మారువేషాల్లో ఉన్న ఆ పోలీసులు నకిలీ ధ్రువీకరణ పత్రాల తయారీతో సంబంధం ఉన్న ఓ మహిళ సహా 14 మందిని అదుపులోకి తీసుకొన్నారు. వీరిలో కడప జిల్లాకు చెందినవారు ఎక్కువ మంది ఉన్న ట్టు తెలిసింది. నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారంపై పోలీసులు వారిని విచారిస్తున్నారు. కువైత్‌లో ట్యాక్సీ డ్రైవర్లుగా పని చేస్తున్న కొందరు తరచూ డ్రైవింగ్ లైసెన్సుల అటెస్టేషన్(ధ్రువీకరణ) కోసం భారతీయ ఎంబసీకి వస్తుండటంతో పోలీసులకు అనుమానం వచ్చి దాడి చేయడంతో అసలు విషయం బయటపడింది. ఈ ముఠా సభ్యులు నకిలీ ధ్రువీకరణ పత్రాలు, డిగ్రీ పట్టాలు, డ్రైవింగ్ లైసెన్సులు తయారు చేయడమే కాదు.. వాటిని భారతీయ ఎంబసీ అధికారులు అటెస్టేషన్ చేసినట్టు.. వారి సంతకాలు ఫోర్జరీ చేయడం, రబ్బరు స్టాంపులు వేయడం తదితర పనులన్నీ చేసేస్తున్నారు. కువైత్‌లోని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కూడా వాటిని ఆమోదించినట్టుగా ఫోర్జరీ సంతకాలు చేసేసి, స్టాంపులు వేస్తున్నారు. ఈ ఫోర్జరీ పత్రాల వ్యవహారం భారీగా సాగుతున్నట్టు గుర్తించిన కువైత్ పోలీసులు.. ఏడాదిగా భారతీయ ఎంబసీ ఆమోదంతో వచ్చిన వివిధ ధ్రువపత్రాలను, ముఖ్యంగా డ్రైవింగ్ లైసెన్సులన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. భారత్, కువైత్ దేశాల అధికారులు వ్యూహాత్మకంగా చేసిన ఈ ఆపరేషన్‌లో పట్టుబడినవారి బంధుమిత్రులతోపాటు, నకిలీ డ్రైవింగ్ లైసెన్సులు పొందిన ప్రవాసాంధ్రుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. నకిలీ ధ్రువపత్రాల కోసం ముఠా సభ్యులు 24 నుంచి 35 వేల రూపాయల వరకూ వసూలు చేస్తుంటారని తెలిసింది. మిగిలిన గల్ఫ్ దేశాలతో పోలిస్తే కువైత్‌లో డొమెస్టిక్ వర్కర్ల వీసాల జారీ ఎక్కువగా ఉంటుంది. ఈ వీసాలపై వచ్చే ఆసియా ఖండం వాసుల్లో కడప జిల్లా వారే ఎక్కువ. కువైత్‌లో డ్రైవింగ్ వీసాలు సులభంగా లభిస్తుండటమే ఇందుకు కారణం. దీంతో నకిలీ లైసెన్సులూ పెద్దమొత్తంలో పుట్టుకొస్తున్నాయి. ఈ సర్టిఫికెట్లను జారీ చేస్తున్న ప్రవాసాంధ్ర ముఠాను కువైత్ పోలీసులు అరెస్ట్ చేయడం కలకలం రేకెత్తిస్తోంది.


**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**
**మార్కెటింగ్ శాఖ**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన**

మార్కెటింగ్ శాఖ, TTD, తిరుపతి వారిచే దిగువ ఐటంల సేకరణకు ఇ-టెండరు సహిత ఇ-రివర్స్‌వేలం కోరబడుచున్నది.

| క్ర. సం. | ఐటం పేరు | పరిమాణం | కాలపరిమితి | బయానా మొత్తం | డౌన్‌లోడింగ్ ప్రారంభ & ముగింపు తేదీలు |
|---|---|---|---|---|---|
| 01 | జీడిపప్పు బద్దలు S గ్రేడ్ | 1,80,000 కిగ్రా | 2 నెలలు | రూ. 30,00,000/- | 28.11.2019 12.12.2019 |
| 02 | దేశవ్యాప్తంగాగల డెయిరీల నుండి ట్యాంకర్ల ద్వారా అగ్‌మార్క్ స్పెషల్ గ్రేడ్‌తో ఆవు నెయ్యి | 11,50,000 కిగ్రా | 3 నెలలు | రూ. 56,05,000/- | 30.11.2019 16.12.2019 |
| 03 | ఆం.ప్ర. డెయిరీల నుండి ట్యాంకర్లద్వారా అగ్‌మార్క్ స్పెషల్ గ్రేడ్‌తో ఆవు నెయ్యి | 2,50,000 కిగ్రా | 3 నెలలు | రూ. 25,00,000/- | 30.11.2019 16.12.2019 |

టెండరు ప్రకటన మరియు టెండరు వివరాలకు వెబ్‌సైట్ http://www.tirumala.org మరియు https://tender.apeprocurement.gov.in/& https://konugolu.ap.gov.in/ కి లాగాన్ చేయవచ్చును. తదుపరి వివరాలకు ఫోన్ నంబర్లు: 0877-2264079 2264555, ఫ్యాక్స్ నం. 0877-2264554 పై సంప్రదించవచ్చును.

సం/- కార్యనిర్వహణాధికారి

ROC No.PR4/18912/Adv No.332/PRO/2019 తేది: 30.11.2019

> రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం నాటి కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీనే ఆయనను హత్య చేయించారని నిందించిన జగన్మోహన్‌రెడ్డి, ఆయన తల్లి విజయలక్ష్మి, చెల్లి షర్మిల ఆ తర్వాత ఆ ఊసే ఎత్తలేదు. తాజా ఎన్నికలకు ముందు తనపై కోడికత్తితో ఎవరో దాడి చేస్తే అందుకు చంద్రబాబే కారణమని నిందించి ఇప్పుడు అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా ఆ కేసు గురించి పట్టించుకోవడం లేదు. సొంత బాబాయి సొంతింట్లో హత్యకు గురైనా చంద్రబాబే కారణమని నిందించిన జగన్ అండ్ కో ఇప్పుడు ఏమీ జరగనట్టుగానే ఉంటున్నారు. దీన్నిబట్టి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆయన చేసిన ఆరోపణలన్నీ రాజకీయ లబ్ధి కోసమే చేశారని భావించవలసి ఉంటుంది. ప్రభుత్వపరంగా కుల–మతాలకు అతీతంగా అని ఇచ్చిన హామీ కూడా ఆచరణలో అందుకు విరుద్ధంగా ఉంటోందని ఈ ఆరు నెలల్లోనే తేలిపోయింది.

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

కొత్తపలుకు

■ ఆర్కే RK



# జీ హుజూర్ అంటేనే!

> కేవలం సంక్షేమాన్ని మాత్రమే నమ్ముకుంటే అంతిమంగా కొంప మునుగుతుందన్న వాస్తవాన్ని జగన్మోహన్‌రెడ్డి అండ్ కో ఇప్పటికైనా గ్రహించడం అవసరం. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజావేదికను కూల్చివేయించిన ముఖ్యమంత్రి ఏమి సాధించినట్టు? జగన్మోహన్‌రెడ్డి అర్జంటుగా తన మనస్తత్వాన్ని మార్చుకోవాలి. లేని పక్షంలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోతుంది. రాష్ట్రం ఆర్థిక పరిస్థితిని గమనిస్తున్న రిజర్వుబ్యాంకు కూడా ఆందోళన వ్యక్తంచేస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే ఆంధ్రప్రదేశ్‌లో ఫైనాన్షియల్ ఎమర్జన్సీ విధించాల్సిన పరిస్థితి తలెత్తవచ్చునని రిజర్వు బ్యాంకు అధికారులు కేంద్రానికి నివేదిక పంపినట్టు వార్తలు వస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కాగా, తెలంగాణలో కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది. అధికారంలోకి వచ్చిన కొత్తలో కేసీఆర్‌తో రాసుకుపూసుకు తిరిగిన జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు దూరంగా ఉంటున్నారు. అది వేరే విషయం. ఈ ఏడాదిలో కేసీఆర్ పాలన ఎలా ఉంది? ఆరు నెలల్లో మంచి ముఖ్యమంత్రిగా అనిపించుకుంటానన్న జగన్మోహన్‌రెడ్డి ఆచరణలో నిరూపించుకున్నారా? అనే అంశాలను ఇప్పుడు పరిశీలిద్దాం. ముందుగా కేసీఆర్ వ్యవహార శైలి విషయానికి వద్దాం. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చరిత్రలో సుదీర్ఘ కాలం సాగిన సమ్మె విషయంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ వ్యవహరించిన తీరుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యమంత్రిగా కంటే రాజకీయ నాయకుడిగానే ఈ విషయంలో కేసీఆర్ కఠినత్వం ప్రదర్శించి.. కార్మికులను దిక్కుతోచని స్థితిలోకి నెట్టి, చివరకు 'విధుల్లో చేరండి' అని పిలుపు ఇవ్వడం ద్వారా పాలతో అభిషేకాలు చేయించుకున్నారు. సమ్మె వల్ల సాధించింది ఏమీ లేకపోయినా.. ఉద్యోగం ఉంటే చాలన్న భావనకు కార్మికులు వచ్చిన తర్వాత సంఘాల నాయకులను పక్కన బెట్టి కార్మికుల పట్ల ఉదారత్వాన్ని ప్రదర్శించిన ముఖ్యమంత్రిగా చివరకు మార్కులు కొట్టేశారు. సమ్మె కాలానికి జీతాలు ఇస్తారో లేదో కూడా తెలియని

> రైతుల పుణ్యమా అని అప్పనంగా ప్రభుత్వానికి సమకూరిన భూమిని ఉపయోగించుకుని రాజధాని నిర్మించుకునే వెసులుబాటు ఉన్నప్పటికీ, మాకు అంత రాజధాని అవసరం లేదన్నట్టుగా మాట్లాడటం ఆంధ్రప్రదేశ్‌కు శోభనిస్తుందా? రాజధానికి రెండు వేల ఎకరాలు చాలు అని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ప్రకటించడం హాస్యాస్పదంగా ఉంది. రైతులు ఉచితంగా ఇచ్చిన భూమిని కూడా వద్దు అని చెప్పడం ఏమిటో అర్థంకాని పరిస్థితి. ఇలాంటి ప్రకటనల వల్ల మాజీ ముఖ్యమంత్రిని హింసిస్తున్నామని మంత్రులు మానసిక ఆనందం పొందుతున్నారేమో తెలియదు గానీ, భావి తరాలకు తీరని ద్రోహం చేస్తున్నారు. అమరావతి ఫలాలను అనుభవించేది రాష్ట్ర ప్రజలే.. చంద్రబాబు కాదు.

పరిస్థితి ఉన్నప్పటికీ కార్మికులు మాత్రం బతుకు జీవుడా అంటూ కేసీఆర్‌కు జైకొట్టి విధుల్లో చేరిపోయారు. ఇదే పరిస్థితి ఆంధ్రప్రదేశ్‌లో ఉత్పన్నమై ఉంటే ముఖ్యమంత్రి వ్యవహార శైలిని అక్కడి కార్మికులు మనసులో పెట్టుకుని ఉండేవారు. తెలంగాణ సమాజంలో అమాయకత్వం, అల్ప సంతోషం అధికం. అందుకే కేసీఆర్‌కు మాత్రం పాలతో అభిషేకాలు దక్కాయి. మొత్తంగా జరిగిన పరిణామాలను పరిశీలిస్తే నక్సలైట్ల ఉద్యమానికి ముందు తెలంగాణలో గడీల పాలనలో చోటుచేసుకున్న సంఘటనలు గుర్తుకొస్తున్నాయి. ఆ రోజుల్లో దొరల వ్యవహార శైలి ఎలా ఉండేదో ఇప్పటి తరానికి తెలియకపోవచ్చు. అప్పట్లో తెలంగాణ పల్లెల్లో దొరలకు పట్టు ఉండేది. తమను ఎదిరించిన వారికి, తమ ఆదేశాలను ధిక్కరించిన వారికి బతుకే లేకుండా చేసేవారు. 'బాంచన్ దొర.. కాల్మొక్తా' అన్నవారికే బతికే అవకాశం ఉండేది. ఈ క్రమంలో పటేల్, పట్వారీలు దొరలకు సహకరించేవారు. తర్వాత కాలంలో గ్రామాలపై నక్సలైట్లు పట్టు సాధించడంతో దొరలందరూ స్వస్థలాలను వదిలిపెట్టి హైదరాబాద్‌కు వలస వెళ్లిపోయారు. దొరలు తమను ధిక్కరించేవారి భూములను గుంజుకునేవారు. ఉపాధి కూడా లభించని పరిస్థితులు కల్పించేవారు. బానిసలుగా పడివున్న వారికే బతికే హక్కు ఉండేది. ఆర్టీసీ కార్మికుల సమ్మె విషయంలో ఇప్పుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అనుసరించిన వైఖరి కూడా నాటి దొరల కాలంనాటి పరిస్థితిని గుర్తుకుతెస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సమ్మెకు నాయకత్వం వహించిన నాయకులపై కోపంతో ముఖ్యమంత్రి కేసీఆర్ మొదటి నుంచీ సమ్మెపై కఠినంగానే వ్యవహరించారు. తన మాట వినకపోతే ఆర్టీసీనే మూసివేస్తామని హెచ్చరించారు. బస్సు రూట్ల ప్రైవేటీకరణకు అనుకూలంగా మంత్రిమండలిలో తీర్మానం చేశామన్నారు. సమ్మె చేస్తున్న కార్మికులందరూ సెల్ఫ్ డిస్మిస్ అయినట్టేనని ప్రకటించారు. 52 రోజుల సుదీర్ఘ సమ్మె తర్వాత కూడా ప్రభుత్వం కఠినంగానే ఉండటంతో దిక్కుతోచని స్థితిలో సమ్మె విరమించి విధుల్లో చేరుతున్నామంటూ కార్మిక సంఘాల నాయకులు ప్రకటించారు. అయినా తన మాట వినకుండా సమ్మె చేస్తారా? అని కినుకవహించిన ముఖ్యమంత్రి.. కార్మికులను విధుల్లోకి తీసుకోవడానికి తొలుత నిరాకరించారు. దీంతో కార్మికులు కన్నీరు పెట్టుకున్నారు. అదే సమయంలో అనుభవం లేని తాత్కాలిక డ్రైవర్ల వల్ల బస్సు ప్రమాదాలు పెరిగిపోయాయి. కార్మికులు సమ్మె విరమించి విధుల్లో చేరతామన్నప్పటికీ ముఖ్యమంత్రి భీష్మించుకుని కూర్చోవడం ఏమిటి? అని సాధారణ ప్రజల్లో కూడా నిరసనలు వ్యక్తమయ్యాయి. కారణం ఏమైనప్పటికీ ముఖ్యమంత్రి కేసీఆర్ మనసు మార్చుకున్నారు. కార్మికులపై దయ చూపించి 'మీ ఉద్యోగాలు మీరు చేసుకోండి' అని అనుమతించారు. దీంతో 52 రోజుల గతాన్ని మర్చిపోయిన కార్మికులు, ఇతరులు కూడా "కేసీఆర్ జిందాబాద్" అన్నారు. దీన్నిబట్టి రాజకీయ నాయకుడిగా కేసీఆర్ సక్సెస్ అయినట్టే! అదే సమయంలో పాతకాలంనాటి దొరల పోకడలు కూడా ఆయనలో కనిపించాయని పలువురు అభిప్రాయపడ్డారు. మొత్తంమీద ఒకే దెబ్బకు ఎన్నో పిట్టలను కేసీఆర్ కొట్టారు. తెలంగాణ ఉద్యమ సమయంలో నాయకులమని ప్రకటించుకున్న వారెవ్వరూ కంటికి కనిపించలేదు. కాళోజీ నినాదం గాలిలో కలిసిపోయింది. తెలంగాణ సమాజం చైతన్యం కోల్పోయిందన్న భావన మాత్రం వ్యాపించింది. 50 ఏళ్లనాడు ఎటువంటి అమాయకత్వం ఉండేదో, ఇప్పటికీ సమాజంలో అదే పరిస్థితి ఉందని స్పష్టం అయిపోయింది. ఆర్టీసీ కార్మికుల సమ్మెతో ఎదురైన అనుభవంతో ఇక భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు సమ్మె చేయడానికి సాహసించకపోవచ్చు! ఏదైనా కావాలంటే 'అడుక్కోవాలే గానీ డిమాండ్ చేయకూడదు' అని తెలంగాణ సమాజానికి కేసీఆర్ స్పష్టంచేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులను తోకలతో పోల్చిన ఆయన.. వారు నిజంగానే తోకలని ఆచరణలో కూడా నిరూపించారు. ప్రభుత్వంపై పట్టు సాధించడానికి కేసీఆర్ మొదటి నుంచీ వ్యక్తులు, వ్యవస్థల పట్ల కఠినంగానే వ్యవహరించారు. మీడియాను కూడా అదుపులో పెట్టుకోగలిగారు. సీనియర్ అధికారులు సైతం నోరెత్తలేని పరిస్థితి కల్పించారు. అంతేనా.. కార్లలో తాము కూర్చునే సీట్లపై పింక్ టవల్స్ కూడా వేసుకోవాల్సిన పరిస్థితి ఐఏఎస్‌లకు ఏర్పడింది. సునీల్ శర్మ వంటి అధికారులు ఇందుకు నిదర్శనం. మొత్తంమీద నాడు దొరలను ఎదిరిస్తే బతకలేని పరిస్థితి ఎలా ఉండేదో, తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ధిక్కరిస్తే కూడా బతకలేని పరిస్థితి ఉంది. తెలంగాణలో ఇప్పుడు మనుగడ సాగించాలంటే కేసీఆర్‌కు జీ హుజూర్ అనాల్సిందే! లాల్ సలామ్, ఇంక్విలాబ్ జిందాబాద్ వంటి నినాదాలకు ఇప్పుడు కాలం చెల్లింది. అధికారానికి దాసోహం అనకపోతే మింగ మెతుకు కూడా పుట్టదు. గిట్టని వారు కేసీఆర్‌ను నియంత అనవచ్చు! ఆర్టీసీ కార్మికుల సమ్మె విషయంలోనే కాదు.. మరెన్నో విషయాల్లో ఆయనే రైట్ అని అనిపించుకుంటున్నారు. సంఘటిత శక్తి అనే మాటకు ఇప్పుడు తావులేదు. 'జై కేసీఆర్' అని నినదిస్తే హాయిగా బతకవచ్చు. సో.. కేసీఆర్ గ్రేట్ అని అందరం ఒప్పుకొందాం ప్రస్తుతానికి!



srini

> కాళోజీ నినాదం గాలిలో కలిసిపోయింది. తెలంగాణ సమాజం చైతన్యం కోల్పోయిందన్న భావన మాత్రం వ్యాపించింది. 50 ఏళ్లనాడు ఎటువంటి అమాయకత్వం ఉండేదో, ఇప్పటికీ సమాజంలో అదే పరిస్థితి ఉందని స్పష్టం అయిపోయింది. ఆర్టీసీ కార్మికుల సమ్మెతో ఎదురైన అనుభవంతో ఇక భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు సమ్మె చేయడానికి సాహసించకపోవచ్చు! ఏదైనా కావాలంటే 'అడుక్కోవాలే గానీ డిమాండ్ చేయకూడదు' అని తెలంగాణ సమాజానికి కేసీఆర్ స్పష్టంచేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులను తోకలతో పోల్చిన ఆయన.. వారు నిజంగానే తోకలని ఆచరణలో కూడా నిరూపించారు. ప్రభుత్వంపై పట్టు సాధించడానికి కేసీఆర్ మొదటి నుంచీ వ్యక్తులు, వ్యవస్థల పట్ల కఠినంగానే వ్యవహరించారు. మీడియాను కూడా అదుపులో పెట్టుకోగలిగారు. సీనియర్ అధికారులు సైతం నోరెత్తలేని పరిస్థితి కల్పించారు.

## జగన్.. అవునంటే కాదనిలే!

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈ ఆరు నెలల్లో మంచి ముఖ్యమంత్రి అని అనిపించుకున్నారా? లేదా? అన్న విషయానికి వద్దాం. అధికార పగ్గాలు చేపట్టిన నాటి నుంచీ సంక్షేమం పేరిట ప్రజాధనాన్ని పంచిపెట్టడానికే జగన్మోహన్‌రెడ్డి ప్రాధాన్యం ఇచ్చారు. తాజాగా 45 ఏళ్లు దాటిన కాపు మహిళలకు కూడా ఏటా 15 వేల రూపాయలు పంచుతానని ప్రకటించారు. ఇప్పటివరకు ప్రకటించిన పథకాలన్నీ అమలు జరుగుతాయో, లేదో తెలియదు గానీ.. లబ్ధిదారుల్లో ఆశలు మాత్రం కలిగించారు. ఈ కోణంలో చూస్తే ఆ వర్గాలలో మంచి ముఖ్యమంత్రి అని జగన్మోహన్‌రెడ్డి అనిపించుకున్నట్టే! అయితే రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. రాజధాని అమరావతిని శ్మశానంతో పోల్చారు. సంక్షేమం మాత్రమే మా ప్రాధాన్యం అని దాపరికం లేకుండా ప్రభుత్వం ప్రకటిస్తోంది. దీంతో ప్రగతి కాముకులు మాత్రం రాష్ట్రం ఏమైపోతుందా? అని ఆందోళన చెందుతున్నారు. ఓటు బ్యాంకు రాజకీయంలో ఈ ఆందోళనలు ఆర్తనాదాలుగానే మిగిలిపోతున్నాయి. తెలంగాణ రాష్ట్రం బ్రాండ్ హైదరాబాద్‌ను కాపాడుకుంటూ అభివృద్ధి చెందుతుండగా, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం బ్రాండ్ అమరావతిని కూడా చంపేసుకుంటున్నారు. కుల–మత రాజకీయాలతోపాటు రాజకీయ కక్ష సాధింపు చర్యల వల్ల పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్ వైపు కన్నెత్తి చూడటానికి కూడా ఇష్టపడటం లేదు. అయినా సంక్షేమ పథకాలే తనను సుదీర్ఘకాలం అధికారంలో కూర్చోబెడతాయని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నమ్ముకుంటున్నారు. అణచివేత, కక్ష సాధింపు చర్యల విషయంలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మించిపోయారు జగన్మోహన్‌రెడ్డి. రాజకీయాలలో విలువల గురించి తరుచుగా మాట్లాడే జగన్మోహన్‌రెడ్డి.. ఆచరణలో అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. రాజకీయాలకు, కుల–మతాలకు అతీతంగా తమ ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆయన చెప్పిన మాటలు నేతి బీరకాయ చందంగా ఉంటున్నాయి. రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం నాటి కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీనే ఆయనను హత్య చేయించారని నిందించిన జగన్మోహన్‌రెడ్డి, ఆయన తల్లి విజయలక్ష్మి, చెల్లి షర్మిల ఆ తర్వాత ఆ ఊసే ఎత్తలేదు. తాజా ఎన్నికలకు ముందు తనపై కోడికత్తితో ఎవరో దాడి చేస్తే అందుకు చంద్రబాబే కారణమని నిందించి ఇప్పుడు అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా ఆ కేసు గురించి పట్టించుకోవడం లేదు. సొంత బాబాయి సొంతింట్లో హత్యకు గురైనా చంద్రబాబే కారణమని నిందించిన జగన్ అండ్ కో ఇప్పుడు ఏమీ జరగనట్టుగానే ఉంటున్నారు. దీన్నిబట్టి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆయన చేసిన ఆరోపణలన్నీ రాజకీయ లబ్ధి కోసమే చేశారని భావించవలసి ఉంటుంది. ప్రభుత్వపరంగా కుల – మతాలకు అతీతంగా అని ఇచ్చిన హామీ కూడా ఆచరణలో అందుకు విరుద్ధంగా ఉంటోందని ఈ ఆరు నెలల్లోనే తేలిపోయింది. ఈ నేపథ్యంలో జగన్ 'అవును' అని అంటే 'కాదు' అని అర్థంచేసుకోవాలేమో! మహాత్మా జ్యోతిరావు పూలె వర్ధంతి సభలో మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఐదుగురికి ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చానని జగన్మోహన్‌రెడ్డి గొప్పగా చెప్పారు. నిజానికి ఉప ముఖ్యమంత్రి పదవికి రాజ్యాంగంలో చోటులేదు. మంత్రులుగానే వారు కూడా ప్రమాణ స్వీకారం చేస్తారు. గతంలో అధికార పార్టీలో అసంతృప్త నాయకులను సంతృప్తి పర్చడానికి ఉప ప్రధాని, ఉప ముఖ్యమంత్రి వంటి పదాలను సృష్టించారు. ఇటీవలి కాలంలో సామాజికవర్గాలను సంతృప్తిపర్చడానికి ఉప ముఖ్యమంత్రి అనే బిరుదు తగిలిస్తున్నారు. ఇప్పుడు జగన్ కేబినెట్‌లో ఉన్న ఐదుగురు ఉప ముఖ్యమంత్రులకు ప్రత్యేక అధికారాలు ఏమీ కల్పించలేదు. ఈ ఐదుగురూ ఎవరో కూడా చాలా మందికి గుర్తులేదు. ముఖ్యమంత్రికి నమ్మకస్తులుగా ఉండేవారు మాత్రమే ఆయన తర్వాత అధికారం చలాయిస్తున్నారు. ఈ సందర్భంగా 'ఒసేయ్ రాములమ్మ' సినిమాలో దాసరి నారాయణరావు పాడిన పాట గుర్తుకువస్తోంది. 'చౌదరిగారు, ఓ నాయుడుగారు, రెడ్డిగారు, ఓ రాజుగారు అనే పల్లవితో మొదలయ్యే ఆ పాటలో 'పల్లెటూళ్ల సర్పంచుల పట్టణాల చైర్మన్ల/ సగం నీకే ఇస్తమని సంకలెగర వెయ్యమన్రు/ శాసనసభ సభ్యుల్లో, పార్లమెంటు మెంబర్లో/ అరకొర సీటులిచ్చి ఐసుజేసి పోతన్రు/ పవరు లేని పదవికుండె రిజర్వేషను/ఆ ప్రధానమంత్రి పదవికి ఎందుకుండదు/గా ముఖ్యమంత్రి పదవికైన ఎందుకుండదు సామీ'... అంటూ సాగుతుంది. నిజమే కదా!

## రోత భాష!

సంక్షేమ పథకాల ఆశజూపి మంచివాడిని అనిపించుకుంటున్న జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధికి, సంపద పెంపునకు తన వద్ద ఉన్న ప్రణాళిక ఏమిటో నోరు విప్పి చెప్పాల్సిన తరుణం ఆసన్నమైంది. రాజధాని అమరావతి విషయంలో మంత్రులు చేస్తున్న ప్రకటనలు అవగాహనతో చేస్తున్నారో? అవగాహన లేకుండా చేస్తున్నారో? తెలియని పరిస్థితి. ఈ ఆరు నెలల్లో ప్రభుత్వం అనుసరించిన రివర్స్ విధానం వల్ల రాష్ట్రానికి ఆర్థిక సహాయం చేయడానికి కూడా ఎవరూ ముందుకురాని పరిస్థితి. నిండుకున్న ప్రభుత్వ ఖజానా మరోవైపు వెక్కిరిస్తోంది. అయినా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై కసితో మంత్రులు వ్యాఖ్యలు చేస్తున్నారు. చంద్రబాబునాయుడు లుచ్చాగాడు, సన్నాసిగాడు అంటూ మంత్రి కొడాలి నాని చేస్తున్న వ్యాఖ్యలు రోత పుట్టిస్తున్నాయి. మంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి ఒక మాజీ ముఖ్యమంత్రిని 'గాడు.. గీడు..' అని సంబోధించడం జగన్మోహన్‌రెడ్డికి వినసొంపుగా ఉండవచ్చును గానీ సభ్య సమాజం మాత్రం ఛీత్కరించుకుంటోంది. రాజధాని అమరావతిని శ్మశానంతో పోల్చిన మంత్రి బొత్స సత్యనారాయణ.. రాష్ట్రానికి అపకారం చేస్తున్నానన్న విషయం మరిచిపోతున్నారు. అమరావతిలో పందులు, గేదెలు తిరుగుతున్నాయంటున్న మంత్రి కొడాలి నాని.. పొరుగు రాష్ట్రాల ముందు చులకన అవుతున్నామన్న విషయం మరిచిపోతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులు ఏకకాలంలో వస్తేనే ఏ రాజధాని అయినా అభివృద్ధి చెందుతుంది. రైతుల పుణ్యమా అని అప్పనంగా ప్రభుత్వానికి సమకూరిన భూమిని ఉపయోగించుకుని రాజధాని నిర్మించుకునే వెసులుబాటు ఉన్నప్పటికీ, మాకు అంత రాజధాని అవసరం లేదన్నట్టుగా మాట్లాడటం ఆంధ్రప్రదేశ్‌కు శోభనిస్తుందా? రాజధానికి రెండు వేల ఎకరాలు చాలు అని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ప్రకటించడం హాస్యాస్పదంగా ఉంది. రైతులు ఉచితంగా ఇచ్చిన భూమిని కూడా వద్దు అని చెప్పడం ఏమిటో అర్థంకాని పరిస్థితి. ఇలాంటి ప్రకటనల వల్ల మాజీ ముఖ్యమంత్రిని హింసిస్తున్నామని మంత్రులు మానసిక ఆనందం పొందుతున్నారేమో తెలియదు గానీ, భావి తరాలకు తీరని ద్రోహం చేస్తున్నారు. అమరావతి ఫలాలను అనుభవించేది రాష్ట్ర ప్రజలే.. చంద్రబాబు కాదు. అమరావతికి భూములు ఇచ్చిన రైతులు కూడా వెయ్యేళ్లు బతకరు. ఇవ్వాళ హైదరాబాద్‌లో ఎవరెవరో ఉపాధి పొందుతున్నట్టుగానే.. రేపు అమరావతిలోనూ ఏపీలోని 13 జిల్లాల వారి పిల్లలే కాకుండా, బయటివారు కూడా ఉపాధి పొందుతారు. ఈ వాస్తవాలను విస్మరించి చంద్రబాబుపైనో, ఒక సామాజికవర్గం పైనో కోపంతో రాజధానే వద్దు అనుకోవడం మూర్ఖత్వం అనిపించుకుంటుంది. హద్దూపద్దూ లేకుండా కొంత మంది మంత్రులు చేస్తున్న ప్రకటనలతో నాగరిక సమాజం బిత్తరపోతోంది. అమరావతిలో ఏమీ లేదని మంత్రులే అంటూ ఉంటే.. పెట్టుబడిదారులు మాత్రం ఎందుకు వస్తారు? పెట్టుబడిదారులను ఆకర్షించడానికి వివిధ రాష్ట్రాలు పోటీపడుతున్న తరుణంలో సొంత బ్రాండ్‌ను అభివృద్ధి చేసుకోకపోగా.. అదొక శ్మశానం అని ప్రకటించడం ద్వారా మంత్రులే ప్రగతి నిరోధకులుగా మారారు. ప్రజలకు అపకారం చేస్తున్నారు. అమరావతిలో పర్యటించిన చంద్రబాబుపై చెప్పులు– రాళ్లు వేయించినంత మాత్రాన ప్రజలకు ఒరిగేది ఏముంటుంది? మా ముంబయిలో ఉద్యోగాలన్నీ మా వాళ్లకే అన్న నినాదంతో ఉద్భవించిన శివసేన పార్టీనే ఇప్పుడు తన విధానాలను సవరించుకుంది. ఒకప్పుడు అభ్యుదయ భావాలకు, స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తికి నిలయమైన ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు సంకుచిత ధోరణులు ప్రబలడం మహా విషాదం. చంద్రబాబుపై దాడి విషయమై స్పందిస్తూ డీజీపీ గౌతమ్ సవాంగ్ చేసిన వ్యాఖ్యలు అత్యంత అభ్యంతరకరంగా ఉన్నాయి. భూసమీకరణ వల్ల వ్యక్తిగతంగా నష్టపోయినవారు దాడి చేసి ఉంటారని వ్యాఖ్యానించడం దాడులను సమర్థించడమే అవుతుంది. హత్య చేసినవాడు కూడా తనకు ఏదో నష్టం చేశాడన్న భావనతోనే ఎదుటివాడిని హతమారుస్తాడు. అప్పుడు కూడా ఇదే ముక్క చెబుతారా? హంతకులపై కేసు పెట్టరా? నిన్నటివరకు నీతులు చెబుతూ వచ్చిన గౌతమ్ సవాంగ్ ఇప్పుడు ఇంతలా దిగజారడం ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న పరిస్థితులకు అద్దంపడుతోంది. కేవలం సంక్షేమాన్ని మాత్రమే నమ్ముకుంటే అంతిమంగా కొంప మునుగుతుందన్న వాస్తవాన్ని జగన్మోహన్‌రెడ్డి అండ్ కో ఇప్పటికైనా గ్రహించడం అవసరం. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజావేదికను కూల్చివేయించిన ముఖ్యమంత్రి ఏమి సాధించినట్టు? జగన్మోహన్‌రెడ్డి అర్జంటుగా తన మనస్తత్వాన్ని మార్చుకోవాలి. లేని పక్షంలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోతుంది. రాష్ట్రం ఆర్థిక పరిస్థితిని గమనిస్తున్న రిజర్వుబ్యాంకు కూడా ఆందోళన వ్యక్తంచేస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే ఆంధ్రప్రదేశ్‌లో ఫైనాన్షియల్ ఎమర్జన్సీ విధించాల్సిన పరిస్థితి తలెత్తవచ్చునని రిజర్వు బ్యాంకు అధికారులు కేంద్రానికి నివేదిక పంపినట్టు వార్తలు వస్తున్నాయి. ఇదే నిజమైతే అంతకంటే ఆందోళనకరమైన విషయం మరొకటి ఉండదు. అవినీతి కేసుల వల్ల రాజకీయ అభద్రతాభావం ఏర్పడటం వల్లనో, ప్రజలతో మంచివాడిని అనిపించుకోవాలన్న ఆరాటం వల్లనో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రస్తుతం ఒక మార్గాన్ని ఎంచుకున్నారు. అయితే మరో ఏడాది గడిచేసరికి పంచడానికి డబ్బు కూడా ఉండదు. సంపద కూడా హరించుకుపోతుంది. అదే జరిగితే మంచివాడన్న విషయం అలా ఉంచితే, ప్రతిపక్షాలు విమర్శిస్తున్నట్టుగా పిచ్చోడి చేతికి రాయి ఇచ్చాం అని ప్రజలు కూడా భావించే పరిస్థితి రావచ్చు. మంత్రులు కూడా నోరు అదుపులో పెట్టుకుని రాష్ట్ర భవిష్యత్తు గురించి బాధ్యతతో ఆలోచిస్తారని ఆశిద్దాం! ■

---

# నమ్మకంగా అనుమానించండి!

అనుమానం పెనుభూతం అన్నారు పెద్దలు. అనుమానం పాత రోగమనీ చెప్పారు. భగవద్గీత కూడా 'సంశయాత్మా వినశ్యతి' అని ఉపదేశించింది. 'నిత్యశంకితులు దుఃఖభాగినులు' అని చిన్నయసూరి నీతిబోధ చేశారు. మానవ సంబంధాలకు ఆది, పునాది నమ్మకమే అన్నది నానుడి. వినడానికి బాగానే ఉన్నా, ఈ మాటలకు రోజులు చెల్లిపోయాయి. కాలం పూర్తిగా మారిపోయింది. తాడు కూడా పామై కరిచే పాడు కాలం దాపురించింది. తోడేళ్లు... తోడుగా నిలుస్తానంటూ నమ్మించి నట్టేట ముంచే సందర్భమిది. నక్కజిత్తుల గోమాయువులు, గంగి గోవుల్లా రంగు పూసుకు తిరిగే సన్నివేశమిది.. పయోముఖ విష కుంభాల విషమ వలయమిది. నమ్మి చెడిన వాడు లేడనే సామెతను.... 'నమ్మి చెడని వాడు లేడ'ని మార్చుకోవాలిక! కాని కాలమిది. కాలంతో పాటే ధర్మం కూడా కాలధర్మం పొందిన కలికాలమిది. 'సందేహమే' నేటి స్వధర్మం. అనుమానమే ఆధునిక జీవన వేదం!

20 ఏళ్ల కిందట.. నా చిన్నప్పటి మాట! ఈడొచ్చిన కూతురు ప్రేమతో తండ్రి మీద వాలితే, అక్కడే ఉన్న 70 ఏళ్ల ముసలవ్వ... 'అవలికి ఫో, పిచ్చి ముం..' అంటూ గట్టిగా కసిరింది. ఇదేమి విడ్డూరం? అన్నట్టు చూస్తే... "ఏం?.. నాన్న మాత్రం మగాడు కాదా" అన్నదామె! ఏ రకంగా చూసినా ఆడ– మగ వేరే అనే అనుభవసారమది. వయసొచ్చిన ఆడపిల్లలు సొంత అన్నకు కూడా దూరంగా మసలాలని చెప్పే ఆ ముసలి కాలం నుంచి... ఆడ– మగ... ఎవరు ఎవరిని ఎందుకు బిగి కౌగిలిలో బంధించుకుంటున్నారో పిల్లలకు విడమరిచి చెప్పలేని ఈ 'బిగ్‌బాస్' యుగం దాకా... అనుమానపడుతూనే మనమెంతో ఆధునికంగా మారాం. గోడల మీది బూతు సినిమా పోస్టర్లపై పేడ పూసే రోజుల నుంచి, కిస్ ఫెస్టివెల్స్‌ను, లవ్ ఫెస్టివెల్స్‌ను సమర్థించేదాకా సగర్వంగా 'ప్రగతిశీల అభ్యుదయం' సాగించాం. 'ఆమెను ఇంట్లో సురక్షితం'గా కాపాడుకోవాలని చెప్పిన ఛాందస భావజాలం నుంచి, సగం కాలిన మహిళల శవాలను హైవేల పక్కన విసిరేసే దాకా ఆధునిక ప్రయాణం సాగించాం. చవక డేటా అందుబాటే సాంకేతిక అభివృద్ధికి సంకేతంగా మారిన శకంలో, నట్టింట్లో ప్రవహిస్తున్న అశ్లీలం మానవ సంబంధాలను అమానవీయంగా మార్చేస్తున్నప్పుడు, నమ్మకాలకు– అనుమానాలకు కొత్త అర్థాలు చెప్పుకోవడం తప్పనిసరి!

> బాధ్యతల కన్నా హక్కుల్ని, నియమిత స్వాతంత్ర్యం కన్నా విచ్చలవిడి స్వేచ్ఛను కోరుకుని, మనమీద మనమే నమ్మకం కోల్పోయాం కనుక... నమ్మాల్సిన వాళ్లు, నమ్మదగ్గ వాళ్లు కూడా అనుమానితుల జాబితాలో చేరక తప్పదు. ప్రేమగా తడుముతున్న బాబాయ్‌లో బుసలు కొడుతున్న కసాయి ఉండవచ్చు. ఆప్యాయంగా ఆశీర్వదించే ఇంటిపెద్ద చేతులు అవకాశం దొరికితే కీచక హస్తాలుగా సాగవచ్చు.

ఇదివరకు నమ్మకంగా బతికేవాళ్లం. నమ్మకంతో బతికేవాళ్లం. 'నా మీద నమ్మకం లేదా?' అన్న మాటే నమ్మకానికి పెద్ద సర్టిఫికెట్టుగా ఉండేది. కానీ మన విలువల మీద, మన పెంపకాల మీద మనకు నమ్మకం పోయింది కనుక, ఇప్పుడు అనుమానంతో బతకక తప్పదు! ఉత్తరకోస్తాలో భర్త భుజంపై చెయ్యివేసి, బైకుపై నమ్మకంగా కూర్చున్న భార్య, తామెక్కడిదాకా వచ్చామో ప్రతి క్షణం ప్రియుడికి మెసేజ్‌లు పంపింది. ఏ అనుమానమూ రాకుండా, అనుకున్న చోటుకు రాగానే బండి ఆపించి తాను పక్కకు వెళ్లింది. ప్రియుడా భర్తను బండరాయితో మోది చంపేశాడు. ప్రియుడు అనుమానిస్తాడని భయపడి, బుద్ధి చెప్పబోయిన తల్లినే నమ్మకంగా వంచించి చంపిందో హైదరాబాద్ అప'కీర్తి'! భర్తను చంపి, ఎవరూ అనుమానించకుండా ప్రియుడికి 'ప్లాస్టిక్ సర్జరీ' కట్లుకట్టి, అతడినే కట్టుకున్నవాడిగా నమ్మించబోయిందో పాలమూరు వనిత. భర్త స్నేహితుడే కదా అనే నమ్మకంతో బండెక్కితే బండెడు అవమానానికి గురై ప్రాణాలు విడిచింది కరీంనగర్ మహిళ. భాగ్యనగరంలో ఉంటున్న భార్య ఫోనెందుకు ఎత్తడం లేదు చెప్మా! అని, ఆస్ట్రేలియాలో ఉన్న ఓ అభాగ్యుడికి అనుమానమొచ్చింది. హైదరాబాద్‌కు వచ్చి ఇరవై రోజులు రెక్కీ వేస్తే, అనుమానమే నిజమని తేలింది. నిన్నటికి నిన్న యాదాద్రి జిల్లాలో కోడలిని లైంగికంగా వేధించిన మామ... కొడుకు చేతిలో హతమయ్యాడు.



వివాహేతర బంధానికి అడ్డొస్తున్నారని కరీంనగర్ జిల్లాలో మామకు, భర్తకు, పిల్లలకు ఏమాత్రం అనుమానం రాకుండా విషం కలిపిన పాయసం పెట్టిందో అతివ. నిన్నటికి నిన్న వరంగల్‌లో మిత్రుడు కదా పిలిచాడని పుట్టిన రోజు నాడు ఏమాత్రం అనుమానించకుండా వెళితే, 19 ఏళ్ల మానస నమ్మకం వమ్మై తను శవమైంది. మూతి మీద మీసం కూడా పూర్తిగా మొలవని పిల్లలు, స్కూటర్‌కు పంచర్ వేయించి సాయపడతామంటే, అనుమానించకుండా నమ్మినందుకు, ప్రియాంకం విషాదాంతమైంది. 'నా కొడుకు ఇలా హత్య చేశాడంటే నమ్మలేం' అంటూ నమ్మకంగా చెప్పారు మహ్మద్ పాషా తల్లిదండ్రులు. 'మా అమ్మాయి తప్పిపోయింద'ని ఫిర్యాదు చేస్తే, 'ఎవరితో లేచిపోయిందో' అని అనుమానించి, 'బాయ్‌ఫ్రెండ్స్ లిస్టుందా?' అని ఆరా తీస్తారు ఫ్రెండ్లీ పోలీసులు. అనుమానించాల్సిన వాళ్లు అనుమానించాల్సిన పద్ధతిలో అనుమానించరు. అనుమానించకూడని వారు అసహ్యకరమైన రీతిలో అనుమానిస్తారు! ఇక నమ్మేది ఎవరిని? నమ్మేది ఎలా?

బాధ్యతల కన్నా హక్కుల్ని, నియమిత స్వాతంత్ర్యం కన్నా విచ్చలవిడి స్వేచ్ఛను కోరుకుని, మనమీద మనమే నమ్మకం కోల్పోయాం కనుక... నమ్మాల్సిన వాళ్లు, నమ్మదగ్గ వాళ్లు కూడా అనుమానితుల జాబితాలో చేరక తప్పదు. ప్రేమగా తడుముతున్న బాబాయ్‌లో బుసలు కొడుతున్న కసాయి ఉండవచ్చు. ఆప్యాయంగా ఆశీర్వదించే ఇంటిపెద్ద చేతులు అవకాశం దొరికితే కీచక హస్తాలుగా సాగవచ్చు. అందమైన భార్య ఉన్నా అతడు పక్కచూపులు చూడవచ్చు. ప్రేయసితో కలసి భార్యను కడతేర్చవచ్చు. లంకంత కొంప, తరగని ఆస్తి వున్నా, కాలేజీ రోజుల్లో ప్రేమించిన కుర్రాడిని మరవలేక భర్తను ఆమె బలి తీసుకోవచ్చు. నిత్యానందుడైన స్వామీజీ మీ అమ్మాయిల్ని ఆశ్రమంలో చేర్చమన్నాడా? లోబరచుకునే ప్రమాదం ఉండవచ్చు. రోడ్డుపై ఎవడైనా లిఫ్ట్ ఆఫర్ చేశాడా? హోమో సెక్సువల్ అయి ఉండవచ్చు. రాత్రిపూట రహదారిలో చిక్కుకున్న ఆడపిల్ల వద్దకు సాయం చేస్తానంటూ వచ్చాడా? పాపిష్టి రేపిస్టు కావచ్చు. హనీమూన్ కోసం హోటల్‌కు వెళ్లారా? గదిలో ఏ మూలనో రహస్య కెమెరా పెట్టవచ్చు. మీరు నిత్యం వాడే మీ ఫోనులోనే మీ ప్రైవేటు ఫొటోలను సంగ్రహించే స్పైవేర్ దాగి ఉండవచ్చు. అనుమానించక తప్పదు. అదే పనిగా ఫోనులోనే గడుపుతున్న మీ అమ్మాయి ఎందుకలా చేస్తున్నదో అనుమానించాల్సిందే. అస్తమానం బలాదూరు తిరిగే మీ అబ్బాయి దుర్మార్గాలేమైనా చేస్తున్నాడా అనుమానించాల్సిందే. భర్తను భార్య, భార్యను భర్త కూడా అనుమానించాల్సిన కాలమిది. కడపదాటి కాలు బయటపెడితే నమ్మకంగా నయవంచన చేసేవాళ్లే తప్ప, నమ్మదగ్గవాడు ఒక్కడూ కనిపించడం లేదు! ఇంట్లో కూడా ఎంతవరకు భద్రమో ఎవరూ చెప్పడం లేదు. అందువల్ల అనుమానించడం తప్పనిసరి! ఇప్పుడు జీవితమే అనుమానం. అనుమాన మే జీవితం! ఎవరినైనా నమ్మడం ప్రమాదం... ప్రత్యక్షంగానైనా, పరోక్షంగానైనా అనుమానించడమే ప్రమాణం! ఇదే ఆప్తవాక్యం!! నమ్మిన వారినే కదా మోసం చేసేది. చేయగలిగేది. అందువల్ల ఎవరినీ నమ్మకండి. ప్రతి ఒక్కరినీ నమ్మకంగా అనుమానించండి. అదే శ్రీరామరక్ష!!

**చివరాఖరు:** పంచర్ వేయించుకు వస్తామన్న యువకులను అనుమానించలేదు ప్రియాంక! తనను వాళ్లు మాటలతో మభ్యపెట్టి పక్కదారి పట్టిస్తున్నారనీ అనుమానించలేదు. హైవే మీద నిలబడడం సేఫ్ అని చెల్లి చెప్పిన మాటను నమ్మలేదు. రాత్రి తొమ్మిదిన్నర సమయంలో టోల్‌బూతు పక్కన నిలబడితే, వచ్చి పోయే వాహనాల వారు తనను 'మరోలా' చూస్తారేమోనని అనుమానపడింది. అదే ఆమె ప్రాణం తీసింది. రాత్రి పూట రోడ్డు మీద నిలబడడానికే మహిళ అనుమానపడే వాతావరణం... నిలబడ్డ మహిళను అనుమానించే సమాజం దేనికి సంకేతం? ఇది ఎవరికి అవమానం?

■ కృ.తి.
kruthi1972@gmail.com

epaper.andhrajyothy.com



# ఈ నేరం మనందరిదీ!

స్మార్ట్ ఫోన్ల మురుక్కాలువలోంచి మెదళ్ళలోకి
అశ్లీలపు అశుద్ధం ప్రవహిస్తున్నప్పుడు...

హీరోయిన్లను 'రావే... పోవే' అని మర్యాద చేస్తూ,
కొట్టడం, తన్నడమే ప్రేమ అని ప్రబోధించే హీరోలే ఆదర్శం అయినప్పుడు...

'పరాయి అమ్మాయి కూడా మనింటి ఆడపిల్ల లాంటిదే'
అనే ఇంగితాన్ని కుటుంబాలు నేర్పనప్పుడు...

మహిళను ఒక సరుకుగా చూసే కోణాన్నే వ్యాపారం ప్రచారం చేస్తున్నప్పుడు...

నిన్న నిర్భయ...

నేడు హైదరాబాద్ పశు వైద్యురాలు..

రేపు మరొకరు...

రెండ్రోజులు మనసు చెదిరో, మొక్కుబడిగానో ఆక్రోశం వెళ్ళగక్కుతాం.

మళ్ళీ మనదైన ఉదాసీనతలో తలదాచేసుకుంటాం!

కాదు, కాదు... మన బలహీనతల్లోకి తల దించేసుకుంటాం!!

అవును... నేరం మనందరిదీ కదా! కాదా?

"చాలామందికి తెలియని విషయం ఏమిటంటే, ఎవరైనా, ఎప్పుడైనా, ఏ పోలీస్ స్టేషన్‌లో అయినా 'ఎఫ్.ఐ.ఆర్' నమోదు చేయవచ్చు. నేరం జరిగిన ప్రదేశం ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుందనే దానితో నిమిత్తం లేకుండా ఎక్కడైనా కేసు నమోదు చేయడానికి ఉపయోగపడే ఆ వెసులుబాటే... 'జీరో ఎఫ్.ఐ.ఆర్'! నేరం జరిగిన ప్రదేశ పరిధితో సంబంధం లేకుండా ఈ ఎఫ్.ఐ.ఆర్‌ను నమోదు చేయవచ్చు. అలా నమోదయ్యే ఎఫ్.ఐ.ఆర్ నంబరును జీరోగా పరిగణిస్తారు. ఆ తరువాత, నేరం జరిగిన ప్రదేశం ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుందో ఆ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదును బదిలీ చేస్తారు. ఆ పోలీస్ స్టేషన్ నుంచే నేరంపై ప్రధాన విచారణ మొదలవుతుంది."



## ఆరు దాటితే... అబ్బాయిలు కనిపించకూడదు!

**- 'పద్మశ్రీ' సునీతాకృష్ణన్,** ప్రజ్వల ఫౌండేషన్ సహ సంస్థాపకురాలు, సినీ నిర్మాత.

"అన్నిటికన్నా ముందుగా... ఒక సమాజంగా మనమంతా విఫలయ్యాం. ఇటువంటి కొడుకులకా మనం జన్మనిస్తున్నది! వాళ్లు మనుషులు కాదు... మృగాల కన్నా హీనమైనవాళ్లు. మృగమని కూడా చెప్పకూడదు. అలా అంటే మృగాన్ని అవమానపరిచినట్టే! ఆ నలుగురూ ఎవరికో బిడ్డలే కదా! ఇటువంటి జంతువులనా మనం తయారు చేస్తున్నది? మనం ఇటువంటి ట్రాజెడీలో ఉన్నాం! ఒక అమ్మాయి ఒంటరిగా నిలబడి ఉంటే... ఆమెను ఎలా నాశనం చేయాలనే ఆలోచనలు, భావాలు ప్రతి ఒక్కరిలో వస్తున్నాయంటే ఎక్కడో మనమంతా ఒక సమాజంగా విఫలమయ్యాం.

రెండోది... వ్యవస్థ, యంత్రాంగం! పబ్లిక్ ప్లేస్‌లో ఒక బండి మూడు గంటలు పడి ఉంటే... హైవేలో గస్తీ కాసే పోలీసులు గానీ, హైవే సిబ్బంది గానీ పట్టించుకోలేదు. యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించలేదు. వ్యవస్థ కూడా విఫలమైంది. ఈ లోపాలను ఎలా సరిదిద్దాలో నాకు తెలియదు. మూడోది... తెలంగాణ ప్రభుత్వం చాలా సంతోషంగా బార్లు, మద్యం షాపులకు లైసెన్సులు ఇస్తున్నారు. మేము ఆశ్రమం పెట్టిన రంగారెడ్డి జిల్లాలోని అమనగల్లుకు వస్తే తెలుస్తుంది. ఒక చిన్న ఊరిలో నాలుగు వైన్ షాపులు ఉన్నాయి.

సాయంత్రం నాలుగు గంటల నుంచి తొమ్మిది గంటల వరకూ తాగి, తాగి... ఒక అమ్మాయిని రేప్ చేసి, ఎలా చంపాలని ప్లాన్ చేస్తున్నారు. ఎక్కడ ఎక్కడ లారీ అడ్డాలు ఉన్నాయో? ఎక్కడ మగవాళ్లు ఎక్కువగా కూర్చుని మాట్లాడుకుంటున్నారో? అటువంటి ప్రదేశాల్లో అదనంగా గస్తీ పెట్టడం అవసరం. ఇప్పుడు పరిస్థితి మగవాళ్ల ముఖాలు చూడటం కూడా డేంజరే అన్నట్టుగా తయ్యారయ్యింది. ఇప్పుడు పశు వైద్యురాలి ఘటన పక్కన పెట్టి... హన్మకొండలో కథను చూడండి! అమ్మాయికి పరిచయం ఉన్న అబ్బాయే ఆమెను చంపాడు. ఇప్పుడు మనం ఎవరిని నమ్మాలి? స్నేహితుల్ని నమ్మడానికి లేదు. అమెరికాలోని ఒక తెలుగమ్మాయిని యూనివర్సిటీలోని గ్యారేజ్‌లో అత్యాచారం చేసి చంపారు. కళాశాల్లో, నడిరోడ్డులో, స్నేహితుల సమక్షంలో... ఎక్కడా మహిళలకు రక్షణ లేదు.

మన అమ్మాయిలకు మనం ఏం నేర్పిస్తున్నాం? అందరి దగ్గర భయపడి ఉండమని! ఎవరినీ నమ్మవద్దని! ప్రతిరోజూ నాలుగు దిక్కులు చూసుకుంటూ బతకాలి. పాత రోజుల్లో, నేను పెరుగుతున్నప్పుడూ ఇంట్లో 'ఆరు గంటలకు ఇంటికి వచ్చేయాలి' అని చెప్పేవారు. ఈ ఘటనల వల్ల అటువంటి మాటలు ఎక్కువ అవుతాయి. రాత్రి బయటకు వెళ్లొద్దని చెబుతారు. ఇప్పుడు నేను ఏం చెబుతానంటే... 'ఆరు గంటల లోపు అబ్బాయిలు ఇంటికి వచ్చేయాలి. రాత్రి ఏ అబ్బాయీ రోడ్డు మీద కనిపించకూడదు'. అటువంటి నాకాబందీ చేస్తే... ఈ ధోరణి మారుతుందేమో! సమాజంలో ఏదో ఒక విప్లవాత్మకమైన మార్పు రావాలి.

ఇప్పుడు బాధితురాలైన ఆ అమ్మాయి పేరును అందరూ ఎంతో ఈజీగా చెబుతున్నారు. కానీ, ఆమె హత్యాచారానికి కారణమైన ఆ నలుగురి పేర్లు ఎవరూ చెప్పడం లేదు. అందరి నోటికీ అమ్మాయి పేరు ముందు వస్తుంది. ఆమె '100'కి ఎందుకు కాల్ చేయలేదని కొందరు పెద్దలు అంటున్నారు. అన్నీ ఆమె మీదే! ఆ నలుగురూ ఆధారాలు మాయం చేయాలనీ, నాశనం చేయాలనీ అమ్మాయిని తగలబెట్టారు. తాగినా... తెలివిలేని వ్యక్తులు కాదు. ఒక ఉద్దేశంతో చేశారు. ఇటువంటి వాళ్లకు న్యాయస్థానం మరణ శిక్ష విధిస్తే... మనలో సో కాల్డ్ హ్యూమన్ రైట్స్ యాక్టివిస్టులు బయటకొస్తారు. మరణశిక్ష విధించకూడదని చెబుతారు. సమాజంలో ఏమవుతుందంటే... నిందితులకు ఎలా మంచి వాతావరణం కల్పించాలనే అంశంపై ఎక్కువ కృషి చేస్తున్నారు. అమ్మాయిలు ఎవరూ బాధితులు కాకూడదంటే ఏం చేయాలనే అంశంపై చేస్తున్న కృషి తక్కువే!

ఇప్పుడు ప్రజలు, మీడియా, అందరూ ఎందుకింత మాట్లాడుతున్నారు? ఆ అమ్మాయి ఒక డాక్టర్ కనుక! చదువుకున్న అమ్మాయి కాబట్టి! ఎవరో లేబర్ క్లాస్ అమ్మాయికి ఇలా జరిగితే ఇంత అటెన్షన్ పెడతారా? ఇంత సంచలనం అవుతుందా? ఇప్పుడు మనకూ ఈ విధంగా అవుతుందేమోనని అందరిలో ఉన్నట్టుండి ఒక భయం పుట్టుకొచ్చింది. జీవితానికే విలువ లేని సమాజం మనది. అందరినీ సమానంగా చూడడం లేదు. చిన్నారులపై హత్యాచార ఘటనలు మేం రోజూ చూస్తున్నాం. వాటిని ఇంత పెద్దగా ఎవరూ చూపించడం లేదు. అందుకే, మనల్ని మనం ప్రశ్నించుకోవాల్సిన సమయం వచ్చింది.

మీడియా ప్రవర్తించిన తీరు కూడా నాకు నచ్చలేదు. మీ కుటుంబంలో అమ్మాయికి అలా జరిగితే... ఆ సమయంలో కెమెరా, మైకుల ముందు ఉండాలని కోరుకుంటారా? ఆ మాత్రం ఎందుకు తెలియడం లేదు. సానుభూతి లేదా? అమ్మాయికి అలా జరిగిందని తెలిసిన తర్వాత నాకు నిద్ర పట్టలేదు. ఏమీ తినలేదు. నా ఇంట్లో జరగలేదు. కానీ, నేను ఇంత ఫీల్ అవుతుంటే? ఆ అమ్మాయి కుటుంబం ఎంత ఫీల్ అవుతోందో ఊహించండి. వీఐపీలు, రాజకీయ నాయకులు, మీడియా - ఆ ఇంటికి వెళ్లి చేసింది చూసి ఏమనాలి? మన జీవితాల్లో ఇదొక చీకటి రోజు. ఎవ్వరికీ సెన్సిటివిటీ అనేది లేదు! ఒక మనిషి పోయిన బాధలో ఉన్నవాళ్లకు ఆ చేదు నిజాన్ని నమ్మడానికి సమయం ఇవ్వండి.

చట్టప్రకారం ఇటువంటి దురాగతాలకు పాల్పడినవాళ్లకు ఎటువంటి శిక్ష వేస్తారో అదే వేయాలి. అయితే, భయం ఎప్పుడు వేస్తుంది? సకాలంలో శిక్ష అమలు చేసినప్పుడు! మరణశిక్ష విధిస్తే... వెంటనే మరణశిక్ష అమలు కావాలి. అదే ప్రజల్లో భయం కలిగిస్తుంది. తీహార్ జైల్‌లో 2012 కేసు (నిర్భయ ఘటన)లో ఇద్దరు కూర్చున్నారు. సంతోషంగా, మనకు చీఫ్ గెస్టుల్లా కూర్చున్నారు. ఇప్పటికి ఆ ఘటన జరిగి ఏడేళ్లు నిండుతోంది. ఇంకా నిందితులకు శిక్ష పడలేదు. అటువంటప్పుడు ప్రజల్లో భయం ఎందుకు వస్తుంది? తొమ్మిది నెలల బిడ్డ వరంగల్‌లో రేప్‌కి గురవుతుంది. సెషన్ కోర్టు త్వరితగతిన విచారించి మరణ శిక్ష విధిస్తుంది. హైకోర్టు ఆ శిక్ష తీవ్రతను తగ్గిస్తుంది. శిక్ష విధించడమే కాదు... వందశాతం ఆ శిక్ష అమలు అయినప్పుడే ఎవరికైనా భయం వేస్తుంది. 'మీకు చేయడానికి వీలు కాకపోతే మాకు వదిలేయండి' అనే భావన ప్రజల్లో తీసుకొస్తున్నామంటే యంత్రాంగం విఫలమైనట్టే! వ్యవస్థ ఎక్కడ విఫలమవుతోందో విశ్లేషణ చేయాలి. పరిష్కారాలు ఏంటని అందరం కలిసి ఆలోచించాలి."



## వెబ్ సిరీసులకూ సెన్సార్ ఉండాలి!

**- బలభద్రపాత్రుని రమణి,** ప్రముఖ కథా, సినీ రచయిత్రి

"ఆడవారిపై ఇటీవల జరుగుతున్న సంఘటనలు చాలా భయంకరం. రోడ్డు మీద వెళుతుంటే ఆడపిల్లలు ఎవరు కనపడినా, ఈ పూట 'ఈ అమ్మాయి క్షేమంగా ఇంటికి వెళుతుందా, లేదా' అని భయం వేస్తోంది. 'ఇంకెన్ని ఘోరాలు చూడాల్సి వస్తుందో?' అని బాధ వేస్తోంది. ఇవేవీ చూడకుండా మనం ఈ లోకం నుంచి వెళ్ళిపోతే బాగుండని అనిపిస్తోంది. తెలంగాణ, తమిళనాడు, జార్ఖండ్... ఇలా దేశమంతటా ఒకదాని తరువాత మరొకటిగా జరుగుతున్న ఘటనలతో ఆడపిల్లల తల్లితండ్రులకు కంటి మీద కునుకు లేదు. అందరూ అంతగా మనసుకు తీసుకున్నారు. ఇది తీరని విషాదం. ఇలాంటి దురాగతాలు చేసిన వ్యక్తులను విచారణ, చట్టం, న్యాయం పేరిట దీర్ఘకాలం జైళ్ళలో ఉంచి పోషించే కన్నా, ఆగ్రహంతో ఊగిపోతున్న జనం మధ్య వదిలేస్తే చాలు. మళ్ళీ ఇంకొకరు ఇలాంటి దురాగతాలకు పాల్పడే ధైర్యం చేయకుండా జనమే రాళ్ళతో కొట్టి చంపి, న్యాయం చేస్తారన్నంత కోపం వస్తోంది.

ఇలాంటి సంఘటనలు జరగడానికి కారణం కూడా ఒక రకంగా మనమూ, మన సమాజమే! చదువు, సంపాదనల విషయంలో అంతరాలు పెరిగిపోతున్న ఈ సమాజంలో ఆర్థికంగా బాగుండి, అందంగా, ఆకర్షణీయంగా ఉన్న వర్గాల పిల్లలపై తెలియని కసి, కోపం దిగువ వర్గంలో పెరిగిపోతోంది. చదువు, సంస్కారం పెద్దగా లేక, తల్లితండ్రుల సరైన పెంపకం లేక, జులాయిగా పెరిగిన పిల్లలు మద్యానికీ, మాదక ద్రవ్యాలకూ అలవాటు పడ్డాక పశుప్రవృత్తితో ప్రవర్తించడం... ఈ సమస్యకు ఓ కారణమని నాకు అనిపిస్తోంది. నిజానికి, ఇలాంటి ఉన్మాదులు అన్ని వర్గాలలో ఉంటారు. అంతెందుకు... 'ఆడపిల్లను అలా అనుభవించడంలో ఎంతో మజా ఉంది, రేప్‌లకు శిక్ష తీసెయ్యాలి' అంటూ నీచంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న ప్రబుద్ధులూ మన మధ్యనే ఉన్నారు. నోరు లేని జీవాలకు వైద్యం చేసే వైద్యురాలు అయినా మన చుట్టూరా ఇలాంటి మృగాలు అన్ని వర్గాలలో ఉంటాయని తెలుసుకోవడానికి తాజాగా హైదరాబాద్‌లో బాధితురాలైన అమ్మాయి వయసు, అనుభవం చాలలేదు. విషాదం ఏమిటంటే, ఇవాళ టిక్ టాక్‌లు తీసుకోవడం మీద శ్రద్ధ పెడుతున్న అమ్మాయిలు ఆ చేతితోనే ఏ 100, 112, 1090 లాంటి నంబర్లకు ఫోన్ చేయాలని కూడా తెలుసుకోకపోవడం! ఆ రకమైన చైతన్యం కలిగించకపోవడం మనందరి తప్పే!

ఒక సినీ కథా రచయిత్రిగా ఆలోచిస్తే, పశువైద్యురాలి కేసు లాంటి హత్యాచారాల వెనుక 'ఎవరైనా డబ్బున్న పెద్దల ప్రమేయం ఉందా', 'ఏదో అడ్డు తొలగించుకోవడానికి ఎవరైనా ఇలా చేయించారా' లాంటి ఊహలు కూడా వస్తున్నాయి. ఇవాళ మనం చూస్తున్న సినిమాలు, సీరియళ్ళు, ఇంటర్నెట్ లో వస్తున్న క్రైమ్, సెక్స్ థ్రిల్లర్ వెబ్ సిరీస్‌లు కూడా ఇలాంటి ఘటనలకు కారణమని చెప్పడానికి నేను వెనుకాడట్లేదు. సీరియళ్ళు చూసి మొగుడి స్థానంలో మరొకరిని మొహం మార్చి తీసుకురావడానికి ప్రయత్నించిన సంఘటనలు చూశాం. ఆ మధ్య వచ్చిన ఓ సినిమా చూసి, చేతిలో పూర్తి మందు బాటిల్‌తో, అమ్మాయితో ఇష్టారాజ్యంగా ప్రవర్తించి, చివరకు ఆ పిల్ల తండ్రినే పెంపకం గురించి ప్రశ్నించే కథానాయక పాత్రలను చూశాం. అక్కనూ, తల్లినీ కూడా కామించిన పాత్రలతో తెలుగులోకి వచ్చి పడ్డ సినిమాలూ ఉన్నాయి. అన్యభాషల నుంచి వచ్చిపడుతున్న అనేక వెబ్ సిరీసుల్లో కత్తికో కండగా చిన్నపిల్లల్ని చంపే జుగుప్సాకరమైన హింస, యథేచ్ఛగా మాదకద్రవ్యాల వాడకం, విచ్చలవిడి శృంగారం, హద్దులు లేని కాముకత్వం లాంటి దృశ్యాలు నేరుగా ఇంట్లో స్మార్ట్ టీవీల్లోకి, ఇంకా చెప్పాలంటే చేతిలోని స్మార్ట్ ఫోనుల్లోకి వచ్చిపడుతున్నాయి. చాప కింద నీరులా ఈ విషసంస్కృతిని మన సినీ, టీవీ, వెబ్ మీడియాలు అన్ని వర్గాల ప్రజల్లో ఇంజెక్ట్ చేస్తున్నాయి. చేతిలోని ఫోనులో యాప్ ద్వారా బస్సులో మొదలు పబ్లిక్ టాయిలెట్ దాకా ఎక్కడైనా కూర్చొని ఇలాంటివి చూసినవాడు ఆ ఉద్రేకంలో వరుస వావి లేకుండా ఎవరితో ఎలా ప్రవర్తిస్తాడో ఇట్టే ఊహించవచ్చు. అందుకే, హింసనూ, లైంగికతను ఎక్కడ ఆపాలో తెలియని వారి చేతిలో ఉన్న వెబ్ మీడియాకు కూడా సెన్సార్ ఉండడం అవసరం అని గట్టిగా నమ్ముతున్నా. డ్రగ్స్ అశ్లీల వెబ్ సైట్లు, వెబ్ సిరీసులను ప్రభుత్వం ఇప్పటికైనా కట్టడి చేయకపోతే కష్టం. ఎన్ని దశాబ్దాలు గడిచినా స్త్రీల భద్రత, స్వేచ్ఛ ఎప్పటికీ ప్రశ్నార్థకంగానే మిగిలిపోతుంది! ఆ పాపంలో మనదీ భాగం అవుతుంది!!"



## జీవించే హక్కునే చిదిమేస్తున్నారు...

**- లుబ్నా సర్వత్,** మానవహక్కుల కార్యకర్త

మహిళలపై అత్యాచారం, నేరాలు ఆందోళనకర స్థాయిలో రోజు రోజుకీ పెరిగిపోతున్నాయి. తాజాగా హైదరాబాద్‌లో జరిగిన సంఘటన తలచుకుంటే గుండెలు పగులుతున్నాయి. ఎక్కడికి వెళుతున్నా నాలో ఏదో తెలియని భయం మొదలైంది. మహిళలపై నేరాలు నియంత్రించేందుకు సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసుస్టేషన్లను బలోపేతం చేశామని ప్రభుత్వం అంటోంది. కానీ తాజా సంఘటన గమనిస్తే పోలీస్ స్టేషన్లలో అత్యాధునిక సాంకేతిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం చెబుతున్న మాటలు నీటిమూటలని తేలింది. అంతేకాదు గతంలో కన్నా మహిళలపై నేరాలు పెరిగాయా? తగ్గాయా అంటే చిన్నపిల్లవాడు సైతం పెరిగాయనే చెప్తాడు.

ఆడవాళ్లపై జరుగుతున్న అత్యాచారాలు ఒక సామాజిక నేరం. ఆడవాళ్లను కళ్లార్పకుండా చూడడం కూడా నేరమని నిర్భయ చట్టంలో స్పష్టంగా పేర్కొన్నారు. కానీ ఆ చట్టం గురించి సమాజంలో అవగాహన ఏం తెచ్చారు? అమ్మాయిలను స్టాకింగ్ చేయడమే నేరమైనప్పుడు వారిని బలత్కారం చేసి మహిళల 'సృష్టి స్థానం' పై దాడి చేయడం ఇంకెంత అమానవీయం? మహిళల హక్కులూ మానవ హక్కులేననే సత్యాన్ని మంటగలిపి స్త్రీలను హింసలకు గురి చేస్తున్నారు. చంపేస్తున్నారు. స్త్రీల 'ఐడెంటిటీని' సవాలు చేస్తున్నారు. పైగా ఈ నేరాలకు పాల్పడుతున్న మగవాళ్లను 'పశువుల'ంటూ పశువులనే అవమానపరుస్తున్నారు. ఆడవాళ్ల మీద నేరాలు రాను రాను పెరగడానికి కొన్ని కారణాలు ఉన్నాయి. మందు తాగండంటూ ప్రభుత్వం ఎంతో ఆర్గనైజ్డ్‌గా చేపడుతున్న చర్యలు ఇందుకు ఒక ముఖ్య కారణం. ప్రభుత్వం తన ఖజానా నింపుకోవాలని చేస్తున్న ఈ చర్య అతి పెద్ద నేరం.

ఆడవాళ్లపై అత్యాచారాలు, హింస, నేరాలు తాగిన స్థితిలో చేసినవి ఎక్కువగా ఉండడం బహిరంగమే. నేటి సినిమాలు యువతను రెచ్చగొట్టేలా ఉంటూ హింస, అత్యాచారాలు, ఆడవాళ్లపై తక్కువ భావం, వారిని ఒక వస్తువుగా/ఆస్తిగా చూసే స్వభావం పెంచి పోషించడం మరో ముఖ్య కారణం. మూడోది నేరస్థులను శిక్షిస్తామంటున్నారు. నేరాలు జరగకుండా మీరు చేపట్టిన నియంత్రణ చర్యలు ఏమిటో చెప్పండి. ఇవన్నీ కూడా మహిళల హక్కులే. వీటిపై ప్రభుత్వం నోరు విప్పాలి. పోలీసులు జవాబు చెప్పాలి. భవిష్యత్తులో ఇలాంటి ఇంకో కేసు పునరావృతం కాదని శపథం చేసి చెప్పగలరా? ఏదీ మా భద్రత? ఏదీ మా జీవించే హక్కు? ఏదీ గౌరవంగా బతికే మా హక్కు? స్వేచ్ఛావాయువులు పీల్చే హక్కు? చదువుకునే హక్కు...? నచ్చిన పనిచేసే హక్కు? అత్యాచారానికి గురైె రిపోర్టు కాని అమ్మాయిల కేసులెన్నో.... ఇటీవల నాలుగు నెలల పసికూన మీద జరిగిన అత్యాచారం కేసును తప్పుడు సెక్షన్ కింద పోలీసులు పెట్టారు. సమాజంలో బాధ్యతాయుతమైన ప్రవర్తన లేదు. జనాభాలో స్త్రీ,పురుషులు సగం సగం ఉన్నారు. ఈ నేరాలు మీరు అరికట్టలేరు. ఒక పనిచేయండి. మగవాళ్ళందరినీ ఇంట్లో ఉంచేసి ఆడవాళ్లని బయట తిరగనీయండి.... అపుడు ఒక్క నేరం వారిపై జరగకుండా స్వేచ్ఛా విహంగుల్లా హాయిగా తిరగగలరు. టోల్‌గేట్ చార్జి మహిళలకు లేకుండా చేసి ఉంటే హైదరాబాద్‌లో అఘాయిత్యానికి గురైన యువతికి ఈ పరిస్థితి రాకుండా ఉండేదేమో. అందుకే మహిళలకు 'టోల్ ఫ్రీ' నిర్ణయం వెంటనే తీసుకోవాలి. ఒక్క మాట నిజం.... నాలుగు నెలల చిన్నారి నుంచి వృద్ధ మహిళ వరకూ ఎవ్వరూ నేటి సమాజంలో సురక్షితంగా లేరు. మహిళలపై జరుగుతున్న నేరాల పట్ల బాధ్యతాయితంగా వ్యవహరించాలనే స్పృహ పెంపొందాలంటే నిర్దిష్టమైన సామాజిక నిర్మాణ ఆవశ్యకత ఎంతో ఉంది.



సేకరణ: **డాక్టర్ రెంటాల జయదేవ, నాగసుందరి, సత్య పులగం**















## మనల్ని మనమే కాపాడుకోవాలి!

**- నిహారిక కొణిదెల,** నటి-నిర్మాత

"మన చిన్నారులను... అమ్మాయిలను... మహిళలనూ బతకనివ్వండి. ఇంట్లో, రోడ్లపై, పని చేసే ప్రదేశాల్లో ఎక్కడా సురక్షితం కాదు. ఆ అమ్మాయి ఎటువంటి బాధను అనుభవించిందో, ప్రతి అమ్మాయి అటువంటి పరిస్థితులను ఎలా ఎదుర్కొంటుందో ఊహించడానికి కూడా నేను సిద్ధంగా లేను. ఈ అపరాధుల్ని శిక్షించడం ద్వారా సమాజంలో తప్పుడు దారిలో వెళ్లాలనుకునే కొందర్ని ఎలిమినేట్ చేయగలం. కానీ... నిర్భయను గానీ, ఆసిఫాను గానీ, ఇప్పుడు ఈ అమ్మాయిని గానీ వాళ్ల తల్లితండ్రులకు తిరిగి ఇవ్వగలమా? మనచుట్టూ సంకుచిత మనస్తత్వం, మానసిక రుగ్మతలు గల మగవాళ్లు చాలామంది ఉన్నారు. నిజం చెప్పాలంటే... మనం ఊహించిగలిగిన దానికన్నా ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. మన దాకా వస్తే కానీ తీవ్రత తెలియదు. అందరికీ నేను చెప్పేది ఒక్కటే... మీరు డ్రైవింగ్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండండి, ఎవరూ ఆపదలో లేకుండా చూడండి. ఒకవేళ గట్టిగా అరుపులు వినిపిస్తే... చుట్టుపక్కల ఎటువంటి ప్రమాదం జరగకుండా చూడండి. అమ్మాయిలందరూ 'షీ టీమ్స్' ఎమర్జెన్సీ కాంటాక్ట్ దగ్గర ఉంచుకోండి. మీరందరూ ధైర్యవంతులే. ఒకవేళ ఎవరికైనా భయం వేస్తే... ధైర్యంగా ఉన్నట్టు నటించండి. మనమంతా శక్తిమంతం కావడానికి మనం ఏం చేయాలో అది చేద్దాం. ఇటువంటి భయంకరమైన సమాజంలో బతుకుతున్నప్పుడు... మనల్ని మనమే కాపాడుకోవాలి. ఆ అమ్మాయికి సారీ... ఇలా జరగకుండా ఉండాల్సింది. మరో రెండు రోజుల్లో మళ్లీ మరో అమ్మాయికి ఈ విధంగా జరిగినా జరగొచ్చు. నాకు ఈ సమాజం గురించి తెలిసిందంతే! ఈ ప్రపంచంలో మహిళలు సురక్షితంగా ఉండే రోజు చూడడం కోసం నేను బతుకుతున్నా."



## ఆ దుర్మార్గులను చంపి జైలుకి వెళ్తా

**- పూనమ్ కౌర్,** నటి

తమ బిడ్డ కనిపించడంలేదంటూ ఆ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేస్తే 'ఎవరితోనైనా లేచిపోయిందేమో' అన్నారట. ఈ విషయాన్ని హైదరాబాద్‌లో హత్యకు గురైన వైద్యురాలి తల్లిదండ్రులు మీడియా ముందుంచారు. దీనిపై సినీ నటి పూనమ్ కౌర్ స్పందించారు. ఓ ఆడ బిడ్డ కనిపించడం లేదంటూ పోలీసులను ఆశ్రయిస్తే 'లేచిపోయిందేమో' అడిగిన పోలీసు అధికారికి 'సిగ్గుందా? బ్లడీ పోలీస్ ఆఫీసర్' అంటూ ఆమె మండిపడ్డారు. 'అసలు మనం ఏ వ్యవస్థలో బతుకున్నాం' అని భావోద్వేగానికి లోనయ్యారు. "ఓ మహిళ నడిరోడ్డున సహాయం కోరితే మృగాళ్ల లాంటి మగాళ్లు ఆ అమ్మాయిని బలవంతంగా లాక్కెళ్లి సామూహిక అత్యాచారం చేసి, అతిదారుణంగా పెట్రోల్ పోసి తగలబెట్టారు. ఆమెను పోలీసులు, ప్రభుత్వ అధికారులు వచ్చి చర్యలు తీసుకునే వరకూ వేచి చూడాల్సిందే! మనం అడవుల్లో బతుకుతున్నామా? అడవిలో బతికే జంతువులకు కూడా ఓ పద్ధతి ఉంటుంది. కానీ మానవరూపంలో ఉన్న మృగాల స్థితే ఆయోమయంగా ఉంది. దేశం మొత్తం ఇదే పరిస్థితి కనిపిస్తుంది. భారతదేశంలో రేప్ టెర్రరిజానికి పరిష్కారం లేదా? బాధితుల గురించి ఆలోచిస్తుంటే గుండె తరుక్కుపోతుంది. ఆమె మరణానికి కారణమైన ఆ మృగాలను చంపి నేనే జైల్‌కి వెళ్తా. రేపిస్టులను చంపడం క్రైమ్ అయితే ఈ సమస్య పరిష్కారంలో భాగంగా క్రైమ్ చేయడానికి నేను రెడీగా ఉన్నా. అత్యాచారమనేది మతపరమైనది కాదు. ఈ ఘటనలో కీలక నిందితుడు మహ్మద్ పాషా. ఈ సమస్యకు మతపరమైన రంగులు పులమొద్దు. అలాగే దయచేసి దీన్ని రాజకీయకోణంలో చూడొద్దు" అని పూనమ్ పేర్కొన్నారు.



## అంతే చెప్పాలి!

**- చిన్మయి శ్రీపాద,** గాయని-డబ్బింగ్ కళాకారిణి

"అత్యాచార ఘటనలు జరిగినప్పుడు అమ్మాయి వివరాలు ప్రచురించడం చట్టవ్యతిరేకం. ఆ వివరాలను చాలా గోప్యంగా ఉంచమని సుప్రీమ్ కోర్టు చెప్పింది కూడా! టీవీల్లో అమ్మాయి ఫోటో, ఎక్కడికి వెళ్లిందీ, ఏ డ్రస్ వేసుకున్నదీ చూపిస్తున్నారు. అమ్మాయి వయసు, ఉద్యోగం మాత్రమే చెప్పాలి. అందరూ హత్యాచార ఘటనకు గురైన అమ్మాయి గురించి ఆలోచిస్తున్నారనేది నేను అర్థం చేసుకోగలను. కానీ, అమ్మాయి వివరాలు వెల్లడించకూడదనేది గ్రహించాలి. ఇక్కడి నుంచి మనం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి"



## నేషనల్ సెక్సువల్ అఫెండర్స్ రిజిస్ట్రీ కావాలి..

**- రచనా రెడ్డి,** అడ్వకేట్

"ఈ రోజు ఆడవారిపై నేరాలు పెరిగిపోవడానికి వ్యవస్థాగత వైఫల్యాలే కారణం. చట్టాన్ని అమలుచేసే లా ఎన్‌ఫోర్సుమెంట్, క్రిమినల్ జస్టిస్ సిస్టమ్‌కి మధ్య సహకారం ఉండడం లేదు. సంఘటన బట్టి అప్పటికప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే దాంట్లో కూడా వైఫల్యాలు చూస్తున్నాం. నేరస్థులను నేరం జరగకుండా పట్టుకునేలా కామన్‌సెన్స్, ప్రెజెన్స్ ఆఫ్ మైండ్ చాలా ముఖ్యం. ఇంకో విషయం ఏమిటంటే విదేశాల్లో మాదిరిగా ప్రమాద పరిస్థితుల్లో ఏం చేయాలి, ఎలా స్పందించాలి తదితర విషయాల మీద మనదగ్గర అవగాహన లేదు. విదేశాల్లో చిన్నపిల్లల్లో సైతం ప్రమాదాన్ని పసిగట్టగల అప్రమత్తత ఉంటుంది. అలా అక్కడ చిన్నతనం నుంచీ రక్షణ పరంగా అవగాహనను పిల్లల్లో పెంచుతారు. తల్లిదండ్రులు, సమాజం కూడా అలాగే చూస్తారు. కానీ మనదగ్గర అలాంటి పరిస్థితులు లేవు. ఇంకో ముఖ్యమైన విషయం ఏమిటంటే జ్యూరిస్‌డిక్షన్. హైదరాబాద్ పశువైద్యురాలి విషయంలోనూ ఈ సమస్య తలెత్తింది. కానీ ప్రమాదంలో ఉన్న వ్యక్తి ప్రాణాలకు ముప్పు ఉందన్న పరిస్థితుల్లో జ్యూరిస్‌డిక్షన్ ప్రధానం కాదు. నేరం జరగకుండా చూడాలి. అది ముఖ్యం. తాజా సంఘటనే గమనిస్తే, రిపోర్టు ఇచ్చిన తర్వాత మిగిలిన కొద్ది సమయం ఎంతో కీలకం... కానీ అప్పటికే నేరం జరిగిపోయింది. ఇది పోలీసు వ్యవస్థలోని ఎన్నో లోపాలను ఎత్తిచూపుతోంది. స్త్రీలపై నేరాలు నివారించాలంటే ట్రాన్సిట్ పాయింట్‌లో పెట్రోలింగ్ తీవ్రస్థాయిలో ఉండాలి. కానీ హైదరాబాద్‌లో జరిగిన తాజా సంఘటన పోలీస్ పెట్రోలింగ్ విషయంలో ఘోర వైఫల్యాన్ని చూపిస్తోంది. ముఖ్యంగా సిటీ ట్రాన్సిట్/ ఎగ్జిట్ పాయింట్లలో తప్పనిసరిగా భారీ పెట్రోలింగ్ ఉండాలి. ఇంకో ముఖ్యమైన విషయం ఏమిటంటే వేరే దేశాల్లో కేసు నమోదు చేసుకునే ఉద్యోగి ఒక్కడే పోలీస్ స్టేషన్‌లో ఉంటాడు. మిగతా పోలీసు సిబ్బంది రోడ్డు మీదే తిరుగుతూ ఉంటారు. కానీ మన దగ్గర ఇందుకు భిన్నమైన పరిస్థితి. అందుకే షీటీమ్స్ కూడా పెట్రోలింగ్‌లో ఉండాలి. ప్రతి అరగంటకు పెట్రోలింగ్ తిరుగుతుండాలి. సెమీ ఇండస్ట్రియల్ ఏరియా, పూర్తిస్థాయి పారిశ్రామికవాడల దగ్గర కూడా పెట్రోలింగ్ ఉండాలి. హైదరాబాద్ కేసు గురించి మాట్లాడుతూ సజ్జనార్ 'ఆపదలో ఉన్న ఆడవాళ్లు నూరు నెంబరుకు ఫోను చేయండి మూడు నిమిషాల్లో అక్కడ ఉంటాం' అన్నారు. కానీ అదెలా సాధ్యం చేస్తారు? ఆ వ్యవస్థ ఏదీ? లాఎన్‌ఫోర్స్‌మెంటు, క్రిమినల్ జస్టిస్ సిస్టమ్ మధ్య కో-ఆర్డినేషన్ లేదు. దానికి సంబంధించిన శిక్షణ లేదు. ఎదుర్కొనే వ్యవస్థ లేదు. అవగాహన లేదు. ముఖ్యంగా మహిళా సంబంధిత నేరాలను ఎలా హ్యాండిల్ చేయాలనేది స్పష్టంగా ఉండాలి. చట్టాల అమలుకు సంబంధించి చూస్తే నిర్భయ చట్టం ప్రొసీజర్లు ఇలాంటి కేసుల్లో పక్కాగా అనుసరిస్తున్నారా లేదా గమనించాలి. అవి ఇళ్లల్లో మహిళలపై జరిగే నేరాలైనా సరే.. వీధుల్లో జరిగే నేరాలైనా సరే. నేరస్తుల్లో కూడా సంస్కరణ మనస్తత్వం ఉన్నవారు ఉంటారు. అలాగే సైకోపాత్స్ కూడా ఉంటారు. రెండో తరహా వాళ్లను సమాజానికి దూరంగా ఉంచాలి. ఇక్కడ ముఖ్యమైంది ఏమిటంటే నేషనల్ సెక్సువల్ అఫెండర్స్ రిజిస్ట్రీని మనదేశంలో కూడా ప్రారంభించాలి. దాని ద్వారా ఇలాంటి వాళ్లను గుర్తించి వారిని మానవ సమాజానికి దూరంగా ఉంచాలి. అరుదైన కేసుల్లో నేరస్థులకు శిక్షపరంగా వేరే ఆప్షన్ లేకుండా ఉండాలి. ఇక మహిళలకు సంబంధించిన చట్టాలు మన దేశంలో బలంగా ఉన్నాయి కానీ వాటి అమలులో జాప్యం, అవగాహనా రాహిత్యం వంటివి మనకున్న కొన్ని ప్రధాన సమస్యలు."

## పెంపకంలో ఇంకా తేడా..

**- ప్రొ.జ్యోతీ రాజా,** సైకాలజిస్ట్



"నా దగ్గరకు వచ్చే చాలా మంది అబ్బాయిలను, అమ్మాయిలను గమనిస్తుంటా. తమ పిల్లలు బాగా చదువుతున్నారా, మంచి మార్కులు తెచ్చుకుంటున్నారా అనే వారి తల్లితండ్రులు చూస్తున్నారు తప్పించి మిగతా సమయాల్లో కాలేజీల్లో/స్కూళ్లలో వారి ప్రవర్తన ఎలా ఉంటోందనే విషయం గమనించుకోవడం లేదు. అంతేకాదు, పిల్లలను పెంచే క్రమంలో నైతిక విలువలు, సంస్కృతి వంటి విషయాలను పిల్లలకు నేర్పాలి అనే ఆలోచన ఉండడం లేదు. అమ్మాయిలనూ, అబ్బాయిలను చూసే విధానంలో కూడా తేడాలు ఉండడం గమనించా. అబ్బాయిలు చదువుకుంటే చాలు. అంతే తప్ప వ్యక్తులుగా వారి గుణగణాల గురించి తల్లిదండ్రులు తెలుసుకునే ప్రయత్నం అంతంతమాత్రంగానే ఉంటోంది. నేటి యువత ఎంతసేపూ మొబైల్, ఫేస్‌బుక్, ఇంటర్నెట్... ఇవే లోకంగా ఉంటున్నారు. పైగా అవి వారిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. తమ చుట్టూ ఉన్న సమాజం గురించి వారికి పట్టని పరిస్థితి ఉంటోంది. ముఖ్యంగా ఈ తరహా మార్పులు టీన్స్‌లోకి అడుగుపెట్టినప్పటి నుంచి బాగా కనిపిస్తున్నాయి. ఒక్కరే పిల్లలు కావడం, తల్లీతండ్రులు ఇద్దరూ ఉద్యోగాలు చేయడం, సినిమాలు, 'ఫన్' అంటూ యువత ఆలోచనా ధోరణి కూడా యువతలో జీవితంపై సీరియస్ దృక్కోణం లేకుండా చేస్తోంది. ముఖ్యంగా అబ్బాయిల పెంపకం విషయంలో ఈ పట్టనితనం బాగా కనిపిస్తోంది. పైగా వాళ్లు కోరిన దానికన్నా ఎక్కువ సదుపాయాలు కల్పించడం కూడా అబ్బాయిలను, అమ్మాయిలను కూడా దారి తప్పేలా చేస్తోంది. తల్లితండ్రులు ఫోన్లు పిల్లల చేతుల్లో పెడుతున్నారు. ఎదిగిన పిల్లల చేతుల్లోకి ఒకసారి ఫోను వెళ్ళాక, వారు ఏం చూస్తున్నారనేది పర్యవేక్షించడం కష్టం. నియంత్రించడం అంతకన్నా కష్టం. కో-ఎడ్యుకేషన్‌లో అబ్బాయిలు, అమ్మాయిల మధ్య స్నేహాలు అపరిపక్వంగా ఉండడంతో అమ్మాయిలు ప్రమాదంలో పడుతున్న సంఘటనలూ ఉంటున్నాయి. కొందరు అమ్మాయిలు కూడా అవకాశాలను సద్వినియోగం కన్నా దుర్వినియోగం చేసుకుంటున్న పరిస్థితి ఉంది. తల్లిదండ్రులు ఎలా చదవాలో వారి మెదళ్లపై రుద్దుతున్నారు కానీ జీవితంలో ఎదురయ్యే సంఘటనలు, పరిస్థితులను ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలో నేర్పించడం లేదు. దీంతో అమ్మాయిల్లో ఆ పరిణతి కొరవడుతోంది. అమ్మాయిలపై ఇప్పుడు జరుగుతున్న నేరాలు, సంఘటనలు గమనిస్తే తిరిగి వాళ్లను ఇంటికే పరిమితం చేసే పరిస్థితులు వస్తాయేమోననే భయమూ ఉంటోంది. తప్పొప్పులను అమ్మాయైనా, అబ్బాయైనా ఎవరికైనా చిన్నతనం నుంచీ తల్లిదండ్రులు చెప్పాలి. సమాజపరంగా అవగాహన పెంచాలి. చుట్టూ ఉన్న పరిసరాలు, వాతావరణం అన్నీ గమనించేలా పెంచాలి. అమ్మాయిల్లో మానసిక సామర్థ్యం ఉంటోంది కానీ దాన్ని ఏ పరిస్థితుల్లో ఎలా వాడాలి అన్నది వారికి తెలియడంలేదు. మానసిక పరిపక్వత ఉండడం లేదు. తల్లిదండ్రులు ఎదిరించడమే ధైర్యం అనుకుంటున్నారు. బాయ్‌ఫ్రెండ్ ప్రవర్తన, మాటలు, చర్యలను సూక్ష్మంగా అర్థం చేసుకునే అవగాహన ఉండడం లేదు."

### డైలీ సుడోకు - 210

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 9 | | | 7 | | | | 3 |
| | | | | | 1 | | | |
| | | 2 | 6 | 4 | | 5 | 1 | |
| | | | 2 | | | 6 | | 1 |
| | 2 | 1 | | | | 9 | 5 | |
| 6 | | 3 | | | 8 | | | |
| | 1 | 9 | | 3 | 6 | 7 | | |
| | | | 7 | | | | | |
| 4 | | | | 2 | | | 6 | |

**సుడోకు- 209 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 2 | 9 | 7 | 1 | 8 | 4 | 3 | 5 | 6 |
| 8 | 6 | 1 | 7 | 5 | 3 | 2 | 9 | 4 |
| 3 | 4 | 5 | 9 | 6 | 2 | 8 | 7 | 1 |
| 7 | 2 | 4 | 8 | 9 | 6 | 1 | 3 | 5 |
| 5 | 8 | 6 | 2 | 3 | 1 | 7 | 4 | 9 |
| 9 | 1 | 3 | 5 | 4 | 7 | 6 | 8 | 2 |
| 4 | 7 | 8 | 6 | 2 | 5 | 9 | 1 | 3 |
| 6 | 3 | 9 | 4 | 1 | 8 | 5 | 2 | 7 |
| 1 | 5 | 2 | 3 | 7 | 9 | 4 | 6 | 8 |

**ఎలా పూరించాలి?** ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

# ఎన్‌ఆర్‌ఐల బాధను చెప్పాం

**- అల్లు అరవింద్**



సాయి తేజ్, రాశీ ఖన్నా

"తేజ్‌తో మా బ్యానర్‌లో ఎప్పటి నుంచో సినిమా చేయాలనుకుంటున్నాం. ఇప్పటికి కుదిరింది. 'భలే భలే మగాడివోయ్' తర్వాత మారుతితో చేస్తున్న సినిమా ఇది. సందేశాన్ని సరదాగా చెప్పే నేర్పరితనం మారుతిలో ఉంది. ఎన్‌ఆర్‌ఐల కథ ఇది. ఈ సినిమా చూశాక వారిలో కొందరు ఆనందపడితే, ఇంకొందరు బాధపడతారు. ఇక్కడి వారితో కనెక్ట్ కాలేక ఎన్నారైలు ఎలా బాధపడుతున్నారన్నది ఇందులో కీలక అంశం" అని అల్లు అరవింద్ అన్నారు. సాయి తేజ్, రాశీఖన్నా జంటగా మారుతి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ప్రతిరోజూ పండగే'. అల్లు అరవింద్ సమర్పకుడు. బన్నీ వాస్ నిర్మాత. శుక్రవారం అన్నపూర్ణ స్టూడియోలో చిత్రీకరించిన పాటతో షూటింగ్ మొత్తం పూర్తయింది. ఈ సందర్భంగా సాయి తేజ్ మాట్లాడుతూ "కథ వినగానే వదులుకోకూడదు అనిపించింది. మారుతిగారి గత సినిమాల్లో హీరో పాత్రకి అరుదైన వ్యాధులు ఉండేవి. ఇందులో అతి మంచితనమే హీరోకున్న డిజార్డర్. ఆరు నుండి అరవై ఏళ్ల వయసు వరకూ అందరికీ కనెక్ట్ అయ్యే సినిమా ఇది" అని చెప్పారు. "సందేశాన్ని వినోదాత్మకంగా చెప్పాం. అన్ని అంశాలు కలగలిసిన ఫుల్ మీల్స్ ఇది. అరవింద్‌గారి బ్యానర్‌లో 'విజేత'లాంటి సినిమా అవ్వాలని బాధ్యతగా తీశాం" అని మారుతి చెప్పారు. తమన్, రాశీఖన్నా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జూ.ఎన్టీఆర్ అంటే ఇష్టం

**- రక్షిత్ శెట్టి**



రక్షిత్ శెట్టి, శాన్వి

"తెలుగు హీరోల్లో యంగ్ టైగర్ ఎన్టీఆర్ అంటే చాలా ఇష్టం. తన నటన, ఆఫ్ స్ర్కీన్, ఆన్ స్ర్కీన్‌లో తన పరిణితి నాకు బాగా నచ్చుతుంది" అని కన్నడ హీరో రక్షిత్ శెట్టి అన్నారు. ఆయన హీరోగా పుష్కర్ మల్లిఖార్జున, హెచ్.కె.ప్రకాశ్ నిర్మిస్తున్న చిత్రం 'అతడే శ్రీమన్నారాయణ'. సచిన్ దర్శకుడు. శాన్వి శ్రీవత్సవ నాయిక. కన్నడ, తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో ఈ సినిమాను విడుదల చేయనున్నారు. ఇటీవల బెంగుళూరులో ఈ సినిమా ట్రైలర్ ఆవిష్కరణ జరిగింది. తెలుగు ట్రైలర్‌ను నాని విడుదల చేశారు. రక్షిత్ శెట్టి మాట్లాడుతూ "నా సినిమా ట్రైలర్‌లను నేనే కట్ చేసుకుంటా. ఈ ట్రైలర్‌ను కట్ చేయడానికి నెల రోజులు పట్టింది. మూడేళ్ల జర్నీ ఈ సినిమా. లవ్, కామెడీ, యాక్షన్ అడ్వెంచర్‌లా అన్ని అంశాలతో ఈ చిత్రం రూపొందింది. బెంగుళూరులో 19 సెట్లు వేసి తెరకెక్కించాం. కన్నడలో డబ్బింగ్ పూర్తి చేశా. హిందీలో కూడా నేనే చెప్పాలనుకుంటున్నా. నిర్మాతల సహకారంతో ప్యాన్ ఇండియా లెవల్లో సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం" అని అన్నారు. రక్షిత్‌తో మరిన్ని చిత్రాలు చేయాలని ఉందని నిర్మాతలు తెలిపారు.






















## రంగు మారింది.. జెండా ఎగిరింది!

అనంతపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాలు.. వాటర్ ట్యాంకులు.. పాఠశాల భవనాలు... తదితరాలన్నీ వైసీపీ రంగులు వేసుకొన్నాయి. ఇప్పుడు వాటిపై పార్టీ జెండాలు ఎగరేసే కార్యక్రమం మొదలైనట్టుంది. అనంతపురం జిల్లా నార్పల మండలం కేశేపల్లి గ్రామంలోని సచివాలయ భవనంపై వైసీపీ జెండా ఎగిరింది. శనివారం ఉదయం వైసీపీ కార్యకర్తలు సచివాలయ భవనంపై పార్టీ జెండా కట్టారు. దీనిని కొందరు ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పెట్టారు. 'ఇదేమి రాజ్యం' అని ప్రశ్నిస్తూ.. ఆ ఫొటో వైరల్ అయ్యింది. దీంతో సాయంత్రం సమయంలో వైసీపీ కార్యకర్తలు జెండాను తొలగించి, భవనంపై పడేసి వెళ్లిపోయారు.

## నెత్తికి 'నవరత్న' తైలం రాస్తున్నారు: లోకేశ్



అమరావతి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆరునెలల్లో మంచి ముఖ్యమంత్రి అనిపించుకుంటానన్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డి... రాష్ట్రాన్ని ముంచేసిన ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోయారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. "విధ్వంసంతో ప్రారంభమైన వైసీపీ ఆరునెలల పాలనలో ఆంధ్రప్రదేశ్‌ను సూసైడ్ ప్రదేశ్‌గా మార్చారు. ఎన్నికల ముందు నవరత్నాలు ఇస్తామని.. అధికారంలోకి వచ్చాక ఆరునెలల్లోనే మాట మార్చేసి ప్రజల నెత్తిన నవరత్న తైలం రాశారు" అంటూ లోకేశ్ శనివారం ట్వీట్ చేశారు. వృద్ధులకు నెలకు రూ.250, రైతులకు నెలకు రూ.625 ఇస్తున్న జగన్... తమ వైసీపీ కార్యకర్తలకు మాత్రం గ్రామ వలంటీర్ల పేరుతో నెలకు రూ.8వేలు ఇస్తూ ఏటా రూ.4వేల కోట్ల ప్రజాధనాన్ని దోచేస్తున్నారని లోకేశ్ ఆరోపించారు.

## మడిచి లోకేశ్ సూట్‌కేసులో పెట్టుకోండి

- టీడీపీ ముద్రించిన పుస్తకంపై కన్నబాబు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆరు నెలల పాలనపై తెలుగుదేశం పార్టీ ముద్రించిన పుస్తకాన్ని మడిచి చంద్రబాబు తనయుడు లోకేశ్ సూట్‌కేసులో పెట్టుకోవాలని మంత్రి కురసాల కన్నబాబు ఘాటుగా వ్యాఖ్యానించారు. ఆ పుస్తకం ఒక అబద్ధాల పుట్ట అన్న ఆయన, ఇరు పార్టీల మేనిఫెస్టోలపై చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. సీఎం జగన్ దయాదాక్షిణ్యాలపైనే టీడీపీ బతికుందని, ఆయన సరేనంటే ఆ పార్టీలో ఒకరిద్దరు మినహా ఎవరూ మిగలరన్నారు. "అవినీతి రహితంగా జగన్ చేసిన ఆరు నెలల పాలనను ప్రజలు మెచ్చుకుంటున్నారు. చంద్రబాబు హయాంలో గాడితప్పిన పాలనను జగన్ సరిదిద్దుతున్నారు. జగన్ పాలన చూసి చంద్రబాబు కడుపు మండుతోంది" అని మంత్రి అన్నారు. అమరావతిలో చంద్రబాబు ఆడిన డ్రామాలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. "అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే జగన్ 90శాతం హామీలు అమలు చేశారు. రుణమాఫీ ఐదు విడతల్లో ఇస్తానని, మూడు విడతలే ఇచ్చి రైతులను చంద్రబాబు మోసం చేశారు. దేశంలోనే అవినీతి సామ్రాట్ చంద్రబాబు. వ్యవస్థలను మేనేజ్ చేయడంలో దిట్ట. నందిని పందిగా, పందిని నందిగా నమ్మించగల సమర్థుడు. చంద్రబాబు ఔట్ డేటెడ్ లీడర్ అయితే, అప్‌డేట్ కాని లీడర్ లోకేశ్" అని వ్యాఖ్యానించారు.

# అరాచకాలను ఎండగట్టండి

- వైసీపీ ప్రభుత్వం చేతకానితనంతో రాష్ట్రానికి కీడు
- పార్టీ నేతలతో టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు



అమరావతి, నర్సీపట్నం టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): "రాష్ట్రంలో అధికార పార్టీ అరాచకాలను ప్రజల్లో ఎండగట్టాలి. ప్రభుత్వ వైఫల్యాలపై గ్రామాల్లో, వార్డుల్లో చర్చలు జరపాలి" అని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పార్టీ నేతలకు సూచించారు. టీడీపీ గ్రామ కమిటీల ఏర్పాటుపై పార్టీ నేతలతో శనివారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆరు నెలల కాలంలో ప్రభుత్వ వరుస వైఫల్యాలను ఆయన వివరించారు. రాష్ట్రం నుంచి పెట్టుబడులన్నీ వెనక్కిపోయాయనీ, రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టారని వివరించారు. వైసీపీ ప్రభుత్వం చేతకానితనంతో రాష్ట్రానికి ఎనలేని కీడు జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పంచాయతీ ఎన్నికల లోపు సమర్థవంతమైన గ్రామ కమిటీలు అన్ని చోట్లా ఏర్పడాలని చంద్రబాబు టీడీపీ నేతలకు సూచించారు. పార్టీ సంస్థాగత నిర్మాణంపై ప్రతి శుక్రవారం సమీక్షిస్తామన్నారు. ప్రతి నియోజకవర్గంలో 13 అనుబంధ సంఘాల కమిటీలు వేయాలని చెప్పారు. 35 ఏళ్లలోపు యువతకే 33 శాతం పదవులు ఇవ్వాలని, మహిళలకు పార్టీలో మూడో వంతు పదవులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 శాతం పదవులు ఇవ్వాలని నిర్దేశించారు. వ్యక్తిగత పనితీరుతో ఫలితాలు అంతంతమాత్రమేననీ, సమష్టిగా పని చేస్తే మరింత ప్రభావశీలకంగా ఉంటుందని తెలిపారు. క్షేత్రస్థాయి కార్యకర్తల్లో ఉత్సాహం మెండుగా ఉందని, వాళ్ల ఉత్సాహమే పార్టీకి ఎనలేని బలమని పేర్కొన్నారు.

## 6న టీడీపీ జాతీయ కార్యాలయం ప్రారంభం

అమరావతి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): విజయవాడ-గుంటూరు హైవేపై మంగళగిరి సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయాన్ని డిసెంబరు ఆరో తేదీన ప్రారంభించనున్నారు. ఈ ముహూర్తాన్ని ఆ పార్టీ అధికారికంగా ఖరారు చేసింది. ఈ కార్యక్రమానికి రావాల్సిందిగా పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పేరుతో ఆహ్వాన పత్రికలు ముద్రించారు. ఆరో తేదీ శుక్రవారం ఉదయం 10:03 నిమిషాలకు దీనిని ప్రారంభించాలని నిర్ణయించారు. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీకి ఇంతవరకూ పూర్తిస్థాయి కార్యాలయం లేదు. గుంటూరులోని జిల్లా కార్యాలయాన్ని కొంత విస్తరించి ఇంతకాలం రాష్ట్ర కార్యాలయంగా వాడుతూ వస్తున్నారు. అయితే కొంతకాలం క్రితం అధికారికంగా స్థలం కేటాయించడంతో అక్కడ నిర్మాణం మొదలు పెట్టారు. మొత్తం మూడు భవనాలుగా దీనిని నిర్మించాలని తలపెట్టారు. ప్రస్తుతం ఒక భవనం పూర్తి చేసి అక్కడ నుంచి కార్యాలయాన్ని ప్రారంభించాలని, వీలు చూసుకుని మిగిలిన రెండు భవనాలు పూర్తి చేయాలని నిర్ణయించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఎక్కువ సమయం ఈ కార్యాలయంలోనే ఉంటుండటంతో దీనినే పార్టీ జాతీయ కార్యాలయంగా ఖరారు చేశారు. ప్రారంభోత్సవ సమయానికి ఎక్కువ భాగం పనులు పూర్తి కావాలన్న తపనతో శరవేగంగా వాటిని జరిపిస్తున్నారు.

### ఇదీ ఆహ్వానం

ఆహ్వాన పత్రికలో చంద్రబాబు పేరుతో ఒక చిన్న లేఖ కూడా ముద్రించారు. 'తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరికీ నమస్కారం. గుంటూరు జిల్లా మంగళగిరి మండల పరిధిలో జాతీయ రహదారిని ఆనుకొని సీకే కన్వెన్షన్ సెంటర్ పక్కనే మన పార్టీ జాతీయ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ పూర్తయింది. స్వస్తిశ్రీ చాంద్రమాన వికారి నామ సంవత్సరం మార్గశిర శుక్ల దశమి ఉత్తరాభాద్ర నక్షత్ర మకర లగ్న పుష్కరాంశంలో ఆరో తేదీ ఉదయం 10. 03 నిమిషాలకు కార్యాలయం ప్రారంభోత్సవానికి పండితులు శుభ ముహూర్తంగా నిర్ణయించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానుల మధ్య అంగరంగ వైభవంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా హాజరై ఈ శుభ సందర్భంలో పాలు పంచుకోవాలని నా ప్రేమపూర్వక ఆహ్వానం' అని ఆయన ఈ లేఖలో పేర్కొన్నారు.

## సీఎం, డీజీపీ చేతుల్లో ప్రజాస్వామ్యం ఖూనీ

- మంత్రుల తీరు, భాష అభ్యంతరకరం.. వైసీపీ తొత్తుగా పోలీస్ బాస్
- గవర్నర్ జోక్యం చేసుకోవాలి... విచారణకు ఆదేశించాలి: కళా, అయ్యన్న

నర్సీపట్నం టౌన్, నవంబరు 30: "అమరావతిలో పర్యటిస్తున్న ప్రతిపక్ష నేత చంద్రబాబు కాన్వాయ్‌పై మంత్రులే రౌడీలతో చెప్పులు, రాళ్లు వేయించారు. ఇది చాలా బాధాకరం, దురదృష్టకరం. సీఎం జగన్, డీజీపీ కలిసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయించారు. రాష్ట్ర మంత్రులు బొత్స సత్యనారాయణ, కొడాలి నాని మాట్లాడే తీరు, భాష అభ్యంతకరంగా ఉంటున్నాయి" అని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. శనివారం నర్సీపట్నంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. బొత్స రాజధానిని శ్మశానంతో పోలిస్తే, పందులు, కుక్కలు తీరుగుతున్నాయని నాని వ్యాఖ్యానిస్తున్నారన్నారు. అక్కడ నుంచే పరిపాలన అందిస్తున్నారన్న విషయం మరిచిపోకూడదని అయ్యన్న అన్నారు. బుర్ర, జ్ఞానం వున్నవారు ఆ విధంగా మాట్లాడరని విమర్శించారు. లా అండ్ ఆర్డర్‌ను కాపాడడంలో డీజీపీ విఫలమయ్యారని విమర్శించారు. జడ్ కేటగిరీ భద్రత కలిగిన ప్రతిపక్ష నేతపై చెప్పులు, రాళ్లతో దాడి జరుగుతుంటే డీజీపీ ఏం చేశారని ప్రశ్నించారు. వైసీపీ తొత్తుగా ఆయన వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగానికి రాజీనామా చేసి వైసీపీ తరఫున పోటీ చేయాలని సూచించారు. ఘటనపై పోలీసులు ఇంతవరకూ ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. చంద్రబాబు హయాంలో పదోన్నతి ఇవ్వలేదని డీజీపీ కక్ష పెట్టుకున్నట్టు కనిపిస్తోందని అన్నారు. డీజీపీ మీద, రాష్ట్ర ప్రభుత్వం మీద నమ్మకం లేదని, జరిగిన సంఘటనపై గవర్నర్ కలుగు జేసుకొని విచారణ చేయించాలని అయ్యన్న డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వేల కోట్ల రూపాయల సంక్షేమ పథకాలు ప్రకటించుకుంటూ పోతున్నారని, వీటికి డబ్బులు ఎక్కడ నుంచి వస్తున్నాయో ఆర్థిక మంత్రి చెప్పాలని అయ్యన్న అన్నారు. 'రాష్ట్ర ఆదాయం ఎంత? ఖజానాలో ఎంత డబ్బు ఉంది? సంక్షేమ పథకాలకు ఎంత ఖర్చు చేస్తున్నారు?' తదితర అంశాలపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు.

### హోం కార్యదర్శికి 'కళా' లేఖ

రాష్ట్రంలో అధికార పార్టీ ఆదేశాలతో పోలీస్ శాఖ తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలని భగ్నం చేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కళా వెంకట్రావు ఆరోపించారు. టీడీపీ కార్యక్రమాలకు ఆటంకం కలిగించడం, జాతీయ అధ్యక్షులు చంద్రబాబుపై అమరావతిలో జరిగిన దాడి... తదితర అంశాలను వివరిస్తూ శనివారం హోం శాఖ ముఖ్య కార్యదర్శికి ఆయన లేఖ రాశారు. వైసీపీ నాయకుల ఒత్తిడితో టీడీపీ కార్యకర్తలు, నాయకులపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారని పేర్కొన్నారు. వరుస సంఘటనలను తన లేఖలో ప్రస్తావించిన కళా... వాటన్నింటిపైనా వెంటనే విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులకు భంగం కలిగించిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## రౌడీల రాజ్యంగా రాష్ట్రం

- కాంగ్రెస్ ముందే చెప్పింది: తులసిరెడ్డి

అమరావతి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): "రాష్ట్రం రౌడీల రాజ్యంగా మారింది. వైసీపీ అధికారంలోకి వస్తే రాష్ట్రం రాక్షస, ఆటవిక రాజ్యమవుతుందని, పూటకో రౌడీ, పేటకో రౌడీ తయారవుతారని ఎన్నికల ముందు, ఎన్నికల సమయంలోనూ ప్రజలకు చిలకకు చెప్పినట్లుగా కాంగ్రెస్ చెప్పింది. నేడు అదే నిజమైంది" అని ఏపీసీసీ ఉపాధ్యక్షుడు నర్రెడ్డి తులసిరెడ్డి వ్యాఖ్యానించారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్రకాశం జిల్లా రుద్రమాంబపురానికి చెందిన పద్మ అనే మత్స్యకార మహిళను నడివీధిలో వివస్త్రగా చేసి కొట్టారన్నారు. ఆ మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నదని తులసిరెడ్డి తెలిపారు. అనంతపురం జిల్లా మైలసముద్రంలో కిలారి రాముడు, మంగమ్మలకు చెందిన 18 ఎకరాలలో 5400 దానిమ్మచెట్లను నరికివేశారన్నారు. గుంటూరు జిల్లా ఆత్మకూరు, పిన్నెల్లి గ్రామాలలో గ్రామ బహిష్కరణ చేశారని అన్నారు. కడప జిల్లా చక్రాయిపేట మండలంలో ప్రత్యర్థుల ఇళ్లను కూల్చేశారన్నారు. చివరికి అమరావతి పర్యటనకు వచ్చిన ప్రతిపక్ష నాయకుడి వాహనంపై చెప్పులూ, రాళ్లూ వేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు మంత్రులు బజారు రౌడీల్లా ప్రవర్తిండం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలోని పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం పెట్టకముందే వైసీపీ కార్యాలయంలో బూతుల కోర్సులు ప్రవేశపెట్టినట్లుందన్నారు. రౌడీ రాజ్యం ఎల్లకాలం సాగదన్నారు. రౌడీలూ, నియంతలూ పారిపోక తప్పదన్నారు. ఇప్పటికైనా రౌడీలనూ బూతురాయుళ్లను అదుపులో పెట్టాలని సీఎం జగన్‌కు విజ్ఞప్తి చేశారు.

# మంచి సీఎం కాదు.. ముంచే సీఎం



చార్జిషీట్‌ను ఆవిష్కరిస్తున్న యనమల, అనురాధ, బచ్చుల అర్జునుడు, బోడె ప్రసాద్ తదితరులు

## 6నెలల పాలనపై టీడీపీ చార్జిషీట్

అమరావతి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): "ఏదైనా పనిని శుభకార్యంతో చేపడతాం. కానీ ప్రజావేదిక కూల్చివేయడం ద్వారా విధ్వంసక పాలనకు జగన్ శ్రీకారం చుట్టారు. పేదల ఇళ్ల కూల్చివేతలు, ఆస్తుల విధ్వంసం, పథకాల రద్దులు, చిరుద్యోగుల తొలగింపులు, హత్యలు, ఆత్మహత్యలతో రాష్ట్రాన్ని అశాంతికి, అభద్రతకు నిలయంగా మార్చారు" అని తెలుగుదేశం పార్టీ విమర్శించింది. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆరు నెలల పాలనపై ఆ పార్టీ శనివారం 24 పేజీల చార్జిషీట్ విడుదల చేసింది. ఆ పార్టీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు, పార్టీ నేతలు పంచుమర్తి అనురాధ, బచ్చుల అర్జునుడు, బోడె ప్రసాద్ తదితరులతో కలిసి విజయవాడలో దానిని ఆవిష్కరించారు. 'మంచి సీఎం కాదు... జనాన్ని ముంచే సీఎం' పేరుతో రూపొందించిన ఈ చార్జిషీట్‌లో జగన్ ప్రభుత్వ ఆరు నెలల పాలనపై ఆ పార్టీ తీవ్రస్థాయిలో విమర్శలు కురిపించింది. ఆరు నెలల్లో ఇచ్చినవాటి కన్నా రద్దు చేసిన పథకాలే ఎక్కువని, ప్రభుత్వ భవనాలకు వైసీపీ రంగులు వేయడానికి రూ.1,300 కోట్లు దుబారా చేశారని ఇందులో విమర్శించారు. "ముడుపుల కోసమే పోలవరం ప్రాజెక్టు, రాజధాని అమరావతి, సాగునీటి ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణ పనులన్నీ నిలిపివేశారు. అమరావతిలో రూ. రెండు లక్షల కోట్ల విలువైన సంపద సృష్టికి టీడీపీ ప్రభుత్వం చేసిన కృషిని పూర్తిగా రివర్స్ చేశారు. అమరావతి, పోలవరం అనే రెండు కళ్లను పొడిచేశారు. ఇసుక కృత్రిమ కొరత సృష్టించి రేట్లు పెంచి భవన నిర్మాణ రంగాన్ని కుప్పకూల్చారు. అరవై మందికిపైగా కార్మికులు ఆత్మహత్య చేసుకొన్నారు. మద్యం రేట్లు పెంచి పేదల ఇళ్లు గుల్ల చేస్తున్నారు. జే ట్యాక్స్ వేసి కోట్లు దోచుకొంటున్నారు' అని విమర్శించింది.

### దత్తుడు ఇలా..పుత్రుడు అలా..

వడ్డించిన విస్తరి లాంటి రాష్ట్రాన్ని వైసీపీ చేతికి అందిస్తే ఆరు నెలల్లో దానిని కుక్కలు చింపిన విస్తరి చేశారని టీడీపీ వ్యాఖ్యానించింది. హింసా విధ్వంసాలు, కక్షపూరిత రాజకీయ వైఖరి వల్ల రాష్ట్రానికి రావాల్సిన రూ.1.80 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు వెనక్కు వెళ్లిపోయాయని, కేసీఆర్ దత్తపుత్రుడు జగన్ పెట్టుబడులను వెళ్లగొడుతుంటే సొంత పుత్రుడు కేటీఆర్ తెలంగాణలో వాటికి స్వాగతం పలుకుతున్నారని ఆ పార్టీ పేర్కొంది. 'అన్న క్యాంటీన్ల రద్దు ద్వారా రోజుకు మూడు లక్షల మంది పేదల పొట్టగొట్టారు. రంజాన్ తోఫా, సంక్రాంతి కానుక, క్రిస్టమస్ గిఫ్ట్ రద్దు చేశారు. ఇమామ్ మౌజన్‌లకు ఐదు నెలలుగా వేతనాలు నిలిపివేశారు. రెండు లక్షల మంది ఎస్టీలకు ఫుడ్ బాస్కెట్ రద్దు చేశారు. నిరుద్యోగభృతి రద్దు చేసి ఏడాదికి రూ. పదిహేను వందల కోట్ల విలువైన లబ్ధికి దూరం చేశారు. రైతు రుణ మాఫీ రద్దు చేసి ఒక్కో రైతుకు రూ.నలభై వేలు ఎగనామం పెట్టారు. ఐదు శాతం కాపు రిజర్వేషన్లు రద్దుతోపాటు విదేశీ విద్య, కాపు భవనాల నిర్మాణం, కాపు కార్పొరేషన్ రుణాలు రద్దు చేశారు. ఎస్సీ కార్పొరేషన్, సీఎంఆర్ఎఫ్ చెక్కులు, రైతు రథం, బీసీల ఆదరణ పథకం, దేవాలయాల సందర్శనకు చెందిన దివ్య దర్శనం పథకం రద్దు చేశారు. చంద్రన్న బీమా పథకం నిలిపివేసి అసంఘటిత రంగ కార్మికులను రోడ్డున పడేశారు' అని చార్జిషీట్ విమర్శించింది.

| మాట ఇచ్చారు | మడమ తిప్పారు |
|---|---|
| కేంద్రం మెడలు వంచి రాష్ట్రానికి ప్రత్యేక హోదా | జగన్ ప్రభుత్వం ఒక్కసారి కూడా హోదా గురించి అడగలేదన్న కేంద్రం |
| పింఛను నెలకు రూ. మూడు వేలు చేస్తాం | ఇస్తుంది రూ.2,250 |
| కుటుంబంలోని పిల్లలందరికీ అమ్మ ఒడి పథకం | ఎందరు పిల్లలున్నా కుటుంబంలోని తల్లికి మాత్రమే వర్తింపు |
| రైతుభరోసా కింద రూ.13,500 | రూ.7,500కు కుదింపు |
| సెప్టెంబరు నుంచి సన్న బియ్యం | నాణ్యమైన బియ్యం పేరిట ముక్కినవి సరఫరా |
| అగ్రిగోల్డ్ బాధితులకు ఒకే దఫా రూ.1,160 | ఇచ్చింది రూ. 264 కోట్లే |
| ఆలయ కమిటీల్లో బడుగులను 80 శాతంమేర నియమిస్తాం | టీటీడీలోని 36మందిలో తొమ్మిది మందే ఎస్సీ,ఎస్టీ, బీసీలు |
| ఫిరాయిస్తే ఎమ్మెల్యే రాజీనామా చేయాల్సిందే | ఇప్పటికీ రాజీనామా చేయని వంశీ |
| బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.వెయ్యికోట్లు | ఇచ్చింది రూ.వంద కోట్లే |
| ప్రతిపక్షానికి సభలో స్వేచ్ఛ, తగినంత సమయం | తొలి సమావేశాల్లోనే ఏడుగురి సస్పెన్షన్ |

### 1-తప్పు..టడుగు

ఆరు నెలల్లోనే అవినీతికి గేట్లెత్తేశారు. సిమెంట్ కంపెనీల నుంచి రూ.రెండున్నర వేల కోట్లు జే ట్యాక్స్ కింద వసూలు చేశారు. లారీ ఇసుక రూ. పది వేల నుంచి రూ. ఏభై వేలకు పెంచారు. పెరిగిన ఆ మొత్తం వైసీపీ నేతల జేబుల్లోకి పోతోంది.

### 2-తప్పు..టడుగు

గ్రామ వలంటీర్ పోస్టులను అయినకాడికి అమ్ముకొన్నారు. ప్రశ్నాపత్రం లీక్ చేసి లక్షల్లో లంచాలు కొట్టేశారు. ఎర్ర చందనం అక్రమ రవాణా పెరిగింది. బిల్డ్ ఏపీ పేరిట ప్రభుత్వ భూములను కారు చౌకగా కొట్టేసే కుట్ర జరుగుతోంది.

### 3-తప్పు..టడుగు

చిరుద్యోగులపై వేధింపులు విపరీతంగా పెరిగిపోయాయి. వారు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడే పరిస్థితులు వచ్చాయి. ఆరోగ్య కార్యకర్తలు, వెలుగు యానిమేటర్లు, ఏవోఏలు, బీమా మిత్రలు, ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు, కల్యాణ మిత్రలు, ఎంపీఏఈవోలు, మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు, విద్యుత్ కార్మికులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగిస్తున్నారు. చిరుద్యోగులను తొలగించి వారి స్థానంలో వైసీపీ కార్యకర్తలను నియమించి ఏడాదికి రూ.ఏడున్నర వేల కోట్ల ప్రజా ధనం వారికి దోచిపెడుతున్నారు.

### 4-తప్పు..టడుగు

వైసీపీ నేతల బెదిరింపులతో పారిశ్రామికవేత్తలు పరారవుతున్నారు. సింగపూర్ స్టార్టప్ ప్రాజెక్టులు (50 వేల కోట్లు), బీఆర్ శెట్టి సంస్థలు (12 వేల కోట్లు), రేణిగుంటలో రిలయన్స్ (15 వేల కోట్లు), కియా అనుబంధ పరిశ్రమలు (2 వేల కోట్లు), ఒంగోలులో ఏపీపీ పేపర్ పరిశ్రమ (24 వేల కోట్లు), విశాఖలో అదానీ డేటా సెంటర్ (70 వేల కోట్లు) వెనక్కు వెళ్లిపోవడమో.. పెట్టుబడులను కుదించుకోవడమో చేశాయి. ప్రపంచబ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ రూ. మూడున్నర వేల కోట్ల రుణం నుంచి వెనక్కు వెళ్లిపోయాయి. పీపీఏల వ్యవహారం అంతర్జాతీయంగా రాష్ట్రానికి చెడ్డ పేరు తెచ్చింది.

### 5-తప్పు..టడుగు

టీవీ చానళ్లను నిషేధించి టీడీ శాట్‌తో జరిమానా వేయించుకొన్నారు. మీడియా నోరు మూయించడానికి ప్రత్యేక జీవోలు తెచ్చారు.

### 6-తప్పు..టడుగు

కేంద్రం నుంచి పోలవరం నిధులు రాబట్టడంలో విఫలమయ్యారు. హైదరాబాద్‌లో ఏపీ ఆస్తులు 38 వేల కోట్లు తెలంగాణకు ధారాదత్తం చేశారు. బందరు పోర్టు టెండర్ రద్దు చేశారు. ఆలయాల్లో అన్యమత ప్రచారం పెరిగిపోయింది. వేధింపులతో కోడెల ఆత్మహత్య చేసుకొనే పరిస్థితి తెచ్చారు.

## ఆదాయం దెబ్బతీస్తే అభివృద్ధి ఎలా?

- ఏడాదిలోపే 3రెట్ల అప్పులా?: యనమల

అమరావతి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): "రాష్ట్రాన్ని అప్పులపాలు చేశామని వైసీపీ నేతలు మాపై పదేపదే విమర్శలు చేశారు. కానీ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే మాతో పోలిస్తే మూడు రెట్లు ఎక్కువ అప్పులు తేవడానికి ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రాన్ని అంధకారమయం చేస్తున్నారు" అని మాజీ ఆర్థిక మంత్రి, టీడీపీ నేత యనమల రామకృష్ణుడు విమర్శించారు. "మేం మా హయాంలో సరాసరిన ఏడాదికి రూ. ఇరవై వేల కోట్ల మేర అప్పులు తెచ్చాం. వైసీపీ ప్రభుత్వం తొలి ఏడాదిలోనే రూ.48 వేల కోట్లు అప్పులు తేవాలని అనుకొంటున్నట్లు బడ్జెట్‌లో పెట్టింది. అదికాక ఇప్పుడు ఇళ్ల స్థలాలకు భూసేకరణ కోసం రూ.14 వేల కోట్లు ఖర్చు చేయాలని అనుకొంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ డబ్బులు కూడా అప్పు చేయాల్సిందే. ఈ రెండూ కలిపితే రూ.62 వేల కోట్లు అప్పు అవుతోంది. మేం అధికారంలోకి వచ్చిన సమయంలో రెవెన్యూ లోటు ఉంది. కేంద్రం అది ఇవ్వలేదు. విభజన కష్టాలు ఉన్నాయి. అయినా మేం రాజధానిని, పోలవరాన్ని, సాగునీటి ప్రాజెక్టులను చేపట్టాం. తెచ్చిన అప్పులతో అభివృద్ధి చేశాం. దాని వల్ల ప్రభుత్వ ఆదాయం పెరిగింది. వీళ్ల ఆదాయం పెరిగే పనులేవీ చేయడం లేదు. పథకాల ప్రకటన తప్ప వాటికి ఎక్కడ నుంచి తెచ్చి ఇస్తారో చెప్పడం లేదు. ఏదీ ఇప్పుడు ఇస్తానని చెప్పకుండా ఆరు నెలల తర్వాత ఇస్తానని ముహూర్తాలు చెబుతున్నారు' అని విమర్శించారు. ఈ ఏడాదిలో రూ.83 వేల కోట్ల ఆదాయం వస్తుందని ఈ ప్రభుత్వం బడ్జెట్‌లో తెలిపిందని, కాని అందులో రూ.21 వేల కోట్ల మేర వచ్చే సూచనలు లేవని ఆర్థిక శాఖ చెబుతోందని అన్నారు. "మేం ఉద్యోగుల జీతాలు ఎప్పుడూ ఆపలేదు. ఈ ప్రభుత్వ హయాంలో నెలల తరబడి ఆలస్యం అవుతున్నాయి. వృద్ధి రేటు మూడు నుంచి నాలుగు శాతం మేర పడిపోయిందని అంటున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అసెంబ్లీకి, ప్రజలకు వివరించాలి. కానీ ఎక్కడా చెప్పడం లేదు. ఆదాయం పెరగాలంటే పరిశ్రమలు, ప్రాజెక్టులు రావాలి. కానీ ఏవీ రావడం లేదు. వచ్చిన వాటిని కూడా వెళ్లగొడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తుండటంతో మళ్లీ పథకాల పేరుతో హడావుడి మొదలుపెట్టారు. ఈ ఎన్నికల తర్వాత ఆ పథకాలు ఏమవుతాయో ఎవరికీ తెలియదు" అని ఆయన అన్నారు.

### అది అర్థం లేని వాదన

అమరావతిలో చంద్రబాబు ఇల్లు ఎందుకు కట్టుకోలేదన్న ప్రశ్న అర్థం లేనిదని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. "మా ప్రాధాన్యం అమరావతి... పోలవరం పూర్తి చేయడం తప్ప చంద్రబాబు ఇల్లు కట్టడం కాదు" ఆయన చెప్పారు.

## రాజధాని ఇక్కడే!

(మొదటి పేజీ తరువాయి)

కృతజ్ఞతలు తెలిపినట్లు పెనుమాక రైతు, టీడీపీ జిల్లా కార్యదర్శి కళ్లం రాజశేఖరరెడ్డి తెలిపారు. రాజధాని అమరావతి అభివృద్ధి, తరలింపుపై మంత్రుల వ్యాఖ్యలు... తదితర అంశాలపై మంత్రికి ఒక విజ్ఞాపన పత్రాన్ని అందించారు. రాజధాని ప్రాంతంలో భూములు ఇచ్చిన రైతులకు ప్లాట్ల కేటాయింపులు జరిగాయని తెలిపారు. వాటిని మాస్టర్ ప్లాన్ ప్రకారం అభివృద్ధి చేసి, రైతులకు అప్పగించేందుకు చొరవ తీసుకోవాలని మంత్రిని కోరారు. రాజధాని అమరావతికి భూములిచ్చిన వారిలో అన్ని వర్గాల ప్రజలు ఉన్నారని రైతులు వివరించారు. రాష్ట్ర మంత్రులు చేస్తున్న ప్రచారాలనూ కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లారు. దీనిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. "రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతుల పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యిలా తయారయింది. రైతులకు విశ్వాసం కల్పించేలా ఏపీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. రైతుల సమస్యలపై నేను రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడతాను. రైతులకు పూర్తి స్థాయిలో సాయం చేస్తాను" అని మంత్రి మీడియా సమావేశంలో ప్రకటించారు. అవసరమైతే ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రంతో మాట్లాడిస్తానని తమకు హామీ ఇచ్చారని రాజశేఖరరెడ్డి తెలిపారు. మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన వారిలో రాజధాని రైతు ప్రతినిధులు లంకా సుధాకర్, ఆలూరి యుగంధర్, ఆలూరి సుబ్రహ్మణ్యం, ఆలూరి కోటేశ్వరరావు, ఉప్పలపాటి సాంబశివరావు, పాలకాయల కోటేశ్వరరావు, లంకా ప్రభాకర్, శ్రీనివాసరావు, బండ్ల పట్టాభిరామయ్య తదితరులు ఉన్నారు.

## ఉగాది తరువాతే పదవులు

(మొదటి పేజీ తరువాయి)

అంతగా శ్రద్ధ చూపడంలేదు. పార్టీ కార్యవర్గం ఏర్పాటు, మండలం, అసెంబ్లీ నియోజకవర్గాలు, జిల్లా స్థాయి కమిటీలు తదితర అంశాలకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదు. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఇదే అంశాన్ని సీఎం ఎదుట మంత్రులు ప్రస్తావించారు. ఆ అభిప్రాయంతో ఏకీభవించిన జగన్ జిల్లాల్లో పార్టీ బలోపేతం కోసం కార్యక్రమాలను నిర్వహించాలని ఇన్‌చార్జి మంత్రులకు సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి వెళ్లేలా పార్టీ శ్రేణులను ఉత్తేజితులను చేయాలని సూచించారు. కొత్త సంవత్సరం ప్రారంభంనుంచే రాజకీయంగా దూకుడును పెంచే యోచనలో జగన్మోహన్‌రెడ్డి ఉన్నారు. అందులో భాగంగానే ముందుగా రిపబ్లిక్ డే నాడు ప్రారంభించాలని భావించిన అమ్మఒడి పథకాన్ని జనవరి 9నే ప్రారంభించడానికి సిద్ధమయ్యారు. ఆ వెంటనే స్థానిక సమరానికి వెళ్లాలని కూడా నిర్ణయించారు. ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ, మునిసిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికలను నిర్వహించిన తర్వాతే పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలన్న ఆలోచన ప్రభుత్వపక్షంలో కనిపిస్తోంది. పార్టీ గుర్తుపై జరిగే ఎన్నికల్లో విజయం సాధిస్తే.. పంచాయితీ ఎన్నికలో విజయం సునాయాసమవుతుందన్నది పార్టీ అధినాయకత్వ భావనలా కనిపిస్తోంది. ఈ లెక్కన చూస్తే... జనవరి నుంచి ఏప్రిల్ వరకూ వరుసగా 'స్థానిక ఎన్నికలు జరుగుతాయి. అవి పూర్తయిన తరువాతే... అంటే ఉగాది తరువాత నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తే క్షేత్రస్థాయిలో వినిపించే అసంతృప్త రాగాలను పట్టించుకోనవసరం లేదనీ, మరో నాలుగేళ్ల పాటు పాలనపై దృష్టి సారించవచ్చని అధిష్ఠానం భావిస్తోందని సమాచారం. ఈ మొత్తం వ్యవహారంపై పార్టీలో జోరుగా చర్చ సాగుతూండడంతో... తొమ్మిదేళ్ల పాటు పార్టీ కోసం శ్రమించి, ఉగాది వరకూ ఆగాల్సిందేనా అంటూ ద్వితీయ శ్రేణి నేతలు నిట్టూరుస్తున్నారు.

# ఎంఎఫ్ పెట్టుబడులకు ఆధార్ ఈ-కేవైసీ




ఏ మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) స్కీమ్‌లో ఇన్వెస్ట్ చేయాలన్నా నో యువర్ కస్టమర్ (కేవైసీ) ధ్రువీకరణ తప్పనిసరి. ఇలాంటి స్కీమ్‌లలోకి సగటు ఇన్వెస్టర్లను ఆకర్షించడం, పెట్టుబడి విధి విధానాలు సరళం చేయడం కోసం సెబీ ఇటీవల ఆధార్ నంబర్ సహాయంతో ఈ-కేవైసీని ధ్రువీకరించుకునే వెసులుబాటు కల్పించింది. ఈ విధానంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థలు కేయూఏగా వ్యవహరిస్తాయి. ఎంఎఫ్ డిస్ట్రిబ్యూటర్లు సబ్ కేయూఏగా వ్యవహరిస్తారు. ఎంఎఫ్‌లలో పెట్టుబడి పెట్టాలనుకునే వారు ఆన్‌లైన్ విధానంలో ఈ లాంఛనాన్ని పూర్తి చేయవచ్చు లేదా డిస్ట్రిబ్యూటర్ సహాయం తీసుకోవచ్చు. దీన్ని ఎలా పూర్తి చేయాలో పరిశీలిద్దాం.

## ఆన్‌లైన్ పోర్టల్ ఇన్వెస్టర్ (రెసిడెంట్)

- ఇన్వెస్టర్ తొలుత కేయూఏ లేదా సెబీ గుర్తింపు గల సబ్ కేయూఏ పోర్టల్‌లోకి వెళ్లి రిజిస్టర్ చేసుకోవాలి.
- పెట్టుబడి పెట్టే సమయంలో ఇన్వెస్టర్ ఆధార్ నంబర్ లేదా వర్చువల్ ఐడీని పొందుపరిచి దాన్ని ఉపయోగించుకునేందుకు కేయూఏకు అధికారం ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా అందించిన ఆధార్ వివరాలు ఎవరూ స్టోర్ చేసుకునే వీలు లేకుండా సెబీ అన్ని జాగ్రత్తలు తీసుకుంది.
- ఇన్వెస్టర్‌కు ఆధార్ వివరాల్లో పొందుపరిచిన మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. దాన్ని ఎంటర్ చేయాలి.
- అలా ఓటీపీ ఎంటర్ చేయగానే అతని ఇ-కేవైసీ వివరాలన్నీ కేయూఏకు అందుతాయి. ఆ వివరాలను కేయూఏ తన సబ్ కేయూఏకు బదిలీ చేస్తుంది. - అప్పుడు కేవీసీ ఫార్మాట్‌లో అదనపు వివరాలు కనిపిస్తాయి.
- వెంటనే సెబీ రిజిస్ట్రేషన్ గల ఇంటర్మీడియేటరీ అదనపు కేవైసీ వివరాలను కేయూఏకు అందిస్తుంది. అక్కడితో కేవైసీ ధ్రువీకరణ ప్రక్రియ పూర్తవుతుంది.

## అసిస్టెడ్ ఇన్వెస్టర్ (రెసిడెంట్)

ఈ విధానంలో ఇన్వెస్టర్ సెబీ గుర్తింపు పొందిన సంస్థ లేదా సబ్ కేయూఏ సహాయం కోరవచ్చు. వారు ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తి చేస్తారు. సబ్ కేయూఏలు, వారి డివైస్‌లు సెబీ వద్ద రిజిస్టర్ అయి ఉండాలి. ఇన్వెస్టర్ తన ఆధార్ నంబర్, వర్చువల్ ఐడీ ఆ డివైస్‌ల మీద టైప్ చేసి ఆ డివైస్ ద్వారా ఆధార్ వెరిఫికేషన్‌కు అధికారం ఇవ్వాలి. ఆ తర్వాత ఇన్వెస్టర్ తన బయోమెట్రిక్ కూడా ఆ రిజిస్టర్డ్ డివైస్‌పై నమోదు చేయాల్సి ఉంటుంది. దాంతో ఈ-కేవైసీ పూర్తవుతుంది.

### 30న ఫారం గేటు అమ్మకం ధరలు

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 5.00 — నెక్ (100 గుడ్లు) 1వ తేదీకి..



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 441 | విశాఖపట్నం | 455 |
| బెంగళూరు | 463 | వరంగల్ | 444 |
| విజయవాడ | 455 | చెన్నై | 473 |
| గోదావరి | 455 | చిత్తూరు | 466 |
| నమక్కల్ | 431 | ముంబై | 496 |

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 94 | విజయవాడ | 96 |
| వరంగల్ | 94 | గుంటూరు | 98 |
| మహబూబ్‌నగర్ | 94 | ఒంగోలు | 98 |
| కరీంనగర్ | 94 | చిత్తూరు | 89 |
| కర్నూలు | 94 | నెల్లూరు | 89 |
| విశాఖపట్నం | 87 | అనంతపురం | 88 |
| గోదావరి | 93 | | |

## డాక్టర్ రెడ్డీస్‌లో డీఆర్‌హెచ్‌ఎల్ విలీనం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ (డీఆర్‌ఎల్)లో డాక్టర్ రెడ్డీస్ హోల్డింగ్స్ (డీఆర్‌హెచ్‌ఎల్)ను విలీనం చేయనున్నారు. ఎన్‌సీఎల్‌టీ, హైదరాబాద్ బెంచ్ ఆదేశాల మేరకు విలీన ప్రతిపాదనకు రెండు కంపెనీల వాటాదారుల అనుమతి తీసుకోనున్నారు. ఇందు కోసం జనవరి 2న వాటాదారుల సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది. షేర్ హోల్డింగ్ స్ట్రక్చర్‌ను సరళీకరించే ఉద్దేశంతో రెండు కంపెనీలను విలీనం చేస్తున్నారు. దీని వల్ల డీఆర్‌హెచ్‌ఎల్, డీఆర్‌ఎల్‌కు కానీ.. డాక్టర్ రెడ్డీస్ వాటాదారులకు కానీ ఎటువంటి నష్టం ఉండదని కంపెనీ తెలిపింది. రుణదాతలు, వాటాదారుల అనుమతి మేరకు విలీనం అమలులోకి వస్తుంది.

# ప్రీమియం ప్రియమైనా... ప్రయోజనాలెన్నో..



## నేటి నుంచి ఐఆర్‌డీఏఐ కొత్త మార్గదర్శకాలు అమల్లోకి

బీమా నియంత్రణ సంస్థ.. జీవిత బీమా పాలసీదారులకు మరింత లాభం చేకూర్చే రీతిలో కొద్ది కాలం క్రితం మార్గదర్శకాలు జారీ చేసింది. అవి ఆదివారం (డిసెంబరు 1) నుంచి అమలులోకి రానున్నాయి. ఈ మార్గదర్శకాలకు అనుగుణంగా జీవిత బీమా రంగంలోని కంపెనీలు తమ పాలసీల్లో మార్పులు చేయాల్సిరావడంతో ప్రీమియంలు పెరగనున్నాయి. అలాగే బీమా పాలసీలు అందించే ప్రయోజనాలు ఏమిటో తెలియచేసే సమాచారం సైతం సవివరంగా అందించాల్సి ఉంటుంది. ఈ మార్గదర్శకాలకు కట్టుబడని పాలసీలు ఆదివారం నుంచి ఉపసంహరించక తప్పదు. ఈ మార్పుల వల్ల ప్రీమియంలు పెరిగి గ్యారంటీగా అందే సొమ్ము పరిమాణం తగ్గుతుందనే దుష్ప్రచారం ఒకటి బీమా ఏజెంట్లు, వారి అనుయాయులు వ్యాపింపచేశారు. కాని ప్రీమియంలో పెరుగుదల మరీ అంత ఎక్కువేమీ ఉండదని, పాలసీదారులు అందుకుంటున్న అదనపు ఫీచర్లు, ప్రయోజనాలతో పోల్చితే ఈ పెరుగుదల అతి స్వల్పమేనని నిపుణులు అంటున్నారు.

**జీవిత బీమా పాలసీదారులకు మరిన్ని ప్రయోజనాలు కల్పించడమే లక్ష్యంగా బీమా నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) ప్రకటించిన కొత్త మార్గదర్శకాలు నేటి (ఆదివారం) నుంచి అమల్లోకి వస్తున్నాయి. ప్రధానంగా యులిప్‌లలో ఇన్వెస్ట్ చేసే వారికి మరిన్ని ప్రయోజనాలు కలగనున్నాయి. కొత్తగా బీమా పాలసీల్లో వచ్చే మార్పులేంటి, అవి పాలసీదారులకు ఎలాంటి ప్రయోజనాలు కలిగిస్తున్నాయనే వివరాలు మీ కోసం..**

### పాలసీల్లో వస్తున్న మార్పులివే..

- ఈ మార్పుల వల్ల పెన్షన్ ప్లాన్లలో ఇన్వెస్ట్ చేసిన వారు మెచ్యూరిటీ సమయంలో అందులో అప్పటివరకు ఉన్న కార్పస్‌లో 60 శాతం విత్‌డ్రా చేసుకోవచ్చు. ఇప్పటివరకు ఈ పరిమితి 33 శాతమే ఉంది. అంటే మెచ్యూరిటీ సమయంలో ఏకమొత్తంగా అందుకునే సొమ్ము సుమారు రెట్టింపు చేశారు. కాని 33 శాతానికి పైబడి విత్‌డ్రా చేసుకున్న సొమ్ముపై ఆదాయపు పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

- కొత్త పెన్షన్ నిబంధనల ప్రకారం యులిప్‌లపై (యూనిట్ అనుసంధానిత బీమా ప్లాన్లు) బీమా కంపెనీలు రాబడుల గ్యారంటీ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నిబంధన కారణంగా బీమా కంపెనీలు రిస్క్ తగ్గించుకునే లక్ష్యంతో డెట్ ఉపకరణాల్లో ఇన్వెస్ట్ చేయవచ్చు. దాని వల్ల పాలసీలో జమ అయ్యే కార్పస్ కొంత తగ్గవచ్చు. అందుకే ఇది నిర్బంధం కాదు. యులిప్‌ల విషయంలో గ్యారంటీ రాబడులు పొందాలా, వద్దా ఆప్షన్ ఎంచుకునే స్వేచ్ఛ పాలసీదారునికే ఇచ్చారు. ఆ ఆప్షన్ వద్దన్న వారు మార్కెట్ రిస్క్‌లకు లోబడి అధిక రాబడులు పొందవచ్చు. చిన్న వయసులోనే పెన్షన్ ప్లాన్లలో ఇన్వెస్ట్ చేసే వారికి రిస్క్ భరించగల సామర్థ్యం ఎక్కువగా ఉంటుంది గనుక వారు అధిక మొత్తం ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసే ఆప్షన్ ఎంచుకోవచ్చు. పెద్ద వయసులో పెన్షన్ ప్లాన్ తీసుకునే వారు మాత్రం రుణ పత్రాల్లో అధిక మొత్తం ఇన్వెస్ట్ చేసే ఆప్షన్ ఎంచుకోవడం మంచిది.

- పెన్షన్ ప్లాన్‌లో మిగిలి ఉండే కార్పస్‌ను నెలవారీ పింఛను కోసం ఏ బీమా కంపెనీలో ఇన్వెస్ట్ చేయాలో ఎంచుకునే స్వేచ్ఛ పాలసీదారుకు ఉంటుంది. అంటే తమకు పాలసీ ఇచ్చిన కంపెనీని కాకుండా మంచి రాబడులకు హామీ ఇచ్చే వేరే కంపెనీ ఎందులోనైనా ఆ సొమ్ము ఇన్వెస్ట్ చేసి యాన్యుటీ కొనుగోలు చేసుకోవచ్చు. ఇలాంటి సమయంలో వారు పెన్షన్ ప్లాన్‌లో మిగిలి ఉన్న కార్పస్‌లో 50 శాతం వేరే కంపెనీలో యాన్యుటీ కొనుగోలుకు చేసేందుకు ఉపయోగించుకుని మిగతా సొమ్మును తమకు పాలసీ అందించిన కంపెనీ వద్ద కూడా ఉంచుకోవచ్చు.

- పదేళ్లు, ఆ పైబడి కాలపరిమితి ఉన్న పాలసీలు తీసుకున్న వారు రెండు పూర్తి సంవత్సరాలు ప్రీమియంలు చెల్లించిన అనంతరం పాలసీ రద్దు చేసుకుని సరెండర్ విలువను పొందవచ్చు. ఇప్పటి వరకు ఈ గడువు మూడేళ్లుంది. ఏ కారణం చేతనైనా మెచ్యూరిటీ గడువు కన్నా ముందుగానే పాలసీని రద్దు చేసుకోవాలని నిర్ణయించుకున్నట్టయితే అప్పటివరకు వారు చెల్లించిన ప్రీమియం నుంచి బీమా కంపెనీ పాలసీదారులకు చెల్లించే మొత్తాన్నే సరెండర్ విలువగా వ్యవహరిస్తారు. పాత పాలసీలకు సరెండర్ విలువను చెల్లించిన ప్రీమియంలో 30 శాతం నుంచి స్వల్ప పరిమాణంలో 35 శాతానికి పెంచారు. ముందస్తుగా పాలసీని రద్దు చేసుకుని సొమ్ము తీసుకోవాలనుకుంటే దానికి భారీ పెనాల్టీలుండడం వల్ల వాటితో పోల్చితే కొత్త పాలసీలే మెరుగైనవి. ఏడేళ్లకు పైబడిన కాలపరిమితి పాలసీలకు మెచ్యూరిటీ సమయం దగ్గర పడుతున్న కొద్ది సరెండర్ విలువను 90 శాతం వరకు ఉండాలని నిర్దేశించారు.

- పింఛను ఫండ్లలో ఇన్వెస్ట్ చేసిన వారు గడువు కన్నా ముందుగానే సొమ్ము తీసుకోవలసిన అత్యవసర పరిస్థితి ఏర్పడితే పాక్షిక విత్‌డ్రాయల్‌కు కూడా అనుమతిస్తారు. అయితే కనీసం ఐదేళ్లపాటు వారు పెట్టుబడి పెట్టి ఉండాలి. పిల్లల ఉన్నత విద్య కోసం లేదా తీవ్ర అనారోగ్యాల బారిన పడిన సమయాల్లో ఆ సొమ్ము నుంచి 25 శాతం వెనక్కి తీసుకునేందుకు కొత్త నిబంధనలు అనుమతిస్తున్నాయి.

- ఒక్కోసారి అనుకోకుండా ఆర్థిక స్థితిగతులు తలకిందులు కావచ్చు. అలాంటి సమయంలో వ్యయ నియంత్రణకు మొదటిగా గుర్తొచ్చేవి బీమా పాలసీలే. దీని వల్ల దీర్ఘకాలిక బీమా ప్రయోజనం నష్టపోయే పరిస్థితిని నివారించేందుకు పాలసీదారులు తమ ప్రీమియంను 50 శాతానికి కుదించుకుని పాలసీ కొనసాగించే అవకాశం కూడా కల్పించారు. అంటే ఆర్థికంగా ఇబ్బందులెదురైన సందర్భంలో పాలసీదారుల ప్రీమియం చెల్లింపు భారం సగానికి సగం తగ్గుతుంది. ఇలాంటి సందర్భాలు ఎదురైనప్పుడు ప్రీమియంలు చెల్లించలేక పాలసీ రద్దయ్యే పరిస్థితి ఏర్పడితే చెల్లింపులు నిలిపివేసిన నాటి నుంచి 2 నుంచి 5 సంవత్సరాల లోపు పాలసీ పునరుద్ధరించుకునే వీలుండేది. ఆ పరిస్థితి కూడా తలెత్తకుండా ఈ కొత్త నిబంధన పాలసీదారులకు అండగా ఉంటుంది.

- యులిప్‌లు 45 ఏళ్లలోపు వయస్కులకు అందించే కనీస బీమా కవరేజీని 7 రెట్లకు కుదించారు. ఇప్పటివరకు ఇది 10 రెట్లుంది. యులిప్‌ల కింద జీవిత బీమా కవరేజీ మోర్టాలిటీ చార్జీలతో కలిపి ఉంటుంది గనుక కవరేజీని తగ్గించడం ద్వారా చెల్లించిన ప్రీమియంలో అధిక భాగం పెట్టుబడి ప్రయోజనాలకు తరలించి మెచ్యూరిటీలో మెరుగైన రాబడులు పొందడానికి వీలుంటుంది.


# ఆంధ్రజ్యోతి తలంబ్రాలు

## వధువు కావలెను



★ విశ్వబ్రాహ్మణ్ / B.Tech / C.Govt. Asst. మేనేజర్ / యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా / 80,000/- P.M. / 5'10" ఎత్తు, 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ఫోన్ : 8008939651 AJH-595

★ Ayra Vysya, Telugu, 38/180, MNC - Ahmedabad, 1.10L / PM, Prop. in Chennai, CNB, Ph: 7567993556 AJH-5783

★ యాదవ, 62, రిటైర్డ్ ఉద్యోగి, రిటైర్డ్ ఎంప్లాయిస్ 55 సం॥లు వయస్సు పైబడినవారు వెల్‌సెటిల్డ్ వధువు కావలెను. నో బ్రోకర్స్. సంప్ర॥ సెల్: 94919 25338 AJB-543500

★ యాదవ/ కురుమ 30/ MBBS/ 5.6/ 50 Cr ఆస్థి విశాఖ, 30/ B.tech/ MS/ 5.8/ 30Lakhs PA Guntur, 28/ MS, USA/ H1B Hyd వరునికి K.K. Yadav. Ph : 9849306274 AJG-579801

★ ఆర్యవైశ్య అమ్మాయి కావలెను. ఆర్యవైశ్య అబ్బాయి 30, 5:6, M.Sc, M.Ed, పార్ట్‌టైమ్ లెక్చరర్ 16+16+16=48వేలు 50లక్షల ఆస్తి, ఎరుపు, నల్లగొండ. సెల్: 9618418981 AJY-56461



తలంబ్రాలు ప్రకటనల కొరకు ఈ క్రింది నంబర్‌ను సంప్రదించగలరు. 9985921380

## వరుడు కావలెను



★ రెడ్డి / 48 / PG / విడో / 5'4" / సెంట్రల్ Govt. Job / అగ్రికల్చర్ ల్యాండ్ / Own House / ఐరన్ & సిమెంట్ బిజినెస్ వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 9505800459 AJH-204

★ చౌదరి / 48 / 5'5" / P.G. / Govt. Job / అగ్రికల్చర్ ల్యాండ్ / పండ్ల తోటలు / స్టీల్ ఫ్యాక్టరీ / Own House / బిజినెస్ ఉన్న విడో వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 9177457881 AJH-204

★ వైశ్య / 48 / 5'4" / B.Com / Own గోల్డ్ షాపు / Own House / కమర్షియల్ కాంప్లెక్స్ వధువుకు FC/BC వరుడు కావలెను. ఇల్లరికం OK. ఫోన్: 8367546369 AJH-204

★ బ్రాహ్మిణ్ / 48 / 5'4" / విడో / MA., B.Ed టీచర్ / Own డూప్లెక్స్ House / Own సూపర్ మార్కెట్ / పొలాలు / వెల్ సెటిల్డ్ / 3 లాక్స్ P.M. వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 9542945967 AJH-204

★ రెండవ పెళ్ళి / విడో / 45 / 5'4" / MA., B.Ed / Govt. Teacher / 60,000/- P.M. / Own House / Rents / Lands లీజ్ / అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 9581187172 AJH-595

★ కాపు / డైవర్సీ / 30 / 5'4" / Bank ఎంప్లాయ్ / 13 కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. ఫోన్: 9121531522 AJH-595

★ రెడ్డి / విడో / 59 / 5'5" / Fair / Govt. Rtd. HM / పెన్షనర్ / సొంత ఇల్లు / ఆంధ్రాలో 10 ఎ॥ల పొలం / 1 L P.M. / వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. (కుల, ఆస్తి ప్రసక్తి లేదు) ఫోన్: 8499909096 AJH-595

★ రెడ్డి / విడో / 45 / 5'4" / Fair / Hyd లో యోగా టీచర్ / 70,000/- P.M. / Hyd లో Own House, Rents / well settled / వధువుకు FC/BC వరుడు కావలెను. (పిల్లలున్నా OK) ఫోన్: 9912038880 AJH-595

★ కులపట్టింపు లేదు / విడో / 48 / 5'4" / Govt. Teacher / 60,000/- P.M. / Gunturలో Own House, Lands, Rents / పిల్లలులేని అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9010391757 AJH-595

★ కులపట్టింపు లేదు / విడో / 45 / MBBS / Govt. Doctor / Hyd లో వెల్ సెటిల్డ్ / Own Hospital / 2 L P.M. / అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9010411547 AJH-595

★ కులపట్టింపు లేదు / విడో / 50 / Ananthapur / MA, B.Ed / Govt. Teacher / Own House, Rents / అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 7036243821 AJH-595

★ కులపట్టింపు లేదు / లేట్ మ్యారేజ్ / Nellore / 40 / Pharmasist / Govt. Employee / 80,000/-P.M. / అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9948643646 AJH-595

★ రెండవ పెళ్ళి / విడో / 55 / 5'4" / Hyd / Fair / Own Complex (Rents) / పిల్లలు USA లో సెటిల్డ్ / వెల్ సెటిల్డ్ / అందమైన వధువుకు FC/BC వరుడు కావలెను. (ఇల్లరికం OK) ఫోన్: 9948070006 AJH-595

★ కులపట్టింపు లేదు / విడో / 39 / 5'4" / Electronic & Hardware Shop / Own Villa & Lands / ఆర్థికంగా వెల్‌సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. ఫోన్: 8297148665 AJH-595

★ కాపు / లేట్ మ్యారేజ్ / 48 / 5'4" / Fair / B.Com / Own House / Job / 40,000/- P.M. / well settled అందమైన వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 9394288881 AJH-595

★ వైశ్య / విడో / 42 / 5'4" / బ్యూటీషియన్ / Own Beauty Parlour / 1 L P.M. / Own House గల వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. ఫోన్: 9912320015 AJH-595

★ పెరిక / B.Tech / Govt. Asst. ఇంజినీర్ / ట్రాన్స్‌కో / 45,000/- P.M. / 5'4" ఎత్తు / 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9966760501 AJH-595

★ కుమ్మరి / 30 లక్షల ఆస్తి / SWE / 25,000/- P.M. / 5'4" ఎత్తు / 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9908222406 AJH-595

★ రజక / B.Tech / Govt. Asst. ఇంజినీర్ / R&B / 40,000/- P.M. / 5'5" ఎత్తు / 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9618008271 AJH-595

★ FC / విడో / 54 / చామనఛాయ / 5'4" / డిగ్రీ / Govt. పెన్షన్ / Own House / P.M. 40 K / ఆదాయం కల వధువుకు కుల ప్రసక్తి లేని వరుడు కావలెను. ఫోన్: 7675865699 AJH-595

★ నాయుడు / విడో / 60 / V.Fair / Govt. Job రిటైర్డ్ / వ్యవసాయం / రెండు ఇళ్లు కల వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 9553583079 AJH-595

★ బ్రాహ్మిణ్ / విడో / 54 / V.Fair / డిగ్రీ / P.Job / రెండు వాటాల ఇల్లు / P.M. 35 K కల వధువుకు వరుడు కావలెను. కుల పట్టింపు లేదు. ఫోన్: 9885228709 AJH-595

★ BC / విడో / 56 / Fair / డిగ్రీ / Govt. Job / సొంత ఇల్లు / 1 పాప సెటిల్డ్ వధువుకు FC/BC వరుడు కావలెను. ఫోన్: 7993862009 AJH-595

★ Rajulu / 48 / 5'4" / Unmarried / చేపల చెరువులు / కొబ్బరి తోటలు / రియల్ ఎస్టేట్ బిజినెస్ / 3 కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9618981150 AJH-595

★ కాపు / విడో / 55 / 10th / ప్రైవేట్ జాబ్ / 30,000/- P.M. / సొంత ఇల్లు / బిజినెస్ / కుల పట్టింపు లేని వధువుకు వరుడు కావలెను. ఇల్లరికం అయినా OK. ఫోన్: 9542746093 AJH-595

★ యాదవ / 50 / విడో / డిగ్రీ/ 25,000/- P.M. / పెన్షన్ / సొంత ఇల్లు కల వధువుకు వరుడు కావలెను. ఫోన్: 7893810588 AJH-595

★ కుల పట్టింపు లేదు /2nd మ్యారేజ్ / 45Y / 5'4" / డిగ్రీ, ఫ్యామిలీ పెన్షన్ 50,000/- PM, సొంత ఇల్లు గల వధువుకు ఇల్లరికం వరుడు కావలెను. ఫోన్: 7993979542 AJH-55764

★ రెడ్డి /48Y / విడో / 5'3" / Fair / డిగ్రీ/ షుగర్ ఫ్యాక్టరీ / షాపింగ్ కాంప్లెక్స్ / రెంట్స్ / ల్యాండ్స్ / కుల ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. నో బ్రోకర్స్) అర్జెంట్. ఫోన్: 7730915235 / 7287045913 AJH-595

★ రెడ్డి /విడో / 42Y / 5'4" / Full Fair / ఓన్ బిజినెస్ / 2 Lak pm 10 Crs ప్రాపర్టీ గల వధువుకి 1, 2వ వరుడు కావలెను. వాట్సాప్: 8367698975 AJH-595

★ చౌదరి /కుల ఆస్తి పట్టింపు లేదు / 31Y / 5'5" / 2nd మ్యారేజ్ / Fair / MBA / 23 ఎకరాల కొబ్బరితోట 32 Crs ఆస్తిగల వధువుకి వరుడు కావలెను. వాట్సాప్: 9666591189 AJH-595

★ చౌదరి / విడో / 42Y / 5'4" / Full Fair / 3 Lak pm / 22 Crs ప్రాపర్టీ గల వధువుకి 1, 2వ వరుడు కావలెను. వాట్సాప్:- 9553429132 AJH-595

★ రెడ్డి / డైవర్సీ / 46Y / 5'3" / ప్రాపర్ వైజాగ్ / Hydలో సొంత బిజినెస్ / రెంట్స్ / మంచి ఆస్తిగల వధువుకి, కుల ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. (అర్జెంట్) (నో బ్రోకర్స్) ఫోన్:9581776711 / 9581151051 AJH-595

★ ఇల్లరికం,కులపట్టింపులేదు,లేట్‌మ్యారేజ్, రెండవ పెళ్ళి, తిరుపతి, నెల్లూరు, మదనపల్లి, విజయవాడ, హైదరాబాద్ లో గల వారికి వరులు కావలెను వయస్సు (35-45) ఫోన్:9966625040 AJA-349089

★ కమ్మ/ కులపట్టింపు లేదు/ 55/ 5.3/ సెంట్రల్ గవర్నమెంట్ ఆఫీసర్ / విడో / అమెరికాలో స్థిరపడ్డ పిల్లలు. సొంత ఇల్లు, రిచ్ ఫ్యామిలీ మహిళకు వరుడు కావలెను. సం.ప్ర. సెల్: 99637 13979. AJR-2470

★ 34/ 2nd/ కాపు/ 33/2nd/ అందమైన వధువులకు కులపట్టింపు లేని వరులు తోడు లేదా పెళ్ళికి కావలెను. పెన్షనర్స్ కూడా O.K. ఎంత వయసు వారైన సంప్రదించవచ్చును. 7981322231 AJC-553192

★ బ్రాహ్మణ, 58 సం॥ స్వల్ప అనారోగ్యం గల బ్రాహ్మణ స్త్రీకు 50-55 వయస్సుగల ఇంటిపని, సహాయంచేయగలిగి పేద బ్రాహ్మణ (భోజనం + వసతి) మగ మనిషి కావలెను. Ph : 9963073764 AJG-552474

## కళ్యాణ వేదిక

★ కావ్యశ్రీ మ్యారేజ్ బ్యూరో, 1వ, 2వ లేట్ మ్యారేజెస్ విడోస్, విడోయర్స్, డైవర్సీస్, పెన్షనర్లకు అన్ని కులముల వారికి ఫాస్ట్ సెటిల్‌మెంట్, స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్. ఫోన్: 7416303057 AJH-595

★ ముదిరాజ్ మహా కళ్యాణ వేదిక: ముదిరాజ్ కులస్తులకు మాత్రమే పెళ్ళి సంబంధాలు చూడబడును. ఎం.పవన్‌కుమార్ ముదిరాజ్. ఫోన్: 7093222626, 7093222727Org. by ముదిరాజ్ సేవా సమితి. AJH-595

★ లక్ష్మీ మ్యారేజ్ బ్యూరో. కేవలం చౌదరి కులస్తులకు మాత్రమే పెళ్ళి సంబంధాలు చూడబడును. ప్రొ: జాస్తి సైదారావు. ఫోన్:9705588313 / 9182731506 AJH-595

★ కీర్తన మ్యాట్రిమోని: అన్ని కులాల హిందూ, క్రిస్టియన్ మ్యాచెస్ చూడబడును. మా ప్రత్యేకత మ్యాచ్‌కుదిరిన తరువాత సెటిల్‌మెంట్ ఫీజు ఉంటుంది. ఫోన్: 7893567244 AJH-15031

★ రజక వివాహ వేదిక (1994) Abroad, ఇంజనీర్స్, డాక్టర్స్, Govt. Jobs / Business / B.Ed సంబంధాలకై సంప్ర॥ ఫోన్: 8106303155/9391265304 AJH-595

★ అన్ని కులముల, Govt Jobs, సాఫ్ట్‌వేర్స్ వారికి, ప్రైవేట్ జాబ్స్ వారికి పెళ్ళి సంబంధములు త్వరత్వరగా కుదిరించబడును. కె. రమేష్ గౌడ్, వాట్సప్ నెం. 7702279912. హైదరాబాద్, సూర్యాపేట, మిర్యాలగూడ. AJY-564367

### గమనిక

ఆంధ్రజ్యోతి తలంబ్రాలు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయంగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

## VIP MATRIMONY (KAMMA-REDDY)

కమ్మ - రెడ్డి ల యొక్క సంపన్న కుటుంబాల వివాహ వేదిక.
ఫోన్ : 8143538383, 9381579992

### వధువు కావలెను

★ కమ్మ (Business). 25 / 5'11" / BE, MBA / Business / 100 Cr. / Hyd ★ 26 / 6'2"/ MBA / Own Industry / 200 Cr. ★ Ph: 8143538383

★ కమ్మ. 27/6'1"/ MBA (ISB) / Business / 200 Cr. ★ 28 / 6'0"/ ACS / Business / 75 Cr. Ph: 8143538383

★ కమ్మ (USA). 27/6'/ MS / $100K / 100 Cr. ★ 29 / 5'9"/ MS / Face Book / $ 120 K 100 Cr ★ Ph: 8143538383

★ కమ్మ. 28/6'/ BE (IIT) / MS / $200K / 40 Cr. ★ 27 / 6'1"/ V.Fair / MS / $140K / FREEDIE / 20 Cr ★ Ph: 8143538383

★ కమ్మ. 28/5'10"/ MS / AMAZON / $250 K / 16 Cr. ★ 27 / 5'11"/ MBA (Fin.) / $ 150 K / 100 Cr ★ Ph: 8143538383

★ కమ్మ (Doctor). 26/5'10"/ V.Fair / MD (GM) / 10 Cr. ★ 30 / 6'/ DM (Cardiology) / 100 Cr. / Hyd ★ Ph: 8143538383

★ కమ్మ (Doctor-USA). 31/6'/ MD (Gastro) / Fellowship (Endoscopy) / Citizen of USA / 30 Cr. ★ 30 / 5'11"/ Fellowship (Neuro Radiology) / 10 Cr ★ Ph: 8143538383

★ కమ్మ (INDIA). 26/5'9"/ BE (IIT) / 40 LPA / 15 Cr. ★ 28 / 5'11"/ BE (IIT)/ 30 LPA / 10 Cr ★ Ph: 8143538383

★ కమ్మ. 27/5'6"/ V.Fair / BE (CBIT) / MS / 14 LPA / Hyd / 25 Cr. ★ 26 / 5'10"/ M.Tech / C.Govt. / 80 K / 10 Cr ★ Ph: 8143538383

★ రెడ్డి. 28/5'11"/ MBBS / Doing Residency in US / 200 Cr. / Seeks Doctors, Engg., MBA Brides / Well Family Backgroud. ★ Ph: 8143538383

★ రెడ్డి. 29/5'11"/ V.Fair / BE / M.Tech (IIIT) / MS (Stony Brook) / 10 Cr. ప్రాపర్టీ గల అబ్బాయికి USA CITIZENS (Doctor, Engg.) కావలెను. ★ Ph: 8143538383

### వరుడు కావలెను

★ కమ్మ (Business). 23/5'6"/ V.Fair / MBBS / 100 Cr. ★ 26 / 5'5"/ V.Fair / CA / 300 Cr ★ Ph: 8143538383

★ కమ్మ. 25/ 5'6"/ V.Fair / MD (Dermatology) / 100 Cr. ★ 26 / 5'6"/ MD (Paediatric) / 100 Cr ★ Ph: 8143538383

★ కమ్మ (USA). 23/5'5"/ V.Fair / MS / 60 Cr. ★ 27 / 5'8"/ V.Fair / MS / $ 100 K / 70 Cr ★ Ph: 8143538383

★ కమ్మ. 24/5'4"/ V.Fair / BE (IIT) / MS / $ 180 K / 25 Cr. ★ 28 / 5'5"/ BE (IIT) / MBA / $ 200 K / 70 Cr ★ Ph: 8143538383

★ కమ్మ (Doctor-USA). 27/5'4"/ V.Fair / Residency (Internal-Med) / Citizen of USA / 25 Cr. / Seeks Doctors / Engg ★ Ph: 8143538383

★ కమ్మ (INDIA). 22/5'9"/ V.Fair / BE / Accenture / Hyd / 25 Cr. / ★ 24 / 5'4"/ V.Fair / BE / 50 Cr. / Hyd ★ Ph: 8143538383

★ కమ్మ. 24/5'5"/ Beautiful / BE / 8 LPA / 20 Cr. ★ 23 / 5'7"/ V.Fair / BE / MBA / 10 Cr ★ Ph: 8143538383

★ కమ్మ. 26/5'5"/ V.Fair / MBA / 25 LPA / 80 Cr. ★ 27 / 5'6"/ V.Fair / CA / 15 Cr ★ Ph: 8143538383

★ రెడ్డి. 27/5'5"/ V.Fair / Doing MD (USA) / Citizen USA / 50 Cr. / Seeks any (Kamma, Reddy) Grooms in USA ★ Ph: 8143538383

★ రెడ్డి. 29/5'4"/ V.Fair / BE, MBA / Business / Hyd / 100 Cr. / Seeks well settled Job / Business Grooms ★ Ph: 8143538383

★ రెడ్డి. 26 / 5'7" / Beautiful / MD (Dermatology) / 100 Cr. / Hyd. / Seeks well settled Doctors (or) Business Grooms ★ Ph: 8143538383

# ఆర్టీసీలో వీఆర్ఎస్ అలజడి!

- తప్పుకొనే యోచనలో ఇద్దరు ఈడీలు, పలువురు అధికారులు
- తగ్గనున్న జీతం, పింఛనూ ఉండదని తేలడంతో దరఖాస్తులు
- ఎస్ఆర్‌బీఎస్, ఎస్‌బీటీ పథకాలకు యాజమాన్యం మంగళం?
- రద్దు ఆలోచనను విరమించుకోకుంటే ఆందోళనలు: ఈయూ



అమరావతి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్టీసీలో వీఆర్ఎస్ అలజడి మొదలైంది. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం ప్రభావం అధికారుల ఉద్యోగాలకు ఎసరు తెచ్చిపెట్టింది. ఇప్పటివరకూ భారీ జీతాలు, అలవెన్సులు తీసుకొంటున్న వీరికి విలీనంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగుల్లో జూనియర్ అసిస్టెంట్ జీతాలతో కార్మికులకు, సీనియర్ అసిస్టెంట్ జీతాలు సూపర్‌వైజర్లకు ఇలా పెంచుతూ జిల్లాస్థాయి అధికారికి ఉండే సీనియర్ పే స్కేలు ఆధారంగా ఆర్టీసీ అధికారులకు జీతాలు నిర్ణయిస్తారు. ఆర్టీసీ ఇప్పటి వరకూ కార్పొరేషన్ కావడంతో అధికారులకు పింఛను సదుపాయం లేదు. దీంతో యాజమాన్యాన్ని ఒప్పించి లక్షల్లో జీతాలు, అలవెన్సులు తీసుకొంటున్నారు. ఆర్డీవో జీతం కన్నా డిపో మేనేజర్‌కు, జిల్లా కలెక్టర్ కన్నా ఆర్టీసీ ఆర్ఎంకు, రవాణాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కన్నా ఆర్టీసీ ఈడీలకు ఎక్కువ జీతభత్యాలు ఉన్నాయి. జనవరి నుంచి ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం అయితే ఇవన్నీ తగ్గిపోతాయి. ఈడీలకు ప్రస్తుతం అన్నీ కలిపి రూ.2.5- 3లక్షల వరకూ లభిస్తోంది. విలీనం తర్వాత దీనిలో రూ.లక్షకు పైగా తగ్గే అవకాశం ఉంది. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో పదవీ విరమణ వయసు రెండేళ్లు పెరగడంతో ఉద్యోగంలో కొనసాగినా రూ.24లక్షలకు పైగా వదులుకోవాల్సి వస్తుంది. రిటైర్మెంట్ ప్రయోజనాలు ఆర్టీసీలో భారీగా ఉంటాయి. ఈడీ స్థాయి అధికారికి రూ.50లక్షలకు పైగానే అందుతుంది. అదే ప్రభుత్వంలో అయితే రూ.20లక్షలకు మించి దక్కదు. రెండురకాలుగా నష్టపోవడం కన్నా ఉద్యోగం వదులుకోవడమే మేలనే నిర్ణయానికి ఉన్నతాధికారులు వచ్చారు.

విలీన కమిటీతో వీరు మంతనాలు జరిపినా ఫలించలేదు. పెన్షన్ ఇవ్వడం సాధ్యంకాదని కమిటీ నివేదికలో పొందుపరిచినట్లు స్పష్టమవడంతో వీఆర్ఎస్ తప్ప మరోమార్గం లేదని భావిస్తున్నారు. ఇద్దరు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. ఆర్టీసీ యాజమాన్యానికి ఇప్పటికే అప్లికేషన్లు అందజేసిన వారిద్దరూ డిసెంబరు నెలాఖరులోపే వీఆర్ఎస్ తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. రెండేళ్లలోపు సర్వీసున్న డిపో మేనేజర్లు, మరికొందరు అధికారులు కూడా అదేబాటలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై ఒక ఈడీని సంప్రదించగా తర్వాత చెబుతానంటూ దాట వేశారు.

### రెండు పథకాల రద్దుకు నిర్ణయం

పదవీ విరమణ తర్వాత పెన్షన్‌లేని కార్మికులకు భరోసాగా ఆర్టీసీలో స్టాఫ్ రిటైర్‌మెంట్ బెనిఫిట్ స్కీమ్(ఎస్ఆర్‌బీఎస్) 1989లో ఏర్పాటైంది. ప్రతినెలా ఉద్యోగి జీతం నుంచి రూ.250వరకూ రికవరీ చేసి పదవీ విరమణ తర్వాత రూ.3వేలు పింఛను చెల్లించడం దీని ఉద్దేశం. ఇప్పటి వరకూ కార్మికుల నుంచి రికవరీ చేసిన మొత్తం సుమారు రూ.422కోట్ల వరకూ ఉంది. ఈ మొత్తాన్ని ఆర్టీసీ సిబ్బందికి బ్యాంకు వడ్డీతో లోన్లు ఇచ్చి, వచ్చే ఆదాయంతో పెన్షన్ ఇస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో రిటైరైన కార్మికులు 40వేల మంది వరకూ ఉన్నారు. వీరికి ప్రతినెలా ఎస్ఆర్‌బీఎస్ నుంచి రూ.6కోట్ల వరకూ పెన్షన్ అందుతోంది. ఉద్యోగి మరణించిన తర్వాత అతడి భార్యకు కూడా సగం పింఛను ఇస్తున్నారు. ఆర్టీసీ విలీనంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆంజనేయ రెడ్డి కమిటీ సిఫారసుల మేరకు విలీనం తర్వాత ఈ పథకం రద్దు చేయాలని యాజమాన్యం దాదాపు నిర్ణయానికి వచ్చినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఆర్టీసీ కార్మికుడు ఆకస్మికంగా మరణిస్తే వారి కుటుంబానికి అండగా ఉండేందుకు స్టాఫ్ బెన్వలెంట్ ట్రస్ట్(ఎస్‌బీటీ) 1980లో ఏర్పాటైంది. ఈ పథకం ద్వారా సదరు ఉద్యోగి కుటుంబానికి రూ.50వేలు చెల్లిస్తారు. ట్రస్టు మూతబడితే ఆయా కుటుంబాలు పరిహారం నష్టపోయే ప్రమాదం ఉందని, విలీనం తర్వాత కూడా దీన్ని కొనసాగించాలని కార్మికులు కోరుతున్నారు. పథకం కొనసాగించడంవల్ల ఆర్టీసీకి నష్టమే ఎక్కువని అధికారులు చెబుతుండగా... ట్రస్టు డబ్బులు యాజమాన్యం వాడుకోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని గుర్తింపు కార్మిక సంఘం ఈయూ ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదర్ రావు ఆరోపించారు. ఎస్ఆర్‌బీఎస్, ఎస్‌బీటీ రద్దుచేస్తే కార్మికులకు భారీగా నష్టం జరుగుతుందని, ఈ విషయంలో అవసరమైతే ఆందోళనకు సిద్ధపడతామని హెచ్చరించారు. ఈ రెండు పథకాల రద్దు ఆలోచనను యాజమాన్యం విరమించుకోవాలని కోరారు.



## చర్చికి చేరిన బడి!

'బడి బయటకు గెంటేశారు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన వార్తా కథనంపై అధికారులు స్పందించారు. విజయవాడ శివారులోని నిడమానూరు నెహ్రూనగర్‌లో సీబీసీఎన్‌సీ చర్చికి అనుబంధంగా నడుస్తున్న సీబీసీఎన్‌సీ ప్రాథమిక ఎయిడెడ్ పాఠశాల విద్యార్థులకు చర్చి ఆవరణలోనే పాఠాలు బోధించేలా ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో శనివారం ఉదయమే పాఠశాలకు చేరుకున్న మండల అధికారి జె.సునీత, ఎంఈవో వెంకటరత్నం.. తొలుత పిల్లల్ని కమ్యునిటీ హాల్‌లో కూర్చోబెట్టారు. అనంతరం ఎయిడెడ్ పాఠశాలకు యాజమాన్యమే వసతి చూపాల్సి ఉంటుందని, విద్యార్థులకు తక్షణమే వసతి ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించడంతో సీబీసీఎన్‌సీ చర్చి పాస్టర్ జి.జీవరత్నం 45 మంది పిల్లలకు చర్చి ఆవరణలోనే పాఠాలు చెప్పేవిధంగా బాధ్యత తీసుకున్నారు. ఈ మేరకు అధికారులకు లిఖితపూర్వకంగా రాసిచ్చారు. అయితే చర్చి ఆవరణలో కాకుండా విద్యా బోధనకు ప్రత్యేక తరగతి గది చూపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

\- గుణదల

### పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో 'నాడు-నేడు'

అమరావతి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల స్థితిగతులను మార్చేందుకు చేపట్టిన 'మనబడి నాడు-నేడు' కార్యక్రమం అమలుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఇందులో తాగునీరు, మరుగుదొడ్లు, లైట్లు, ఫ్యాన్లు, ఫర్నిచర్, ప్రహరిగోడ, మరమ్మతులు, రంగులు వంటి 9 రకాల మౌలికవసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ కార్యక్రమం అమల్లో పేరెంట్స్ కమిటీ కీలకపాత్ర పోషిస్తుంది. కమ్యూనిటీ కాంట్రాక్టు విధానంలో పేరెంట్స్ కమిటీ ఈ పనులు చేపడుతుంది. పనులు ప్రారంభించే ముందే అంచనాలో 15 శాతం మొత్తాన్ని లేబర్ చార్జీల కోసం పేరెంట్స్ కమిటీ బ్యాంకు ఖాతాలో పాఠశాల విద్యాశాఖ జమ చేస్తుంది. పేరెంట్స్ కమిటీలో ఐదుగురు సభ్యులను ఎంపిక చేసి వారికి చెక్‌పై సంతకం చేసే అథారిటీని హెడ్మాస్టర్ కల్పిస్తారు. ఈ ఐదుగురు సభ్యుల్లో ముగ్గురు మహిళలు ఉండాలి. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాల విద్య, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ, మున్సిపల్, సాంఘిక, గిరిజన, బీసీ, జువైనల్, మత్స్యశాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలను ఈ పథకం కింద అభివృద్ధి చేస్తారు. రాష్ట్రంలో 44,512 స్కూళ్లు ఉన్నట్లు గుర్తించారు. అందులో మూడోవంతు(15,715) స్కూళ్లను మొదట ఎంపిక చేసుకుని పనులు ప్రారంభిస్తారు. వీటిని పర్యవేక్షించేందుకు రాష్ట్ర, జిల్లాస్థాయిలో రెండు కమిటీలు ఉంటాయి.

### అడవుల పరిరక్షణకు చర్యలు

- జాతీయ స్థాయి సమావేశంలో అధికారుల వెల్లడి

న్యూఢిల్లీ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వాతావరణ కాలుష్యాన్ని అరికట్టేందుకు, అడవుల పెంపకానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ చీఫ్ ప్రిన్సిపల్ కన్సర్వేటర్ ప్రదీప్‌కుమార్ చెప్పారు. శనివారం ఢిల్లీలో కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ అధ్యక్షతన రాష్ట్రాల అటవీశాఖ మంత్రుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రం తరఫున చీఫ్ ప్రిన్సిపల్ కన్సర్వేటర్ హాజరై మాట్లాడారు. ఏపీలో ప్రస్తుతం 23శాతం అడవులు ఉన్నాయని, వాటిని 33 శాతానికి పెంచాలన్న లక్ష్యంతో పని చేస్తున్నట్లు చెప్పారు. కాగా, జాతీయ స్థాయిలో జరిగిన చర్చలో ఏపీ మంత్రి గైర్హాజరు కావడంపై విమర్శలు వస్తున్నాయి. ఢిల్లీలో తరచూ జరుగుతున్న జాతీయ సదస్సులు, సమావేశాలకు కూడా రాష్ట్ర మంత్రులు హాజరు కావడంలేదు.

### పీఆర్‌సీ కోసం వైద్యుల పోరుబాట!

అమరావతి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) పరిధిలో విధులు నిర్వహిస్తున్న స్పెషలిస్ట్ వైద్యులు పీఆర్సీ కోసం పోరాటానికి సిద్ధమవుతున్నారు. 2016లో అమలులోకి రావాల్సిన పీఆర్‌సీని ప్రభుత్వాలు కాలయాపన చేస్తూ వచ్చాయి. ఈ వైద్యులు ఇప్పటికీ 2006 పీఆర్‌సీ ప్రకారమే జీతాలు పొందుతున్నారు.

### 14న జాతీయ లోక్ అదాలత్

అమరావతి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్ డిసెంబరు 14వ తేదీన జరుగనుంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కోర్టుల్లోనూ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి డాక్టర్ వి.రాధాకృష్ణ కృపాసాగర్ శనివారం ప్రకటించారు.

### రిజిస్టర్ కాని ఆలయాల సంగతేంటి?: హైకోర్టు

అమరావతి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రిజిస్టరైన ఆలయాలకు వంద మీటర్ల దూరం వరకు మద్యం దుకాణాలు ఉండకూడదన్న నిబంధన విధించిన దేవదాయ శాఖ.. రిజిస్టర్ కాని ఆలయాల విషయంలో ఎందుకు వర్తింపజేయడం లేదని హైకోర్టు ప్రశ్నించింది. తగిన వివరణతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. తూర్పుగోదావరి జిల్లావాసి దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎం.వెంకటరమణలతో కూడిన ధర్మాసనం విచారించింది.

### ఇంట్లోకి చొరబడి..
## టెకీపై అత్యాచారం

హైదరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో మానస.. షాద్‌నగర్‌లో ప్రియాంక హత్యాచార ఘటనలపై సర్వత్రా ఆవేదన.. ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్న తరుణంలోనే హైదరాబాద్‌లో ఈ తరహా మరో ఘటన కలవరపరుస్తోంది! బుధవారం పట్టపగలు ఓ యువ మహిళా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్.. ఆమె ఇంట్లోనే అత్యాచారానికి గురైనట్లు తెలిసింది! విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఓ మ్యాట్రిమోనీ సంస్థ తరఫున వచ్చిన బృందంలోని ఒకరు ఆ సమయంలో ఇంట్లో టెకీ ఒక్కత్తే ఉండటంతో ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ షాక్‌తో బాధితురాలు మూడు గంటలపాటు స్పృహకోల్పోయింది. అయితే, ఈ ఘటనపై ఫిర్యాదు అందినా పోలీసులు గోప్యత పాటిస్తున్నారు. అసలేమీ జరగలేదని ఒకసారి.. అత్యాచారయత్నమే జరిగిందని మరోసారి చెబుతుండటం అనుమానాలకు తావిస్తోంది. బాచుపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో గల నిజాంపేటలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఈ ఘటన జరిగింది.

## పోస్ట్‌మెట్రిక్ విద్యార్థులకు 'దీవెన'

- ఈ ఏడాది నుంచే విద్యా పథకాలు
- రెండు విడతలుగా ఖాతాకు డబ్బు
- 'విద్యా' నిధి కాలేజీకి, 'వసతి' తల్లికి
- రెసిడెన్షియల్, హాస్టళ్లకు వర్తించదు
- ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల

అమరావతి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చదువుతున్న పోస్టు మెట్రిక్ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు హాస్టల్ వసతి, భోజనాల కోసం అదనంగా ఇన్సెంటివ్స్ అందించేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన పేర్లతో అర్హులైన విద్యార్థులకు ఈ సాయం అందించాలని నిర్ణయించింది. అదే విధంగా జగనన్న వసతి దీవెన కింద ఐటీఐ నుంచి పీహెచ్‌డీ వరకు గల ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనారిటీ, కాపు, ఈబీసీ విద్యార్థులకు సాయం అందిస్తారు. ఇంటర్ విద్యార్థులకు అమ్మఒడి అమలు చేస్తున్నందున ఈ పథకంలో వారిని మినహాయించారు. ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ అంతకంటే పై చదువులు చదివే విద్యార్థులకు రూ.20 వేలు హాస్టల్ వసతి, భోజన ఖర్చులకు అందించాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. 2019-20 ఆర్థిక సంవత్సరం నుంచి ఈ రెండు పథకాలు అమల్లోకి రానున్నాయి. ఈ మొత్తాన్ని జూలై, డిసెంబర్ నెలల్లో రెండువిడతలుగా అందిస్తారు. ప్రస్తుతం ప్రభుత్వ/ఎయిడెడ్/ప్రైవేట్, యూనివర్సిటీల ఆధ్వర్యంలో పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీ, ఆపై చదువులు చదువుతున్న విద్యార్థులందరూ అర్హత కలిగి ఉంటారు. డేస్కాలర్ విద్యార్థులు, కాలేజీ అనుబంధంగా, శాఖ అనుబంధంగా ఉన్న హాస్టళ్లలో చదివే విద్యార్థులూ అర్హత కలిగి ఉంటారు. ఈ ఏడాది డేస్కాలర్ విద్యార్థుల్లో ఐటీఐ విద్యార్థులకు రూ.5 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.7,500, డిగ్రీ అంతకంటే పై చదువులవారికి రూ.10 వేలు వారి తల్లిఖాతాలో జమచేస్తారు. వచ్చే ఏడాది నుంచి పూర్తి స్థాయిలో వారికి స్కాలర్‌షిప్పులు అందిస్తారు. కాలేజీ అటాచ్డ్ హాస్టల్ విద్యార్థుల్లో ఐటీఐకి రూ.10 వేలు, పాలిటెక్నిక్‌కు రూ.15 వేలు, ఇతర డిగ్రీ అంతకంటే పైస్థాయి చదువులకు రూ.20 వేలు రెండు విడతల్లో అందిస్తారు. విద్యార్థుల తల్లి ఖాతాను సచివాలయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ మ్యాపింగ్ చేస్తారు. అయితే రెసిడెన్షియల్, ప్రభుత్వ వసతి గృహాల్లో ఉన్నవారికి ఈ పథకం వర్తించదు.

### 75 శాతం హాజరు ఉంటేనే..

స్కాలర్‌షిప్పులు పొందాలంటే 75 శాతం హాజరు తప్పనిసరిగా ఉండాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. అయితే ప్రైవేట్ యూనివర్సిటీలు/డీమ్డ్ యూనివర్సిటీల విద్యార్థులకు ఈ పథకం వర్తించదు. కరస్పాండెన్స్/డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కోర్సులు చదివే విద్యార్థులకూ అమలు కాదు. మేనేజ్‌మెంట్ కోటా/స్పోర్ట్స్ కోటాలో సీట్లు పొందిన వారు కూడా ఈ పథకానికి అర్హులు కాదు. కుటుంబసభ్యులు ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నా అర్హత ఉండదు. అయితే పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న సిబ్బందికి జీతం ఎంత వస్తున్నా... వారు పెన్షన్‌కు అర్హత కలిగిఉంటారు. సొంత నాలుగు చక్రాల వాహనాలు కలిగి ఉంటే వారు ఈ పథకానికి అర్హులు కారు. ప్రభుత్వ పథకాల ద్వారా ట్యాక్సీలు/ట్రాక్టర్లు/ఆటోలు పొందిన వారికి మాత్రం మినహాయింపు ఇచ్చారు. పట్టణాల్లో ఇతర ఏ ఆస్తులు లేకుండా 1500 చదరపు అడుగులు నివాస/వ్యాపార స్థలాలు ఉన్నా అర్హత కలిగి ఉంటారు. రూ.2.50 లక్షల లోపు వార్షికాదాయం ఉన్నవారే అర్హులవుతారు. 10 ఎకరాలలోపు మాగాణి, 25 ఎకరాల లోపు మొట్ట భూములు కలిగి ఉన్న వారు సైతం ఈ పథకాన్ని అందుకోవచ్చు. అయితే ఆదాయపు పన్ను చెల్లించే వారు ఈ పథకంలో అర్హత ఉండదు.

### కళాశాల ఖాతాలో జమ

జగనన్న విద్యాదీవెన పథకంలో విద్యార్థులకు అందించే స్కాలర్‌షిప్పు మొత్తాలను కళాశాలల ఖాతాల్లో జమచేస్తారు. జగనన్న వసతి దీవెన ద్వారా విద్యార్థులకు ఇచ్చే ప్రోత్సాహక మొత్తాలను విద్యార్థి తల్లి లేక సంరక్షకుల ఖాతాలో వేస్తారు. విద్యార్థుల ట్యూషన్ ఫీజు, స్పెషల్ ఫీజు, ఇతర ఫీజులతోపాటు పరీక్ష ఫీజులు మొత్తం కలిపి పూర్తి ఫీజును ఆయా కళాశాల ఖాతాలకు జమచేస్తారు. ఈ పథకాలకు సంబంధించిన నిధులు ఆయా శాఖల ద్వారా అందిస్తారు. ఈ పథకం ద్వారా ఇప్పటికే ఈ ఏడాదిలో లబ్ధి పొంది ఉంటే వాటిని మినహాయించి మిగతా మొత్తం చెల్లిస్తారు. అర్హులైన లబ్ధిదారులకు వైఎస్ఆర్ నవశకం ద్వారా ఫీజు రీయింబర్స్‌మెంట్ కార్డు అందిస్తారు. జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతిదీవెనకు కార్డును పరిశీలన అనంతరం అందిస్తారు.

## వెయ్యి పెంచి... ఎసరు పెడతారా?

- మా జీతమెంతని.. కార్డులు రద్దు చేస్తారు?
- రేషన్ కార్డుల రద్దుపై అంగన్‌వాడీల ఆగ్రహం

అమరావతి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): 'వెయ్యి రూపాయల గౌరవ వేతనం పెంచి.. మమ్మల్ని సంక్షేమ పథకాలకు దూరం చేస్తారా?' అని అంగన్‌వాడీ ఉద్యోగులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో 10 వేలకుపైగా వేతనం తీసుకునే ఉద్యోగులందరికీ తెల్ల రేషన్ కార్డులు రద్దు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా గ్రామ వలంటీర్లతో సర్వే చేయిస్తోంది. ప్రభుత్వ నిర్ణయంతో తీవ్రంగా నష్టపోతామని ఐసీడీఎస్ కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. రేషన్‌కార్డుతోనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు ముడిపడి ఉండడంతో ఆ పథకాలకు మమ్మల్ని దూరం చేస్తారా? అని ప్రశ్నిస్తున్నారు. ఐసీడీఎస్ టీచర్‌కు గతంలో ఉన్న 10,500 వేతనాన్ని వైసీపీ ప్రభుత్వం వచ్చాక 11,500కు పెంచింది. ఈ వెయ్యి రూపాయల వేతనం పెంచినందుకే మా కార్డులు రద్దు చేస్తారా? అని అంగన్‌వాడీ ఉద్యోగులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 55 వేల మంది అంగన్‌వాడీ కార్యకర్తలు పనిచేస్తున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఆర్థికంగా నష్టపోతామని వీరంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదు.. ఇప్పుడు తెల్లరేషన్‌కార్డు కూడా రద్దుచేస్తే ఎలా బతకాలని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు.

### రద్దుపై ఆందోళన చేపడతాం

అంగన్‌వాడీలకు తెల్లరేషన్ కార్డులు కొనసాగించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. రేషన్ కార్డులు రద్దుచేస్తే సంక్షేమ పథకాలు కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్లకు లేఖలు రాస్తామని చెప్పారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

## బలం చాటుకున్న ఉద్ధవ్ సంకీర్ణం

### కొత్త సర్కారుకు 169మంది మద్దతు.. బీజేపీ ఎమ్మెల్యేల వాకౌట్



సీఎం కుర్చీలో ఉద్ధవ్

ముంబై, నవంబరు 30: మహారాష్ట్రలో శివసేన నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం శని వారం బలం నిరూపించుకొంది. 288 మంది సభ్యులున్న అసెంబ్లీలో 169 మంది ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారు. ప్రొటెం స్పీకర్‌ను మార్చడాన్ని నిరసిస్తూ ప్రధాన ప్రతిపక్షానికి చెందిన 105 మంది బీజేపీ సభ్యులు ఈ ప్రక్రియను బహిష్కరించారు. బల నిరూపణలో బోల్తా కొడతామన్న భయంతోనే ప్రొటెం స్పీకర్‌గా బీజేపీకి చెందిన కాళిదాస్ స్థానంలో ఎన్సీపీ సభ్యుడు దిలీప్ వాల్సేను నియమించుకొన్నారని పక్ష నేత దేవేంద్ర ఫడణవీస్ ఆరోపించారు. కొత్త సభ్యులతో ప్రమాణం చేయించడానికి పరిమితం కావాల్సిన ప్రోటెం స్పీకర్ సభను ఎలా నడిపిస్తారని ప్రశ్నించారు. మరోవైపు ఉద్ధవ్‌తో పాటు కొత్త మంత్రులు బాల్ ఠాక్రే, ఛత్రపతి శివాజీ పేరిట ప్రమాణం చేయడం వివాదాస్పదమైంది. ఫడణవీస్ ఈ అంశాన్ని కూడా సభలో లేవనెత్తారు. అలాగే, అసెంబ్లీని గవర్నర్ సుప్తచేతనావస్థలో ఉంచినప్పుడు, ఆయన ఆదేశాలతోనే తిరిగి సమావేశపరిచాలన్న సంప్రదాయాన్ని తుంగ లో తొక్కారన్నారు. ఈ విమర్శలకు సభలోనే ఉద్ధవ్ సమాధానమిచ్చారు. శివాజీ, బాలాసాహెబ్ పేరిట ప్ర మాణం చేయడం తప్పయితే, ఆ తప్పును తాను మళ్లీ మళ్లీ చేస్తానని తేల్చిచెప్పారు. గవర్నర్ ఆమోదం తీసుకోకుండా సభా కార్యకలాపాలను పునఃప్రారంభించడం పై ప్రొటెం స్పీకర్ దిలీప్ వాల్సే పాటిల్ వివరణ ఇస్తూ.. సుప్రీంకోర్టు ఆదేశాలతోనే సభను సమావేశపరిచి విశ్వాస పరీక్ష నిర్వహించానన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ ఎన్నిక ఆదివారం జరగనుంది.

### పవార్ డిమాండ్లకు మోదీ నో!

మహారాష్ట్రలో సర్కారు ఏర్పాటుపై బీజేపీ, ఎన్సీపీ మధ్య రెండు అంశాలకు సంబంధించి ఏకాభిప్రా యం కుదరలేదని తెలుస్తోంది. బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్ రెండు డిమాండ్లు ముందుకు తెచ్చారు. కేంద్రంలో తన కూతురు సుప్రియా సూలేకు కేంద్ర వ్యవసాయ శాఖ అప్పగించాలని పవార్ కోరారు. అలాగే ముఖ్యమంత్రి స్థానంలో దేవేంద్ర ఫడణవీస్ తప్ప వేరెవరైనా తమకు అభ్యంత రం లేదని తెలిపినట్టు విశ్వసనీయ వర్గాల భోగట్టా. అయితే ఈ రెండు డిమాండ్లనూ ప్రధాని మోదీ తోసిపుచ్చారు. వ్యవసాయ శాఖ ఎన్సీపీకి ఇస్తే బిహార్‌లో తమ మిత్రపక్షమైన జేడీయూ రైల్వే శాఖ కోసం పట్టుబట్టేదని బీజేపీ వర్గాలు తెలిపాయి. ప్రస్తుత పరిస్థితుల్లో రెండు కీలక శాఖలను వదులుకోవడానికి బీజేపీ ఏమాత్రం సంసిద్ధంగా లేదు. ఇక పవార్ రెండో డిమాండ్ విషయానికొస్తే ఫడణవీస్ తప్ప మరొకరిని సీఎం చేసే ఆలోచన పార్టీకి లేదని ఆ వర్గాలు తెలిపాయి. వివాదాలు, ఆరోపణలకు తావు లేకుండా నిండుగా ఐదేళ్లు ఫడణవీస్ పాలించడమే దీనికి కారణం. తన రెండు డిమాండ్లు నెరవేరకపోవడంతో శివసేన, కాంగ్రెస్ కూటమితో కలిసి పవార్ అడుగులు వేయాల్సి వచ్చింది.

## రుణాలిస్తామంటూ దోచేశారు

- ప్రాసెసింగ్ ఫీజు పేరిట డబ్బు వసూలు
- 167 మంది నుంచి రూ.15.47 లక్షలు స్వాహా
- ఏపీలోని 13 జిల్లాల్లో బాధితులు
- ఖమ్మం, హైదరాబాద్‌లోనూ మోసాలు
- ముగ్గురు నిందితుల అరెస్ట్




పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 30: తక్కువ వడ్డీకే సులభంగా రుణాలు ఇస్తామంటూ రాష్ట్రవ్యాప్తంగా పలువురిని మోసగించి లక్షల రూపాయలు దండుకున్న ముఠాను తిరుపతి వెస్ట్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివిధ నకిలీ ఫైనాన్స్ కంపెనీల పేరుతో సెల్‌ఫోన్ నంబర్లను ఎప్పటికప్పుడు మార్చేస్తూ తప్పించుకుని తిరుగుతున్న ఆ ముఠాను కటకటాల వెనక్కి పంపారు. శనివారం వెస్ట్ సబ్‌డివిజన్ డీఎస్పీ నరసప్ప ఆ వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. తెలంగాణలోని మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన గుడికందుల నరేష్, గుడికందుల సురేష్, కొండపర్తి సంపత్ తక్కువ వడ్డీకి సులభంగా రుణాలు ఇస్తామంటూ పత్రికల్లో ప్రకటనలు ఇచ్చి అమాయకులను దోచేశారు. ఎక్కడా తమ వ్యక్తిగత సమాచారం దొరక్కుండా వీరు జాగ్రత్త పడ్డారు. ఎయిర్‌టెల్ షోరూంలో పనిచేసే శ్రవణ్ అనే యువకుడి నుంచి వీరు కొన్ని సిమ్‌లు తీసుకున్నారు. ఆ సిమ్‌లతో బాధితులతో సంప్రదింపులు జరిపారు. రుణం కోసం సంప్రదించిన వారి నుంచి డాక్యుమెంట్లు వాట్సప్‌లో స్వీకరించేవారు. బ్యాంక్ పాస్‌బుక్, ఏటీఎం కార్డు తమ వద్ద ఉంచాలనే షరతు పెట్టేవారు. తర్వాత పత్రాలన్నీ సరిపోయాయని, ప్రాసెసింగ్ ఫీజు కడితే రుణం ఇస్తామంటూ బ్యాంక్ అకౌంట్‌లో డబ్బు వేయించుకునేవారు. పాస్‌బుక్, ఏటీఎం కార్డు తీసుకుని వారికి అందుబాటులో లేకుండా పోయేవారు. 27 జూలై 2018న శివశంకర ఫైనాన్స్ పేరిట నిందితులు ఇచ్చిన ప్రకటన చూసిన మంగళం ఆర్టీసీ డిపో అటెండర్ యనమల కృష్ణయ్య కుమారుడు యనమల రవిచంద్ర కూడా రుణం కోసం వీరిని సంప్రదించాడు. వారి సూచన మేరకు ప్రాసెసింగ్ ఫీజుకింద రూ.18,900 నాగూర్‌బాజీ పేరున ఖమ్మంలోని అకౌంటుకు పంపించాడు. ఆ తరువాత ఫైనాన్స్ వారి సెల్ స్విచ్ఆఫ్ అయ్యింది. మోసపోయానని గ్రహించిన రవిచంద్ర తిరుపతి వెస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. రవిచంద్ర డబ్బు వేసిన ఖమ్మం బ్యాంక్ అకౌంట్‌దారుడు నాగూర్‌బాజీ కూడా మోసపోయినవాడేనని గుర్తించారు. చివరకు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఏపీలోని 13 జిల్లాలు, తెలంగాణలోని ఖమ్మం, హైదరాబాద్‌లకు చెందిన మొత్తం 167 మంది నుంచి రూ. 15.47 లక్షలను నిందితులు దండుకున్నారని డీఎస్పీ వెల్లడించారు.

## ఆరు నెలల్లో ఎన్నెన్నో!

- 180 రోజుల పాలనపై మోదీ ట్వీట్లు

న్యూఢిల్లీ, నవంబరు 30: రెండోసారి అధికారంలోకి వచ్చిన తొలి ఆరు నెలల్లోనే దేశాభివృద్ధి, సామాజిక సాధికారత, సమైక్యత దిశగా అనేక నిర్ణయాలు తీసుకున్నామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. శనివారం ఆయన 'ఇండియా ఫస్ట్‌లో 6 నెలలు' అంటూ ట్విట్టర్‌లో వరుస సందేశాలు పెట్టారు. "సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్ అనే నినాదమే మాకు స్ఫూర్తి. 130 కోట్ల మంది భారతీయుల ఆశీస్సులతో ఎన్డీయే తన ప్రగతి పథాన్ని కొనసాగిస్తోంది. తొలి ఆరు నెలల్లోనే చాలా చేశాం. ఇంకా చేయాలని భావిస్తున్నాం. సమస్త భారతీయుల జీవితాల్లో మరింత ఉత్తేజం, ఉత్సాహం నింపేందుకు కృషి చేస్తున్నాం" అని మోదీ పేర్కొన్నారు. మోదీ ఈ ఏడాది మే 30వ తేదీన రెండోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు.

### వలపు వలలో నేతల విలవిల

బెంగళూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఒకరు ఇద్దరు కాదు! 20 మందికిపైగా ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు! 'వలపు వల'లో చిక్కుకుపోయారు. బయటపడ లేక, బయటపడితే ఏమవుతుందో తెలియక విలవిల్లాడుతున్నారు. కర్ణాటక రాజకీయాల్లో ఇదే ఇప్పుడు 'హాట్ టాపిక్! అందమైన యువతులను ఎరవేసి మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలను 'హనీట్రాప్'లోకి లాగుతున్నట్టు సిటీ క్రైం బ్రాంచ్ పోలీసులు గుర్తించా రు. ఇటీవల 2, 3 ఉదంతాలు బయటపడటంతో పోలీసులు లోతుగా దర్యాప్తు జరిపారు. ఆయా నియోజకవర్గాల్లో రాజకీయ ప్రత్యర్థులే లక్ష్యంగా వలపు వల విసురుతున్నారని, ఆగస్టు నుంచే ఈ 'వేట' సాగుతోందని తేలింది. ఈ ఉచ్చులో నలుగురు ఎమ్మెల్యేలు, ఆరుగురు మాజీ మంత్రులు చిక్కుకున్నట్టు తొలుత భావించారు. కానీ 20 మందికిపైగా ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు ఉండొచ్చని అనుమానిస్తున్నారు. తొలుత నేతకు అప్తుడైన వ్యక్తికి దగ్గరై.. తర్వాత అసలు 'టార్గెట్'ను బుట్టలోకి దించుతారు. ఓ ఎమ్మెల్యేను హనీట్రాప్‌లో ఇరికించేందుకు ఓ బుల్లితెర నటిని రంగంలోకి దించారని తెలుస్తోంది. ఆమెకు రూ.10 లక్షలు చెల్లిస్తామని చెప్పి రూ.లక్ష మాత్రమే చెల్లించడంతో వ్యవహారం బయటకు వచ్చింది.

### రాత్రి వేళ అగ్ని-3 పరీక్ష



బాలాసోర్(ఒడిసా), నవంబరు 30: భారత రక్షణ వ్యవస్థ అమ్ముల పొదిలోని అణు సామర్థ్యం కలిగిన కీలక అగ్ని-3 క్షిపణిని రక్షణశాఖ శనివారం ప్రయోగాత్మకంగా పరీక్షించింది. ఒడిసాలోని బాలాసోర్‌లోని ఏపీజే అబ్దుల్ కలాం టెస్ట్ రేంజ్ నుంచి శనివారం రాత్రి 7:20 గంటలకు దీన్ని ప్రయోగించినట్టు రక్షణ శాఖ తెలిపింది. తొలిసారిగా రాత్రి వేళ ఈ పరీక్షను నిర్వహించడం విశేషం. ఈ క్షిపణి ఉపరితలం నుంచి ఉపరితలంపై 3500 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను సైతం అలవోకగా ఛేదించగలదు. కాగా, భారత నావికాదళం తేలికపాటి యుద్ధ విమానం తేజ్‌ను శుక్రవారం విజయవంతంగా ప్రయోగించింది.

### మహారాష్ట్రలో ఇద్దరు నక్సల్స్ హతం

గడ్చిరోలి, నవంబరు 30: ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు నక్సల్స్‌ను పోలీసులు హతమార్చారు. మహారాష్ట్రలో గడ్చిరోలి జిల్లాలోని అబూజమడ్ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాలు శనివారం నక్సల్స్ శిబిరంలో ప్రవేశించడంతో ఇరు వర్గాల మధ్య కాసేపు కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఇద్దరు నక్సల్స్ హతమయ్యారు. దీంతోపాటు వారి శిబిరాన్ని కూడా బలగాలు ధ్వంసం చేశాయి.



## అగ్నిమాపక రోబోలు!

కోల్‌కతా, నవంబరు 30: ఫొటోలో కనిపిస్తున్నది అగ్నిమాపక సేవలు అందించే రోబో!! ఇటువంటి 4 అత్యాధునిక రోబోలు, 2 డ్రోన్లు జనవరికల్లా పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతా అగ్నిమాపక విభాగానికి అందుబాటులోకి రానున్నాయి. ఇరుకు వీధులు, అగ్నిమాపక వాహనాలు, సిబ్బంది వెళ్లలేని ప్రదేశాలనూ ఇవి సునాయాసంగా చేరుకోగలవు. థర్మల్ కెమెరాలతో చిమ్మచీకట్లోనూ పరిసరాలను పసిగట్టి జలప్రయోగం చేసి మంటలు ఆర్పగలవు. 80 మీటర్ల దూరం నుంచీ నీళ్లను వెదజల్లగల సామర్థ్యం ఈ రోబోల సొంతం.



## పులి కాదు.. కుక్కనే!

శివమొగ్గ, నవంబరు 30: పులిని చూసి నక్క వాత పెట్టుకున్నదన్న సామెత గుర్తుందా! ఇక్కడ నక్క కాదు.. కుక్క వాత పెట్టుకుంది. కర్ణాటకలో శ్రీకాంత గౌడ అనే రైతు కోతుల బారి నుంచి తన పంటను రక్షించుకునేందుకు పెంపుడు కుక్కకు ఇలా పులి చారలు వేశాడు. నాలుగేళ్ల క్రితం కోతులు తోటను పాడు చేస్తుండటంతో అక్కడ ఓ పులి బొమ్మను పెట్టాడు. కోతులు రావడం మానేశాయి. తర్వాత మరోచోట ఇలాగే చేశాడు. అక్కడికీ కోతులు రాలేదు. దీంతో తన కుక్కనే పులిగా మార్చేశాడు. రంగులు వేస్తే చర్మం పాడవుతుందని హెయిర్ డై వేస్తున్నాడు.



## హెల్మెట్ ధరించి ఉల్లి విక్రయం!

పట్నా, నవంబరు 30: హెల్మెట్ ధరించి ఉల్లిగడ్డలు విక్రయిస్తున్న వ్యాపారస్తులు. ఉల్లి ధర రూ.100కు చేరుకుంది. దీంతో ప్రజాగ్రహానికి భయపడిన విక్రయదారులు ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. బిహార్‌లో ఏకంగా హెల్మెట్ ధరించి ఉల్లిగడ్డలు విక్రయిస్తున్నారు. బిహార్ రాష్ట్ర సహకార మార్కెటింగ్ యూనియన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో తక్కువ ధరకు ఉల్లిగడ్డలు విక్రయించారు. ఈ సందర్భంగా ప్రజలు భారీ క్యూ కట్టారు. వాళ్లు ఎగబడతారని, తమపై దాడి చేస్తారని భావించిన అధికారులు హెల్మెట్‌లు ధరించాలని సూచించారు.



## జార్ఖండ్ తొలిదశలో 65% పోలింగ్

జార్ఖండ్ అసెంబ్లీకి జరిగిన తొలిదశ ఎన్నికల్లో 64.72% పోలింగ్ నమోదైంది. మొత్తం 81 స్థానాలకు ఐదు దశల్లో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించిన ఈసీ శనివారం తొలిదశలో 6 జిల్లాల్లోని 13 స్థానాలకు ఎన్నికలు నిర్వహించింది. వీటిలో మెజారిటీ స్థానాలు మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో ఉన్నాయి. చెదురుమదురు హింసాత్మక ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ కేంద్రంలో కాంగ్రెస్ అభ్యర్థి కేఎన్ త్రిపాఠిపై బీజేపీ మద్దతుదారులు రాళ్లు రువ్వడంతో ఆయన తుపాకీ తీసి బెదిరించారు. ఓ కల్వర్టును మావోయిస్టులు పేల్చివేశారు.

\- రాంచీ

## నేరస్తుడికి పోలీసు వలపు వల!

భోపాల్, నవంబరు 30: యూపీకి చెందిన బాలకిషన్ చౌబే ఓ కరడుగట్టిన నేరస్తుడు. అతనిపై హత్య సహా 16 కేసులు ఉన్నాయి. పోలీసులకు ఎంతకీ దొరకడం లేదు. దీంతో పోలీసులు అతడిపై వలపు వల పన్నారు. ఏకంగా ఓ మహిళా ఎస్ఐ ఫోన్ చేసి 'నిన్ను పెళ్లి చేసుకుంటా' అని చెప్పారు. వారం రోజులు లైన్‌లో పెట్టిన తర్వాత మధ్యప్రదేశ్ లోని బిజౌరీ లో ఓ గుడిలో పెళ్లి చేసుకుందామని ఆమె అనడంతో బాలకిషన్ చక్కగా ముస్తాబై ఎన్నో ఆశలతో వచ్చాడు. ఆ మహిళా ఎస్ఐ అదుపులోకి తీసుకున్నారు.



షాద్ నగర్ పోలీస్‌స్టేషన్ వద్ద గుమిగూడిన నిరసనకారులను చెదరగొడుతున్న పోలీసులు



# ప్రజాగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

ఆనోటా ఈనోటా తెలిసింది. తొలుత ఓ పదిమంది వచ్చారు! దాదాపు గంట వ్యవధిలోనే.. కార్మిక, విద్యార్థి, ఉద్యోగ, వివిధ పార్టీల నాయకులు, మహిళలు, యువకులు ఒక్కొక్కరుగా పోలీసు స్టేషన్‌కు తరలి వచ్చారు. పది మందితో ప్రారంభమైన ఆందోళన వేలాదిమందికి చేరింది. నిందితులను కోర్టులో హాజరుపరిచి శిక్ష కోసం కాలయాపన చేయవద్దని, నరరూప రాక్షసులైన వారిని కొట్టి చంపడమే సరైన న్యాయమంటూ ఆందోళనకు దిగారు. వారిని కోర్టులో హాజరుపరచడానికి వీల్లేదని, తమకు అప్పగించాలంటూ పలుమార్లు పోలీస్ స్టేషన్‌లోకి చొచ్చుకుని పోవడానికి ప్రయత్నించారు. పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. 'ఆ దుర్మార్గులను ఐదు నిమిషాలు వదలండి. మా శక్తి ఏమిటో చూపిస్తాం' అంటూ మహిళలు పెద్దపెట్టున నినదించారు. తప్పు చేస్తే శిక్ష తప్పదన్న భయం ప్రతి ఒక్కరిలో రావాలని, ఇందుకు నిందితులకు వెంటనే ఉరిశిక్ష అమలు చేయాలని డిమాండ్ చేశారు. 'మాకు న్యాయం కావాలి', 'నిందితులను కఠినంగా శిక్షించాలి' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు.




ప్రియాంకారెడ్డి హత్యకు నిరసనగా విజయవాడలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థినుల ప్రదర్శన

### పలుమార్లు లాఠీచార్జి

డాక్టర్ ప్రియాంకను అతి కిరాతకంగా హతమార్చిన మానవ మృగాలైన ఆ నలుగురినీ ప్రజల సమక్షంలోనే ఎన్‌కౌంటర్ చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. పోలీసులకు చట్టాలు అడ్డు వస్తే వారిని తమకు అప్పగించాలని, ఇక్కడే నడి రోడ్డుపై కొట్టి చంపుతామని భీష్మించారు. కామపిశాచుల్లా వ్యవహరిస్తున్న శాడిస్టుల కారణంగా మహిళలు ఒంటరిగా తిరగలేకపోతున్నారని, అభద్రతా భావంతో క్షణక్షణం భయం భయంతో బతకాల్సి వస్తోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. షాద్‌నగర్ ఏసీపీ సురేందర్, సీఐ శ్రీధర్‌కుమార్ ఎంత చెప్పినా ఆందోళనకారులు వినిపించుకోలేదు. చివరికి, శంషాబాద్ డీసీపీ ప్రకాశ్ రెడ్డి సైతం వచ్చి పలుమార్లు విజ్ఞప్తి చేసినా జనం పట్టించుకోలేదు. వేలాదిగా తరలి వచ్చిన వారంతా ఒకే నినాదం వినిపించారు. నిందితులను తమకు అప్పగించాల్సిందేనంటూ ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ ఏకంగా ఎనిమిది గంటలపాటు ఆందోళన చేశారు. దాంతో, అక్కడ పరిస్థితి తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. ఆందోళనకారులు ముందుకు రాకుండా పోలీసులు తాళ్లు కట్టారు. బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆందోళనకారులు వాటిని తొలగించడానికి ప్రయత్నించారు. పోలీస్ స్టేషన్‌లోకి చొచ్చుకుపోయి నిందితులపై దాడి చేయడానికి విఫల యత్నం చేశారు. పోలీసులపై చెప్పులు విసరడం వంటి ఘటనలతో పోలీసులు పలుమార్లు లాఠీచార్జీ చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు. ఈ సందర్భంగా పోలీసులు, ఆందోళనకారులకు మధ్య తోపులాట జరిగింది. పోలీసు స్టేషన్ పరిసరాలు రణరంగాన్ని తలపించాయి. ఆందోళన ఉధృతం కావడంతో పోలీసులు సైతం సంయమనం పాటిస్తూనే అదుపు చేయడానికి తీవ్ర ఇబ్బంది పడాల్సి వచ్చింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అదనపు బలగాలను రప్పించారు. స్టేషన్ వద్ద వాతావరణం వేడెక్కడంతో వ్యాపారులు దుకాణాలను మూసివేశారు.

### పోలీసు స్టేషన్‌కు బేడీలు

బేడీలు పోలీసు స్టేషన్లో ఉంటాయి. వాటిని నిందితులు, నేరగాళ్లకు వేస్తారు. కానీ, ఏకంగా పోలీసు స్టేషన్‌కే బేడీలు వేయడాన్ని ఎప్పుడైనా చూశారా!? రాష్ట్ర చరిత్రలోనే ఈ ఘటన షాద్‌నగర్‌లో జరిగింది. స్టేషన్ బయట వందలాదిగా ఆందోళనకారులు చేరారు. పరిస్థితి తీవ్ర ఉద్రిక్తంగా మారింది. వారంతా లోనికి చొచ్చుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. దాంతో, పోలీసులు అప్రమత్తమయ్యారు. గేటును మూసి దానికి బే డీ ల తో తాళం వేశారు. ఇనుప చైన్లను కట్టారు. చిన్న గేటును కూడా తాడుతో కట్టి జాగ్రత్త పడ్డారు.

### స్టేషన్లోనే వైద్య పరీక్షలు..

నిందితులను కోర్టుకు తరలించడానికి ముందు వైద్య పరీక్షలు చేయించారు. తొలుత ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లి వైద్యులతో వారి మానసిక పరిస్థితి గురించి ధ్రువీకరణ చేసుకోవాల్సి ఉంటుంది. అయితే, ఆందోళన ఉద్రిక్తంగా మారడంతో నిందితులను ఆస్పత్రికి తీసుకెళ్లే పరిస్థితి కనిపించలేదు. దాంతో, షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ బృందాన్ని పూర్తి బందోబస్తు మధ్య స్టేషన్‌కు తీసుకొచ్చారు. అక్కడే వారు వైద్య పరీక్షలు నిర్వహించారు.

### వ్యాన్ సీట్ల మధ్య కూర్చోబెట్టి..

. భారీ బందోబస్తు మధ్య నిందితులను జైలుకు తరలించారు. నిందితులను బయటకు తీసుకొస్తే ఆందోళనకారులు దాడి చేసి వారిని చంపేస్తారన్న ఆలోచనతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రత్యేక పోలీసు వాహనాలను రప్పించారు. నాలుగు వాహనాలను స్టేషన్ ఆవరణలోకి తీసుకెళ్లారు. వాటిని ఒకే వరుసలో నిల్చోబెట్టి, ఆ వాహనాల వెనక, ముందు పోలీసు వాహనాలను పెట్టారు. ఎవరు ఏ వాహనంలో ఉన్నారో తెలియకుండా నలుగురు నిందితులను నాలుగు వాహనాల్లో ఎక్కించారు. బయట ఎవరికీ కనిపించకుండా వ్యాన్లలో సీట్ల మధ్య కింద కూర్చోబెట్టి తీసుకెళ్లారు. అయినా ఆందోళనకారులు వారున్న వాహనాలను చుట్టుముట్టడంతో అతి కష్టం మీద నిందితులను చర్లపల్లి జైలుకు తరలించారు.

**రిమాండ్ కూడా స్టేషన్లోనే**

వైద్య పరీక్షల తర్వాత నిందితులను కోర్టులో హాజరు పరచాల్సి ఉంటుంది. అయితే, మహబూబ్‌నగర్‌లో న్యాయవాదులకు సంబంధించిన ఓ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి పాల్గొన్నారు. దానికి షాద్‌నగర్ న్యాయమూర్తులు వెళ్లారు. దాంతో, ఉన్నతాధికారుల సూచన మేరకు ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అయిన ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ ముందు బైండోవర్ చేయాలని నిర్ణయించారు. కానీ, తహసీల్దార్ కార్యాలయానికి నిందితులను తీసుకెళ్లేందుకు కూడా వీలు కాలేదు. దాంతో, పూర్తిస్థాయి బందోబస్తు మధ్య షాద్‌నగర్ తహసీల్దార్ (మండల మేజిస్ట్రేట్) పాండునాయక్‌నే పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఆయన ముందు నిందితులను బైండోవర్ చేశారు. తహసీల్దార్‌కు కోర్టు సిబ్బంది సహకారం అందించారు. నిందితులకు 14 రోజులపాటు రిమాండ్ విధిస్తున్నట్లు తహసీల్దార్ ఆదేశించారు.

## నా దేశంలో నాకు భద్రత లేదే?

న్యూఢిల్లీ, నవంబరు 30: ప్రియాంక రెడ్డి ఘటన దేశ రాజధానినీ కదిలించింది. ప్రజాస్వామ్యానికి ప్రతీక అయిన పార్లమెంట్ వద్ద 20 ఏళ్ల యువతి అనూదూబే ఒంటరి పోరాటం చేపట్టింది. " నా భారత దేశంలో నాకు భద్రత ఉందనే భావన నాకు ఎందుకు రావడంలేదు?" అన్న నినాదంతో ప్లకార్డు పట్టుకొని పార్లమెంట్ 2,3 గేట్ల వద్ద నిరసన వ్యక్తం చేసింది. అయితే, అక్కడ నిరసన వ్యక్తం చేయడానికి వీల్లేదని, జంతర్ మంతర్ వద్దకు వెళ్లాలని పోలీసులు చెప్పినా ఆమె తిరస్కరించింది. దీంతో అనూదూబేను పోలీసులు అదుపులోకి తీసుకుని పార్లమెంట్ స్ట్రీట్ పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. తర్వాత వదిలేశారు. అయితే, అక్కడ తన పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించారని అనూదూబే ఆరోపించారు. తనను పోలీసులు కొట్టారని ఆమె పేర్కొన్నారు. దీనిపై ఢిల్లీ మహిళా కమిషన్ అధ్యక్షురాలు స్వాతి మలివాల్ స్పందించారు. ఒంటరి యువతి పట్ల పోలీసులు అసభ్యంగా ప్రవర్తించారని ఆరోపించారు. దీనిపై వివరణ ఇవ్వాలంటూ ఢిల్లీ పోలీసులకు నోటీసులిచ్చారు. తాను పోలీసు స్టేషన్‌కు వెళ్లి అనూదూబేను కలిశానని, భయపడిపోయిన ఆమెను ఓదార్చానని చెప్పారు. " హైదరాబాద్‌లో దారుణ అత్యాచారం జరిగినందుకు ఓ మహిళ నిరసన వ్యక్తం చేయాలనుకుంది. కానీ ఢిల్లీ పోలీసులు ఆమెను నిర్బంధించి కొట్టారు" అని స్వాతి ఆరోపించారు. ఓ మహిళకు అన్యాయం జరిగితే నిరసన వ్యక్తం చేసే హక్కుకూడా లేదా అని పశ్నించారు. అయితే స్వాతి ఆరోపణలను పోలీసులు ఖండించారు.

## నాకు గన్ లైసెన్స్ ఇవ్వండి

- ఇంట్లోంచి బయటకు వెళ్లాలంటే భయమేస్తోంది
- వరంగల్ సీపీకి ప్రభుత్వ మహిళా లెక్చరర్ విజ్ఞప్తి

హైదరాబాద్, వరంగల్ అర్బన్ క్రైం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తనకు గన్ లైసెన్స్ ఇవ్వాలంటూ పోలీసులకు ఓ మహిళా లెక్చరర్ విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో ప్రియాంక, వరంగల్‌లో మానస హత్యాచార ఘటనల తర్వాత తనకు ఇంట్లోంచి బయటకు వెళ్లాలంటేనే భయం వేస్తోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఆయుధాల చట్టం-1959 ప్రకారం తనకు గన్ లైసెన్స్ మంజూరు చేయాలంటూ వరంగల్ సీపీ వి.రవిందర్‌కు ఆమె మెయిల్ ద్వారా దరఖాస్తు చేశారు. ఉద్యోగరీత్యా తాను ప్రతి రోజూ వరంగల్ నుంచి ఖమ్మం జిల్లాకు ఒంటరిగా ప్రయాణం చేయాల్సివస్తోందని, తెల్లవారు జామున ఇంట్లోంచి వెళితే, తిరిగొచ్చేసరికి రాత్రవుతోందని అర్జీలో పేర్కొన్నారు. "ఆపద సమయంలో 'డయల్-100'కు ఫోన్ చేసినా, మొబైల్ యాప్ ద్వారా సాయం కోరినా.. వెంటెనే మీరొచ్చి రక్షిస్తారనే నమ్మకం నాకేమాత్రం లేదు" అంటూ లేఖలో నిర్మొహమాటంగా చెప్పారు. నౌషీన్ ఫాతిమా అనే ప్రభుత్వ అధ్యాపకురాలిదీ విజ్ఞాపన!! ఒకవేళ.. గన్ లైసెన్స్ ఇవ్వని పక్షంలో ఉద్యోగం మానేసి తాను ఇంట్లోనే ఉండిపోతానని తేల్చి చెప్పారు. "ఈనెల 28న మానస హత్య జరిగిన ప్రాంతమైన హంటర్ రోడ్డులోని విష్ణుప్రియ గార్డెన్స్ మా ఇంటికి దగ్గర్లోనే ఉంది. నేను ప్రతిరోజూ అదే మార్గంలో వెళ్తాను. మానస హత్యాచార వార్త చదివినప్పటి నుంచి నేను ఇంటికి సురక్షితంగా వస్తానా? అన్న భయం వెంటాడుతోంది. అత్యవసర పరిస్థితుల్లో '100'కు ఫోన్ చేసినా, మొబైల్ యాప్ ద్వారా తక్షణ సహాయం కోరినా.. వెంటనే పోలీసులు ప్రత్యక్షమై రక్షిస్తారని నేను నమ్మడం లేదు. ఆపదలో నన్ను నేను కాపాడుకోలేనప్పుడు నా ఉన్నత చదువులు, రాజ్యాంగం ప్రసాదించిన జీవించే హక్కుకు విలువే ఏముంటుంది?' అని దరఖాస్తులో పేర్కొన్నారు. దీనిపై సీపీని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరింది. మెయిల్ ద్వారా ఈ దరఖాస్తు చేశారని ఆయన చెప్పారు. వరంగల్‌లో నివసిస్తున్నట్లు పేర్కొన్నా.. ఎక్కడో అడ్రస్ చెప్పలేదని, ఫోన్‌లో కూడా ఆమె మాట్లాడలేదన్నారు. అయినా గన్ లెసెన్స్ కావాలనుకున్నవారు ఇలా మెసేజ్‌లు చేయరని, ప్రచారం కోసం ఆకతాయిలు ఇలా చేసే అవకాశముందని అన్నారు.

## నడిరోడ్డుపై ఉరి తీయాలి: రోజా

### మృగాళ్ల నుంచి అప్రమత్తంగా ఉండాలి: వనిత

పుత్తూరు, భీమవరం అర్బన్, నవంబరు 30: ఆడపిల్లలను మానభంగం చేసి హత్యచేసే కామాంధులను నడిరోడ్డుపై ఉరి తీయాలని ఓ ఆడపిల్ల తల్లిగా కోరుతున్నానని ఎమ్మెల్యే రోజా అన్నారు. హైదరాబాద్‌లో వెటర్నరీ వైద్యురాలు ప్రియాంకరెడ్డిపై జరిగిన హత్యాచారంపై ఆమె శనివారం స్పందించారు. సాయంత్రం ఆరుగంటలైతే ఇంటికి చేరుకోవాలని ఆడపిల్లలను ఆదేశించాల్సి వస్తోందన్నారు. కోర్టులు ఇలాంటి విషయాల్లో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి నిందితులకు బహిరంగంగా ఉరిశిక్ష వేయాలని కోరారు. మహిళలు సమాజంలో తమ చుట్టూ ఉన్న తోడేళ్లలాంటి మృగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని స్త్రీ శిశు, సంక్షేమ శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. మహిళలు, పిల్లల సంక్షేమానికి ప్రభుత్వ కట్టుబడి ఉందని, స్త్రీ ప్రగతికి విద్య దోహదం చేస్తుందని చెప్పారు.




విజయవాడలోని లెనిన్ సెంటర్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన

## వైసీపీ ప్రభుత్వంలో రక్షణ కరువు

### టీడీపీ అధికార ప్రతినిధి పంచుమర్తి

విజయవాడ, నవంబరు 30: వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని, ఇది అత్యాచారాల ప్రభుత్వమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పంచుమర్తి అనురాధ విమర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్న అత్యాచార కేసుల్లో ఎక్కువ శాతం వైసీపీ మద్దతుదారులే ముద్దాయిలని ఆమె ఆరోపించారు. ఇటీవలి కాలంలో.. ప్రకాశంజిల్లా కారంచేడులో యువతిపై, అనంతపురం గుత్తిలో 14ఏళ్ల బాలికపై, అనంతపురంలో ఇంటర్ విద్యార్థినిపై, మచిలీపట్నం ఓగిసుపేటలో 13ఏళ్ల బాలికపై, కాకినాడలో యువతిపై, అనంతపురంలో 6ఏళ్ల చిన్నారిపై, విజయవాడ రైల్వే స్టేషన్ సమీపంలో బాలికపై, ప్రకాశం జిల్లా ఒంగోలులో బాలికపై, తూర్పుగోదావరి జిల్లాలో బాలికపై అత్యాచారాలు జరిగాయన్నారు. ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా సీఎం జగన్ చర్యలకు ఆదేశించరేమని మండిపడ్డారు.

## మత్స్యకార సొసైటీ ఎన్నికల్లో 'తెలుగుదేశం' గెలుపు

### ప్రభుత్వ వ్యతిరేకతకు నిదర్శనమని వెల్లడి

**6 టీడీపీ**

**2 వైసీపీ**

కాకినాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చి ఆరు నెలలే అయ్యింది. అందునా... మత్స్యకారుల వేట విరామ సమయంలో పరిహారం పెంపు, ప్రమాదవశాత్తూ మృతి చెందితే వారి కుటుంబానికి రూ.10 లక్షల వంటి వరాలనూ ప్రభుత్వం ప్రకటించింది. అయినా సరే... ఒక మత్స్యకార సొసైటీ ఎన్నికలో టీడీపీ మద్దతుదారులు ఘన విజయం సాధించారు. ఈనెల 27న తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేట నియోజకవర్గం పరిధిలోని కాట్రావులపల్లి మత్స్యకార సొసైటీ ఎన్నిక జరిగింది. మొత్తం 9 మంది డైరెక్టర్లను ఎన్నుకోవాలి. నిజానికి... ఇది పార్టీ గుర్తుతో జరిగే ఎన్నిక కాదు. అయినప్పటికీ... వైసీపీ, టీడీపీ నేతలు దీనిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఆ పార్టీల మద్దతుదారులే రంగంలోకి దిగారు. బ్యాలెట్ పేపర్ విధానంలో సీక్రెట్ ఓటింగ్ నిర్వహించారు. 389 ఓట్లకుగాను 359 పోలయ్యాయి. టీడీపీ మద్దతుదారులు ఆరు స్థానాలు దక్కించుకున్నారు. వైసీపీ మద్దతుదారులకు రెండు మాత్రమే దక్కాయి. మరో డైరెక్టర్ స్థానం ఫలితం టై అయింది. దీంతో ఎన్నికల అధికారి ఇరువర్గాల మధ్య ఒప్పందం కుదిర్చి బొమ్మాబొరుసు వేశారు. అందులోనూ టీడీపీ మద్దతుదారుడు విజయం సాధించారు. దీంతో 9 డైరెక్టర్ స్థానాల్లో ఏడింటిని టీడీపీ గెలుచుకున్నట్లయింది. ప్రభుత్వం మత్స్యకారులకు ప్రకటించిన వరాలు తమ విజయానికి దోహదపడలేని వైసీపీ మద్దతుదారులు నిట్టూర్చారు. మత్స్యకారులు ఇప్పటికీ తమవైపే ఉన్నారని, ప్రభుత్వంపై సామాన్యుల్లో వ్యతిరేకతకు ఈ ఎన్నిక నిదర్శనమని టీడీపీ స్థానిక నేతలు పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో పోరుకు ఇది టానిక్‌లాంటిదని సంతోషం వ్యక్తం చేశారు.



## పర్యావరణంపై కదిలిన జనం

పర్యావరణాన్ని పరిరక్షించాలని, భూతాపాన్ని నివారించాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది వీధుల్లోకి వచ్చారు. పర్యావరణంపై అగ్రరాజ్యాల నేతలను నిలదీసిన టీనేజర్ గ్రెటా థన్‌బెర్గ్‌ను స్ఫూర్తిగా తీసుకుని బెర్లిన్‌లో 'ఫ్రైడే ఫర్ ఫ్యూ చర్' నిరసన ర్యాలీ చేపట్టారు. జర్మనీలోని 500 నగరా ల్లో 6.3 లక్షల మంది ఈ ప్రదర్శనల్లో పాల్గొన్నారని ఫ్రైడే ఫర్ ఫ్యూచర్ ఉద్యమ నిర్వాహకులు తెలిపారు. ఉద్గారాలను తగ్గించి, పర్యావరణాన్ని పరిరక్షించే లక్ష్యంతో 12 రోజుల 'కాప్-25' సదస్సు వచ్చే వారం ఈ నగరంలోనే ప్రారంభం కానుంది.

## నిందితులను పట్టించింది ప్రియాంకే

### స్కూటీ పంక్చర్ వేయిస్తామన్న ఆరీఫ్ ఫోన్ నంబర్ తీసుకున్న యువతి

- ఎంతకీ రాకపోవడంతో పావుగంట తర్వాత ఫోన్
- తన వాహనం ఇంకా రాలేదేమని ఆరా.. ఆమె ఫోన్ నుంచి చివరి ఫోన్ కాల్ ఇదే
- పోలీసుల దర్యాప్తుకు కీలక ఆధారమూ ఇదే.. దాని ఆధారంగానే నిందితుల పట్టివేత

(ఆంధ్రజ్యోతి రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

డాక్టర్ ప్రియాంక ముందు జాగ్రత్తే ఈ కేసులో నిందితులను పట్టించింది! కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే పోలీసులు నిందితులను పట్టుకోవడానికి ఆధారంగా నిలిచింది. ఈ కేసు మిస్టరీని ఛేదించేందుకు ఆమె మొబైల్ కీలకంగా మారింది. ప్రియాంక తిరిగి రాగానే.. 'మేడమ్.. మీ స్కూటీ పంక్చర్ పడింది. మేం సహాయం చేస్తాం' అని మొదటి ముద్దాయి ఆరీఫ్ నమ్మబలికిన విషయం తెలిసిందే. వద్దని వెళ్లిపోతున్నా వెంటపడడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆమె వారికి వాహనం ఇచ్చింది. ఈ క్రమంలోనే.. వాహనాన్ని వాళ్లు తిరిగి తీసుకురాకపోతే ఎలా అనే అనుమానంతో ఆమె ఆరీఫ్ ఫోన్ నంబర్ తీసుకుంది. వాళ్లు వాహనం తీసుకెళ్లారు. ఆమె తన సోదరితో మాట్లాడింది. పావు గంట అయినా తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చి ఆరీఫ్‌కు ఫోన్ చేసింది. తన వాహనం ఏదీ అని అడిగింది. ఇదే ఆమె ఫోన్ నుంచి చివరి కాల్. ఇదే పోలీసులకు కీలక ఆధారంగా మారింది. ప్రియాంక ఫోన్ 9.48 గంటలకు స్విచ్ఛాఫ్ అయింది. ఆమె తన సోదరితో మాట్లాడిన తర్వాత మరొకరికి ఫోన్ చేసినట్లు దర్యాప్తులో భాగంగా పోలీసులు గుర్తించారు. అది ఎవరిదని ఆరా తీశారు. ఫోన్ నంబర్ ఆధారంగా లారీ డ్రైవర్ ఆరిఫ్‌ను గుర్తించారు. లారీలో తనిఖీ చేయగా, రక్తపు మరకలు, ఇతర ఆధారాలు దొరికాయి. వెంటనే, ఆరిఫ్ ఇంటికి వెళ్లి అతనిని అదుపులోకి తీసుకున్నారు. అతనిని విచారణ చేయగా.. అసలు విషయం బయటపడింది.

ఆంధ్రజ్యోతి

స్పోర్ట్స్

విజయవాడ ● ఆదివారం 1 డిసెంబరు 2019



## సిగ్గుపడాల్సిన ఘటన: విరాట్ కోహ్లీ

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పశు వైద్యురాలు ప్రియాంక రెడ్డి హత్యాచార ఘటనపై టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ స్పందించాడు. ఇది సిగ్గుపడాల్సిన ఘటన అని ట్వీట్ చేశాడు. 'హైదరాబాద్‌లో ఇలాంటి ఘటన జరగడం ఎంతో సిగ్గుచేటు. మనం బాధ్యత తీసుకొని ఇలాంటి అమానవీయ చర్యలకు ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైంది' అని విరాట్ ట్విటర్‌లో తెలిపాడు.



డేవిస్‌కప్‌లో 44వ డబుల్స్ విజయంతో లియాండర్ ప్రపంచ రికార్డు పటిష్టం

# వారెవ్వా.. పేస్

- వరల్డ్ గ్రూప్ క్వాలిఫయర్స్‌కు భారత
- 4-0తో మట్టికరిపించిన పాక్

**నూర్-సుల్తాన్:** డేవిస్ కప్‌లో భారత వెటరన్ లియాండర్ పేస్ అరుదైన ఘనతను అందుకున్నాడు. డబుల్స్‌లో 44వ విజయంతో టోర్నీ చరిత్రలో అత్యధిక విజయాలు సాధించిన ఆటగాడిగా తన రికార్డును మరింత పటిష్ఠం చేసుకున్నాడు. గతేడాది చైనాతో పోరులో 43వ గెలుపుతో లియాండర్.. డేవిస్ కప్‌లో అత్యధిక విజయాలు సాధించిన డబుల్స్ ఆటగాడిగా ఇటలీ దిగ్గజం పిట్రాంజెలి (66 మ్యాచ్‌ల్లో 42 విజయాలు) రికార్డును అధిగమించిన సంగతి తెలిసిందే. తాజాగా పాకిస్థాన్‌పై గెలుపుతో పేస్ తన రికార్డును మరింత మెరుగుపరచు కున్నాడు. డేవిస్ కప్ ఆసియా/ఓసియానియా పోరులో భాగంగా పాకిస్థాన్‌తో శనివారం జరిగిన డబుల్స్ మ్యాచ్‌లో పేస్-జీవన్ నెడుంజెళియన్ జోడీ 6-1, 6-3తో మహమ్మద్ షోయబ్-హుఫైజ్ అబ్దుల్ రహ్మాన్ జంటను చిత్తు చేసింది. దీంతో పాకిస్థాన్‌ను 4-0తో మట్టికరిపించిన భారత్.. వచ్చే ఏడాది జరగనున్న డేవిస్ కప్ ప్రపంచ గ్రూప్ క్వాలిఫయర్స్‌కు అర్హత సాధించింది. తొలిరోజు రెండు సింగిల్స్‌ను నెగ్గి 2-0తో ఆధిక్యంలో నిలిచిన భారత్.. శనివారం డబుల్స్ విజయంతో మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. దీంతో 3-0తో భారత్ విజయం ఖరారవడంతో తర్వాత జరగాల్సిన రెండు రివర్స్ సింగ్స్ మ్యాచ్‌లు నామమాత్రంగా మరాయి. నాలుగో మ్యాచ్‌లో సుమీత్ నగాల్ 6-1, 6-0తో యూసుఫ్ ఖలీల్‌ను ఓడించాడు. అనంతరం



ఇరు జట్లూ చర్చించుకొని ఐదో మ్యాచ్ ఆడకూడదని నిర్ణయించుకున్నాయి. దీంతో రామ్‌కుమార్ రామనాథన్-హుజైఫా అబ్దుల్ రహ్మాన్ మధ్య మ్యాచ్ జరగలేదు. ఈ విజయాన్ని భారత ఆర్మీకి అంకితమిస్తున్నట్టు భారత జట్టు నాన్‌ప్లేయింగ్ కెప్టెన్ రోహిత్ రాజ్‌పాల్ చెప్పాడు. పాక్‌పై గెలుపుతో వచ్చే ఏడాది మార్చి 6-7 తేదీల్లో జరిగే క్వాలిఫయర్స్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ క్రొయేషియాతో భారత్ తలపడనుంది. డేవిస్ కప్ ఫైనల్స్ కోసం అందుబాటులో ఉన్న 12 క్వాలిఫయర్ బెర్త్‌ల కోసం 24 జట్లు పోటీపడనున్నాయి. ఇందులో ఓడిన 12 జట్లు వరల్డ్ గ్రూప్-1లో ఆడతాయి. గెలిచిన ఆరు దేశాలు.. 2019 సెమీఫైనలిస్టులు కెనడా, బ్రిటన్, రష్యా, స్పెయిన్‌తోపాటు వైల్డ్‌కార్డ్ ఎంట్రీలైన ఫ్రాన్స్, సెర్బియాతో జత కలుస్తాయి.

ఓవైపు మైదానంలో అబ్బాయిలతో కలిసి ఆడపిల్ల సాధన చేయడమేంటనే ప్రశ్నలతో దాడి చేసే బంధువులు.. హాకీ ఆడడానికి అవసరమైన స్టిక్, కాళ్లకి బూట్లు, సరైన దుస్తులు కూడా లేని దీనస్థితి మరోవైపు.. ఇక, తండ్రి మెకానిక్.. కుటుంబ నేపథ్యం పేదరికం.. అయినా, ఇలాంటి సవాళ్లను చూసి ఆమె చలించ లేదు. ప్రతికూల పరిస్థితులను చూసి తన లక్ష్యాన్ని మొగ్గలోనే తుంచేయలేదు. స్కూల్ స్థాయి నుంచి ఒక్కో మెట్టు ఎక్కుతూ జాతీయ హాకీ అకాడమీకి ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదిగింది. అకుంఠిత దీక్ష, పట్టుదలతో కఠోరంగా శ్రమించి హాకీలో మేటిగా అనిపించుకుంటున్న ఆ తెలుగమ్మాయి మేరీ.



మేరీ

# మెకానిక్ బిడ్డ హాకీలో దిట్ట

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి)

విశాఖపట్నం జిల్లా యలమంచిలికి చెందిన లొట్ల మేరీ (18) తండ్రి సంజీవ్‌రావు మోటార్ మెకానిక్. నాలుగో తరగతి నుంచే మేరీకి హాకీ అంటే ఇష్టం. సీనియర్లు స్కూల్ గ్రౌండ్లో హాకీ ఆడుతున్నారని తెలిస్తే చాలు ఎక్కడున్నా అక్కడికొచ్చి వాలిపోయేది. తానూ ఆడతానని వాళ్లని అడిగేది. ఒప్పుకోకుంటే పోట్లాడేది. కాళ్లకు బూట్లు లేకుండానే ఆడేది. హాకీ స్టిక్ ఉన్నవాళ్లు ఆడడం పూర్తయ్యాక వారిని బతిమిలాడి సాధన చేసేది. అలా యలమంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నప్పుడు మొదలైన మేరీ ప్రస్థానం 2013లో మలుపు తిరిగింది. జిల్లాస్థాయి పోటీల్లో సత్తాచాటడంతో మేరీ హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ నిర్వహించే సెలెక్షన్స్‌లో ఎంపికైంది. అందులో సీటు సంపాదించింది. అయితే, బంధువుల మాటలతో ఆమెను హైదరాబాద్ పంపడానికి తల్లిదండ్రులు తొలుత ఒప్పుకోలేదు. ఇల్లు గడవడమే గగనంగా ఉండే మనకు క్రీడలెందుకని ఆమెను ఇంటికే పరిమితం చేయడానికి ప్రయత్నించారు. కానీ మేరీ వారిని ఏదోలా ఒప్పించి హైదరాబాద్ చేరింది. ఇక్కడికి వచ్చాక పరిచయమైన స్నేహితులతో అనంతపురంలోని ఆర్డీటీ స్పోర్ట్స్ అకాడమీ గురించి తెలుసుకొంది. అందులో ప్రవేశం లభిస్తే కెరీర్‌లో ముందుకెళ్లడానికి అవకాశాలు బాగుంటాయని తెలిసి 2014లో వారు నిర్వహించిన సెలెక్షన్స్‌లో పాల్గొంది.

### ఆర్డీటీ అకాడమీలో తయారైన వజ్రం

ఆర్డీటీ నిర్వహించిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచి అందులో స్థానం సంపాదించింది. ఇక్కడ నుంచి మేరీ వెనుదిరిగి చూడలేదు. అకాడమీలో శిక్షణ తీసుకుంటు ఆంధ్ర జట్టుకు ఆడడం మొదలు పెట్టింది ఈ ఫార్వర్డ్ క్రీడాకారిణి. ఆమె వేగం, ఆడే తీరు, నాయకత్వ లక్షణాలు చూసి రాష్ట్ర జూనియర్ బాలికల జట్టుకు స్వల్ప కాలంలోనే కెప్టెన్‌గా ఎంపికైంది. తన నాయకత్వంలో మూడుసార్లు జాతీయ హాకీ జూనియర్ పోటీల్లో ఆంధ్రను చాంపియన్‌గా నిలిపింది. ఈ పోటీల్లో మేరీ ప్రతిభను గుర్తించిన ఎన్‌హెచ్‌ఏ ఆమెను అకాడమీలోకి తీసుకొంది. ఇక్కడ కోచ్‌లు చౌడీశ్వర్, అనిల్, కౌశిక్ ప్రోత్సాహంతో రాటుదేలింది. వారి సహాయంతో నేర్చుకున్న మెళకువలను ఆచరణలో పెట్టింది. 2017లో జరిగిన జాతీయ బి-డివిజన్ పోటీల్లో ఆంధ్ర జట్టును విజేతగా నిలిపింది. బిహార్‌తో జరిగిన ఫైనల్లో నిర్ణీత సమయం ముగిసేలోగా ఇరు జట్లు గోల్ చేయకపోవడంతో సడెన్ డెత్‌కు దారితీసింది. ఇందులో 5-4తో జట్టును గెలిపిచడంలో మేరీ కీలక పాత్ర పోషించింది. అదే ఏడాది జాతీయ జూనియర్ స్థాయి పోటీల్లో రాష్ట్రాన్ని మూడో స్థానంలో నిలిపింది. గతేడాది సౌతాఫ్రికాలో అక్కడి స్థానిక జట్లతో ఆడిన 3 మ్యాచ్‌ల్లో 11 గోల్స్ చేసి శభాష్ అనిపించుకుంది. ఈ ఏడాది బంగ్లాదేశ్‌తో జరిగిన ఆరు టెస్టుల్లో ఏకంగా 13 గోల్స్ చేసి భారత జట్టును ముందుండి గెలిపించింది. ప్రస్తుతం ఢిల్లీలోని ఎన్‌హెచ్‌ఏ అకాడమీకి ప్రాతినిధ్యం వహిస్తున్న మేరీ భారత మహిళల సీనియర్ జట్టులో చోటు సంపాదించడమే తన లక్ష్యమంటుంది. ప్రభుత్వం, దాతలు సాయమందిస్తే తన కెరీర్ అభ్యున్నతికి, ఆర్థిక కష్టాల్లో ఉన్న కుటుంబం గట్టెక్కడానికి ఉపయోగపడుతుందని మేరీ చెబుతుంది.



## మధ్యలో నా భార్య పేరెందుకు?

కోహ్లీ ఆవేదన

**న్యూఢిల్లీ:** ప్రతీ ఒక్కరికి తన భార్య అనుష్క శర్మ సులువైన లక్ష్యంగా మారిందని భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ ఆవేదన చెందాడు. వరల్డ్‌కప్ సమయంలో అనుష్కకు ఓ సెలెక్టర్ టీ అందించాడంటూ ఇటీవల మాజీ ఆటగాడు ఫరూఖ్ ఇంజనీర్ వ్యాఖ్యలు చేశాడు. దీనిపై కోహ్లీ స్పందిస్తూ.. 'శ్రీలంకతో జరిగిన ప్రపంచ కప్ మ్యాచ్‌ను చూసేందుకు అనుష్క స్టేడియానికి వచ్చింది. అది కూడా ఆమె సెలెక్టర్ల బాక్స్‌లో కాకుండా ఇద్దరు ఫ్రెండ్స్‌తో కలిసి ఫ్యామిలీ బాక్స్‌లో కూర్చుంది. ఆమెతో ఏ సెలెక్టర్ కూడా లేడు. అనుష్క సెలెబ్రిటీ కాబట్టి ఆమె పేరును వివాదాల్లోకి లాగి కొందరు లాభపడుతున్నారు. సెలెక్టర్ల గురించి మాట్లాడుతున్నప్పుడు అనవసరంగా నా భార్య పేరును తీసుకురావడం ఎందుకు? అదేపనిగా అబద్ధాలు చెబితే నిజమవుతాయనే ఉద్దేశంతోనే అనుష్క ఇటీవల స్పందించింది' అని కోహ్లీ తెలిపాడు.

**దురుద్దేశంతోనే శాస్త్రిపై విమర్శలు:** ఇటీవలి కాలంలో భారత జట్టు కోచ్ రవిశాస్త్రిపై సోషల్ మీడియాలో ట్రోలింగ్ ఎక్కువైందని, ఇదంతా కావాలనే చేస్తున్నారని కోహ్లీ వ్యాఖ్యానించాడు.



డేవిడ్ వార్నర్ (335)

1

డే/నైట్ టెస్టులో అత్యధిక వ్యక్తిగత స్కోరు (334)ను సాధించిన డేవిడ్ వార్నర్. అలాగే అడిలైడ్ స్టేడియంలో ఇదే ఉత్తమ ప్రదర్శన. గతంలో బ్రాడ్‌మన్ (299) ఇక్కడ అత్యధిక స్కోరు సాధించాడు.

ట్రిపుల్ శతకంతో చెలరేగిన ఓపెనర్

# వార్నర్ విధ్వంసం

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 589/3 డిక్లేర్

పాక్ తొలి ఇన్నింగ్స్ 96/6

యాషెస్ సిరీస్‌లో దారుణంగా విఫలమైన ఓపెనర్ డేవిడ్ వార్నర్ సొంత గడ్డపై మాత్రం ఆకాశమే హద్దుగా చెలరేగుతున్నాడు. ఇటీవల శ్రీలంకతో జరిగిన మూడు టీ20ల్లో అజేయంగా ఓ శతకం, రెండు అర్ధ శతకాలతో దుమ్ము రేపిన వార్నర్ పాకిస్థాన్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లోనూ బ్యాట్‌ను ఝుళిపిస్తున్నాడు. తొలి టెస్టుల్లో 154 పరుగులు చేసిన ఈ విధ్వంసకర ఓపెనర్ రెండో టెస్టులో ఏకంగా ట్రిపుల్ సెంచరీతో కెరీర్ బెస్ట్ సాధించాడు. దీంతో ఆసీస్ తరపున ఈ ఫార్మాట్‌లో డాన్ బ్రాడ్‌మన్‌ను అధిగమిస్తూ రెండో అత్యధిక వ్యక్తిగత స్కోరును అందుకున్నాడు.

> **1**
> టెస్టు క్రికెట్‌లో తక్కువ ఇన్నింగ్స్ (126)లోనే 7వేల పరుగులు పూర్తి చేసిన బ్యాట్స్‌మన్ స్టీవ్ స్మిత్. 1946లో వాలీ హ్యామండ్ (131) సాధించిన ఈ రికార్డు ఇన్నాళ్లకు బ్రేక్ అయింది. సెహ్వాగ్ (134) మూడో స్థానంలో ఉన్నాడు.

**అడిలైడ్:** ఫార్మాట్ ఏదైనా బౌలర్లను ఊచకోత కోస్తున్న ఆస్ట్రేలియా డాషింగ్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ (418 బంతుల్లో 39 ఫోర్లు, 1 సిక్స్‌తో 335 నాటౌట్) ట్రిపుల్ సెంచరీతో మురిపించాడు. వార్నర్ అద్భుత ఆటతీరుకు వన్‌డౌన్ బ్యాట్స్‌మన్ మార్నస్ లబుషేన్ (238 బంతుల్లో 22 ఫోర్లతో 162) కీలక ఇన్నింగ్స్ తోడవడంతో పాకిస్థాన్‌తో జరుగుతున్న రెండో టెస్టులో ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌ను 589/6 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. షహీన్ అఫ్రీదికి 3 వికెట్లు దక్కాయి. ఆ తర్వాత తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన పాక్ 35 ఓవర్లలో 6 వికెట్లకు 96 పరుగులు చేసి కష్టాల్లో పడింది. ప్రస్తుతం పాక్ ఆశలన్నీ బాబర్ ఆజమ్ (43 బ్యాటింగ్)పైనే. స్టార్క్‌కు 4 వికెట్లు దక్కాయి.

**వార్నర్ దూకుడు:** 302/1 ఓవర్‌నైట్ స్కోరుతో ఆసీస్ రెండో రోజు ఆట ప్రారంభించగా పాక్ బౌలర్ల గతి తప్పిన బౌలింగ్‌ను వార్న్ ఓ ఆటాడుకున్నాడు. తొలి సెషన్‌లోనే లబుషేన్‌ను షహీన్ బౌల్డ్ చేయడంతో రెండో వికెట్‌కు 361 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. పింక్ బాల్ టెస్టులో ఇదే అత్యధిక పార్ట్‌నర్‌షిప్ కావడం విశేషం. ఆ తర్వాత స్మిత్ (36)తో కలిసి డేవిడ్ వార్నర్ కదం తొక్కాడు. 260 బంతుల్లో డబుల్ సెంచరీ సాధించాక అతడి జోరు మరింత పెరిగింది. అయితే 226 పరుగుల వద్ద అతడు క్యాచ్ ఇచ్చినా బౌలర్ మూసా నోబాల్ వేయడంతో బతికిపోయాడు. ఆతర్వాత తన అత్యధిక స్కోరు 253ను కూడా దాటేస్తూ 389 బంతుల్లో తొలిసారిగా ట్రిపుల్ సాధించాడు. స్మిత్‌తో కలిసి వార్నర్ మూడో వికెట్‌కు 99 రన్స్ జోడించాడు. ఆతర్వాత బ్రాడ్‌మన్, మార్క్ టేలర్ పేరిట ఉన్న రెండో అత్యధిక స్కోరు (334)ను ఒక్క పరుగుతో వార్నర్ దాటేశాక కెప్టెన్ పైన్ ఆసీస్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశాడు. లేదంటే వార్నర్ జోరుకు లారా పేరిట ఉన్న 400 పరుగుల రికార్డు కూడా గల్లంతయ్యేది.

## 'దక్షిణాసియా' సంరంభం




- నేటి నుంచి దక్షిణాసియా క్రీడలు
- భారత పతాకధారిగా తేజిందర్

**ఖట్మాండు:** ప్రతిష్ఠాత్మక దక్షిణాసియా క్రీడలకు రంగం సిద్ధమైంది. ఆతిథ్య నేపాల్, భారత్, బంగ్లాదేశ్, భూటాన్, మాల్దీవులు, పాకిస్థాన్, శ్రీలంక దేశాల అథ్లెట్లు పాల్గొనే ఈ మెగా ఈవెంట్‌కు ఆదివారం తెరలేవనుంది. నేపాల్ రాజధాని ఖట్మాండులో మొత్తం పదిరోజుల పాటు ఈ క్రీడలు జరగనున్నాయి. గత ఈవెంట్ (2016లో)కు భారత్‌లో షిల్లాంగ్ ఆతిథ్యమిచ్చిన సంగతి తెలిసిందే. ఈసారి టోర్నీలో మొత్తం 27 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. జంబో జట్టుతో బరిలోకి దిగుతోన్న భారత్.. 17 క్రీడాంశాల్లో మాత్రమే పోటీపడుతోంది. ఇక, 75 మందితో కూడిన అథ్లెటిక్స్ బృందానికి షాట్‌పుటర్ తేజిందర్‌పాల్ సింగ్‌తో పాటు 1500 మీటర్ల రేసర్ పీయూ చిత్ర నేతృత్వం వహించనున్నారు.

**ఆరంభ వేడుకల్లో తేజిందర్ నేతృత్వంలో..:** దక్షిణాసియా క్రీడల ప్రారంభ కార్యక్రమంలో షాట్‌పుటర్ తేజిందర్‌పాల్ సింగ్ తూర్ భారత పతాకధారిగా వ్యవహరించనున్నాడు. ఆదివారం జరిగే ఆరంభ వేడుకల మార్చ్‌పాస్ట్‌లో ఆసియా క్రీడల చాంపియన్ తేజిందర్ భారత బృందాన్ని ముందుండి నడిపించనున్నాడు.

## గోపీ అకాడమీ వాళ్లకే చోటా..?

- బ్యాడ్మింటన్ జట్టు ఎంపికపై షట్లర్ ప్రజక్తా సావంత్ మండిపాటు



దక్షిణాసియా క్రీడల కోసం ప్రకటించిన భారత బ్యాడ్మింటన్ జట్టు ఎంపికపై డబుల్స్ క్రీడాకారిణి ప్రజక్తా సావంత్ అసంతృప్తి వ్యక్తం చేసింది. దేశవాళీ టోర్నీల్లో ఆడని వారిని సైతం జట్టులోకి తీసుకున్నారని, వెంటనే బాయ్ అధ్యక్షుడు హిమంత బిశ్వ వర్మ ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరింది. ఈ ఏడాది జాతీయ చాంపియన్‌షిప్ టైటిల్ సాధించిన డబుల్స్ జోడీ శిఖా గౌతమ్, అశ్విని భట్‌ల పేర్లు 11 మంది జాబితాలో లేకపోవడం దారుణమని ట్విటర్‌లో పేర్కొంది. గోపీచంద్ అకాడమీకి చెందిన వారికే భారత జట్టులో చోటుంటుందా? ఆలిండియా టోర్నీల్లో ఆడని వారికి నేరుగా జాతీయ జట్టులో ఎలా చోటు కల్పిస్తారు? అని వరుస ట్వీట్లతో ప్రజక్తా ప్రశ్నించింది.

# ఫైనల్లో సౌరభ్

- సెమీస్‌లో ఓడిన రీతూపర్ణ
- సయ్యద్ మోదీ బ్యాడ్మింటన్



**లఖ్‌నవ్:** సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్ సౌరభ్ వర్మ ఫైనల్‌కు చేరుకున్నాడు. శనివారం హోరాహోరీగా సాగిన పురుషుల సింగిల్స్ సెమీస్‌లో సౌరభ్ 21-17, 16-21, 21-18తో హియో కవాంగ్ (కొరియా)పై నెగ్గాడు. ఆదివారం జరిగే ఫైనల్లో వాంగ్ జు వి (తైవాన్)తో వర్మ తలపడనున్నాడు. కాగా, మహిళల సింగిల్స్ సెమీస్‌లో భారత అమ్మాయి రీతూపర్ణ దాస్ 22-24, 15-21తో పిట్యాపోర్న్ చైవాన్ (థాయ్‌లాండ్) చేతిలో పోరాడి ఓడింది.

## బాస్కెట్‌బాల్ విజేత హరియాణా



**యానాం (ఆంధ్రజ్యోతి):** తూర్పుగోదావరి జిల్లా భూభాగంలోని యానాం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియంలో జరిగిన జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్ బాస్కెట్‌బాల్ పోటీల్లో హర్యానా జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్లో చండీగఢ్‌పై హరియాణా గెలిచింది. తమిళనాడు జట్టుకు మూడోస్థానం దక్కింది. ఆరోగ్య, క్రీడల శాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు ముగింపు కార్యక్రమానికి హాజరై క్రీడాకారులకు ట్రోఫీలు అందజేశారు.

## న్యూజిలాండ్ 375

**హామిల్టన్:** ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో న్యూజిలాండ్ భారీ స్కోరు సాధించింది. డారిల్ మిషెల్ (73), వాట్లింగ్ (55) అర్ధ సెంచరీలు సాధించడంతో కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో 375 పరుగులకు ఆలౌటైంది. తొలిరోజు సెంచరీ సాధించిన లాథమ్ (105) త్వరగానే అవుటయ్యాడు. బ్రాడ్‌కు 4 వికెట్లు దక్కాయి. ఆ తర్వాత తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్.. రెండోరోజు ఆట ముగిసేసరికి 2 వికెట్లకు 39 రన్స్ చేసింది. క్రీజులో బర్న్స్ (24), రూట్ (6) ఉన్నారు.

## రాయ్ కృష్ణ థ్రిల్లింగ్ గోల్

- 2-2తో అట్లెటికో, ముంబై మ్యాచ్ డ్రా

**కోల్‌కతా:** ఐఎస్‌ఎల్‌లో శనివారం అట్లెటికో డి కోల్‌కతా, ముంబై ఎఫ్‌సీ మధ్య మ్యాచ్ 2-2తో డ్రా అయింది. 38వ నిమిషంలో అట్లెటికో ఆటగాడు మైకేల్ గోల్ చేశాడు. 62వ నిమిషంలో ముంబైకి చెందిన ప్రభాకర్ గోల్‌తో ఇరు జట్ల స్కోరు 1-1తో సమమైంది. ఇంజ్యూరీ టైమ్‌లో సెర్గీ కెవిన్ గోల్‌తో ముంబై 2-1 ఆధిక్యంలో కెళ్లింది. కానీ, ఆఖరి నిమిషంలో కెప్టెన్ రాయ్ కృష్ణ గోల్ చేసి అట్లెటికోను ఓటమి నుంచి కాపాడాడు.




Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

epaper.andhrajyothy.com